హైదరాబాద్
శనివారం
17-2-2018
సంపుటి: 2, సంచిక: 79
పేజీలు: 16+16, వెల: రూ. 5
/manamnews
www.manamnews.com

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA



క్యాంప్ కార్యాలయంలో అల్లోలకు స్వీటు తినిపిస్తున్న కేటీఆర్ తదితరులు

అల్లోలకు.. కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు

హైదరాబాద్, ఫిబ్రవరి 16(మనం ప్రతినిధి): రాష్ట్ర గృహ నిర్మాణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి జన్మదినం సందర్భంగా మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. బేగంపేటలోని క్యాంప్ కార్యాలయంలో అల్లోలకు పుష్పగుచ్ఛం అందజేసి, స్వీటు తినిపించారు. ఆయన ఇలాంటి జన్మ దినోత్సవాలు మరెన్నో జరుపుకోవాలని ఈ సందర్భంగా కేటీఆర్ ఆకాంక్షించారు. హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ మడుపు భూంరెడ్డి, ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్ రావు, గువ్వల బాలరాజు, భాస్కర రావు, గృహ నిర్మాణ శాఖ స్పెషల్ సీయస్ చిత్ర రామచంద్రన్, ఇతరులు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా సచివాలయంలోని ఆయన చాంబర్‌లో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రపతిని కలిసిన కడియం శ్రీహరి



ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతిని కలిసిన కడియం, సీతారాం నాయక్

- బాలికా విద్యపై దృష్టి పెట్టండి
- రాష్ట్రపతి రామ్‌నాథ్ సూచన

హైదరాబాద్, ఫిబ్రవరి 16(మనం ప్రతినిధి): రాష్ట్రంలో విద్యారంగంలో చేపడుతున్న కార్యక్రమాలపై తెలంగాణ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరిని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆరా తీశారు. బాలికా విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈమేరకు ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో తనను కలిసిన తెలంగాణ విద్యాశాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఎంపీ సీతారాం నాయక్‌లతో రామ్‌నాథ్ కోవింద్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పనులపై ఆరా తీశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత బాలికా విద్యపై ఎక్కువగా దృష్టిపెట్టామని రాష్ట్రపతికి వివరించినట్లు కడియం మీడియాకు వెల్లడించారు. తెలంగాణలో కొత్తగా 470 గురుకుల పాఠశాలలను ఏర్పాటుచేశామని, మరో 53 రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలను ఎస్సీ, ఎస్టీ మహిళలకోసం ఏర్పాటు చేసినట్లు ఆయనకు వివరించామన్నారు.

టీఆర్టీ నిలిపివేతకు హైకోర్టు నో



హైదరాబాద్, ఫిబ్రవరి 16(లీగల్ ప్రతినిధి): ఉపాధ్యాయ నియామక పరీక్ష(టీఆర్టీ) లను నిలిపివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. అయితే ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో పరీక్షలు నిర్వహించిన తర్వాత ఎస్.జి.టి. పోస్టుల ఫలితాలను బహిర్గతం చేయరాదని తెలంగాణ విద్యాశాఖ/జీఏడీల ముఖ్యకార్యదర్శులతోపాటు టీఎస్‌పీఎస్సీలను హైకోర్టు న్యాయమూర్తి ఎమ్మెస్ రామచంద్రరావు ఆదేశించారు. 2012లో జరిపిన డీఎస్సీ పరీక్షల్లో వరంగల్/ఖమ్మం జిల్లాల్లో దివ్యాంగులకు కేటాయించిన ఎస్జీటీ పోస్టులు 9, 5 చొప్పున 2012లో భర్తీ కాలేదని, వీటిని కూడా కలిపి టీఆర్టీ నిర్వహించాలని, అప్పటి వరకూ టీఆర్టీ నిర్వహణను ఆపేయాలని ఆ జిల్లాలకు చెందిన మల్లికార్జున్, మురళి వేరువేరుగా హైకోర్టుల్లో రిట్లు దాఖలు చేశారు. వీటిని శుక్రవారం హైకోర్టు విచారించి ఆ రెండు జిల్లాల్లో పరీక్షలు నిర్వహించాక ఎస్.జి.టి. ఫలితాల్ని వెల్లడించరాదని మధ్యంతర ఆదేశాలిచ్చింది. విచారణ రెండు వారాలకు వాయిదా పడింది.

269 మంది కానిస్టేబుళ్లకు పదోన్నతి

వరంగల్ అర్బన్, ఫిబ్రవరి 16(మనం న్యూస్): వరంగల్ ఉమ్మడి జిల్లాలోని (నగర పోలీస్ కమిషనరేట్, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా) పోలీసు విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 269 సివిల్ కానిస్టేబుల్స్‌కు హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పిస్తూ నగర పోలీసు కమిషనర్ జి.సుధీర్‌బాబు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. 1990, 1992 బ్యాచ్‌లకు చెందిన 257 సివిల్ కానిస్టేబుళ్లతోపాటు 2009 బ్యాచ్‌కు చెందిన 12 మంది మహిళా కానిస్టేబుళ్లు పదోన్నతి పొందారు. పోలీసు కమిషనరేట్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీ పదోన్నతి పొందిన సిబ్బంది భుజాలపై పట్టీలను అలంకరించారు. ఈ సందర్భంగా సీపీ సుధీర్‌బాబు మాట్లాడు తూ పదోన్నతి పొందిన వారు మరింత అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

బాధితుడికి కనీస వేతనం చెల్లించండి

- ఎస్పీడీసీఎల్‌కు కోర్టు ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 16(లీగల్ ప్రతినిధి): విద్యుత్ ప్రమాదంలో చేయి కోల్పోయిన కార్మికుడికి మానవీయకోణంలో ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వడం బాగానే ఉందని, అయితే ఆ కార్మికుడికి నెలకు రూ.5 వేలు మాత్రమే వేతనం నిర్ణయించడమే ఆమోదయోగ్యంగాలేదని హైకోర్టు ఆక్షేపణ తెలిపింది. కాంట్రాక్టర్ దగ్గర పనిచేసే వెంకటేశ్వర్లు 2011లో విద్యుత్ ప్రమాదంలో కుడిచేయి పోయింది. నాగర్‌కర్నూల్ జిల్లా రాచూర్ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుకు ప్రభుత్వం నెలకు రూ.5 వేల జీతంతో ఉద్యోగం ఇచ్చింది. ఆ జీతంలో కుటుంబపోషణ చేయలేకపోతున్నానని, కనీస వేతన ఇవ్వాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. గత ఆదేశాలను అధికారులు అమలు చేయకపోవంతో కోర్టు ధిక్కార వ్యాజ్యాన్ని వేశారు. దీనిని న్యాయమూర్తులు నాగార్జునరెడ్డి, శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం విచారించింది. కనీస వేతన చట్టం కింద జీతం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని బెంచ్ ఎస్పీడీసీఎల్ సీఎండీని ఆదేశించింది.

ఫార్మా ఉద్యోగాలపై ప్రభుత్వానికి నోటీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 16(లీగల్ ప్రతినిధి): తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉద్యోగాల కల్పన చేయడం లేదంటూ ఫార్మా కోర్సు పట్టభద్రులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిని హైకోర్టు న్యాయమూర్తి ఏవీ శేషసాయి శుక్రవారం విచారించి.. తెలంగాణ రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, కేంద్ర ఆరోగ్య శాఖ, భారత ఫార్మసీ కౌన్సిల్‌లకు నోటీసులు జారీచేశారు. ఫార్మా వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ ఈ రిట్ వేశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో కెరీర్, సృష్టి అవకాశాలు కల్పించడంలేదన్న ఈ కేసు విచారణ రెండు వారాలకు వాయిదా పడింది.

ఎర్రజొన్న రైతులకు ఐడీ కార్డులు

- వారి వద్దనుంచే కొనుగోళ్లు చేయాలి
- 12 క్వింటాళ్లు మించితే నిఘా పెట్టాలి
- దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- మార్కెటింగ్ శాఖలో రీసెర్చ్ విభాగం
- మార్కెట్‌లో పరిస్థితిపై పరిశోధించాలి
- అధికారులకు మంత్రి హరీశ్ ఆదేశాలు



వ్యవసాయ, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో సమీక్షిస్తున్న హరీశ్ రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (మనం ప్రతినిధి): ఎర్రజొన్నల సేకరణకు సంబంధించి అధికారులు తక్షణమే ఆర్మూరును సందర్శించాలని మార్కెటింగ్ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. ఎర్రజొన్నల కొనుగోలుకు ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో అంతకు ముందు తీసుకోవలసిన చర్యలకుగాను అక్కడ పర్యటించాలని వ్యవసాయ, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులను కోరారు. నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌తో పాటు వ్యవసాయ కమిషనర్, మార్కెటింగ్ డైరెక్టర్, మార్క్‌ఫెడ్ ఉన్నతా ధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. ఈ అంశంపై శుక్రవారం జలసౌధలో మంత్రి వివిధ శాఖల అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. ఎర్రజొన్న రైతులకు గుర్తింపు కార్డులను జారీ చేయాలని మంత్రి ఆదేశించారు. వ్యవసాయ విస్తరణాధికారి, మార్కెటింగ్, రెవెన్యూ అధికారులతో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీ పరిశీలన అనంతరమే నిజమైన రైతుల నుంచి ఎర్రజొన్నలు కొనుగోలు చేయాలని సూచించారు. ఎర్రజొన్న పండించిన అసలు రైతులకు మాత్రమే ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎకరానికి 12 క్వింటాళ్ళకు మించి ఎర్రజొన్నను మార్కెట్‌కు తీసుకు వచ్చే వారిపై విజిలెన్సు నిఘా పెట్టాలని కోరారు. కొనుగోలు చేసిన సరకుకు డబ్బును రైతు ఖాతాలోనే జమ చేయాలన్నారు. ఎర్రజొన్నల కొనుగోలుతో పాటు వాటిని నిల్వ చేయడం, ఎగుమతి చేయడం, అమ్మకాలు తదితర అంశాలపై ముందుగానే చర్యలు చేపట్టాలని సూచించారు. కర్ణాటకలో దాదాపు మూడున్నర లక్షల క్వింటాళ్ల ఎర్రజొన్న నిల్వలు ఉన్నట్టు సమాచారం అందిందని, అక్కడ క్వింటాకు ధర 1,600 రూపాయలు ఉన్నందున అవి రాష్ట్రానికి దిగుమతి కావచ్చునని అన్నారు. వాటితో పాటు తెలంగాణ జిల్లాల్లో మరికొన్ని చోట్ల కోల్డ్‌స్టోరేజ్ లలో గత సీజన్ నుంచి నిల్వ ఉంచిన సరకు కూడా పెద్దఎత్తున వచ్చే అవకాశం ఉందన్నారు. వాటన్నింటినీ అరికట్టాలని కోరారు. నిజామాబాద్‌తో పాటు తూప్రాన్, మేడ్చల్, రామాయంపేట వంటి చోట్ల కోల్డ్ స్టోరేజ్ లలో ఉన్న ఎర్రజొన్న నిల్వల వివరాలు సేకరించాలని కోరారు. ఎర్రజొన్న క్రయ, విక్రయాలలో అవకతవకలు, అక్రమాలకు పాల్పడే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ మంత్రి సూచించారు. మార్కెటింగ్ రంగంలో పరిశోధనా విభాగం ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఇతర దేశాల్లో, మన దేశంలోని ఇతర రాష్ట్రాల్లో మార్కెటింగ్ రంగంలో అమలు చేస్తున్న కార్యక్రమాలు, కొత్తగా వస్తున్న ధోరణులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఇలాంటి పరిశోధనా కేంద్రం అవసరమన్నారు. వచ్చే ఏడాదికి తెలంగాణలో సాగునీటి వసతి అనూహ్యంగా పెరగనున్నందున దిగుబడిని కూడా ముందుగానే అంచనా వేయవలసి ఉంటుందన్నారు. ఆయా పంటల దిగుబడికి అనుగుణంగా మార్కెట్ సౌకర్యాలు, స్టోరేజ్ వసతి నెలకొల్పాలని సూచించారు. మార్కెటింగ్‌లో రీసెర్చ్ విభాగం నిరంతరం పరిశోధన, సమాచార సేకరణ, విశ్లేషణకు ఉపయోగపడుతుందన్నారు.



సనత్‌నగర్ నియోజకవర్గంలో తలసానితో కలిసి పర్యటిస్తున్న హరీశ్ రావు

బస్తీల్లో మంత్రుల పర్యటన

- వెంగళ్‌రావునగర్, శ్యామలకుంటలో హరీశ్, తలసాని
- డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మిస్తామని హామీ

హైదరాబాద్, ఫిబ్రవరి 16(మనం ప్రతినిధి): వచ్చే ఏడాదిలోగా హైదరాబాద్‌లో లక్ష బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇస్తామని మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారు. శుక్రవారం మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ సనత్‌నగర్ నియోజకవర్గం మినిస్టర్స్ రోడ్డు బస్తీ, శ్యామలకుంటలో ఉన్నతాధికారులతో కలిసి పర్యటించారు. అక్కడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తీసుకోవాల్సిన చర్యలపై అక్కడికక్కడే అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ''బస్తీ వాసులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టించాలనే ఇక్కడికి వచ్చాం. గతంలో కాంగ్రెస్ వాళ్లు పక్కన కొన్ని ఇండ్లు కట్టి మిమ్ములను అక్కడకు పంపి ఈ స్థలాన్నంతా కబ్జా చేద్దామని అనుకున్నారు. కానీ మీరు వారి కాళ్లు ఇరగొట్టి పంపారు. శ్యామల కుంట పక్కన అద్భుతమైన కాలనీలు ఉన్నాయి. ఇక్కడ పక్కా డబల్ బెడ్‌రూమ్ ఇండ్లు కట్టిస్తాం. కోర్టుల్లో కొన్ని కేసులు ఉన్నా వాటిని అధిగమిస్తాం. ఇండ్లు నిర్మించి ఇచ్చేందుకే అన్ని శాఖల అధికారులు ఇక్కడికి వచ్చారు. రెండు మూడు రోజుల్లో చర్చలు జరిపి ఇక్కడ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మిస్తాం'' అని పేర్కొన్నారు. మంత్రులు వెంట స్థానిక నాయకులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పది చదివితేనే సర్పంచ్‌కు పోటీ అర్హత?


- పంచాయతీరాజ్ చట్టంలో సవరణ
- సీఎం కేసీఆర్‌కు సబ్ కమిటీ నివేదిక!



హైదరాబాద్, ఫిబ్రవరి 16 (మనం ప్రతినిధి): పంచాయతీరాజ్ చట్టంలో పలు సంస్కరణలకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో త్వరలో జరుగనున్న పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌కు విద్యార్హత నిర్ణయించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే సర్పంచ్‌కు పోటీ చేసే వారికి కనీస విద్యార్హత పదోతరగతి ఉండాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్టు విశ్వసనీయ సమాచారం. పంచాయతీరాజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన ఏర్పడిన మంత్రి వర్గ సబ్ కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. సీఎం కేసీఆర్‌కు ఇందుకు సంబంధించిన నివేదికను అందజేసినట్టు తెలిసింది. పంజాబ్, హర్యాన రాష్ట్రాల్లో సర్పంచ్ ఎన్నికలకు పోటీ చేసే వారికి కనీస విద్యార్హత పదోతరగతిగా అమలు చేస్తున్నారు. సర్పంచ్ ఎన్నికకు పోటీ చేసే వారికి ఇప్పటి వరకు ఎటువంటి విద్యార్హత లేదు. తెలంగాణ రాష్ట్రంలో 70 శాతం మంది పదో తరగతి పూర్తి చేయని వారే సర్పంచులుగా ఉన్నారు. అంతేకాకుండా ప్రాథమిక విద్యనభ్యసించిన వారే ఎక్కువగా ఉండటం గమనార్హం. కేవలం సంతకానికే పరిమితమైన వారూ ఉన్నారు. ఈ క్రమంలో వారి కుటుంబసభ్యులు, ఆయా పార్టీల ముఖ్యులే పంచాయతీ వ్యవహారాలు చూస్తున్నారు. పంచాయతీలలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో నిధులు, అధికార దుర్వినియోగం అవుతుందని ప్రభుత్వం దృష్టికి వచ్చింది. కాగా,ఎమ్మెల్యే, ఎంపీలుగా పోటీ చేసేందుకు కనీస విద్యార్హత లేదు. ఎమ్మెల్యే, ఎంపీలకు పోటీ చేయడానికి ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ ఉండకూడదనే నిబంధన లేదు. కానీ ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ ఉంటే సర్పంచ్‌గా పోటీ చేయడానికి వీలు లేదు. చట్టాలను చేసే శాసనసభ, పార్లమెంట్‌లలో పోటీ చేసే వారికి విద్యార్థత లేదు, కేవలం సర్పంచ్‌గా పోటీ చేసే వారికి విద్యార్హత నిబంధన విధించటం పట్ల కొందరు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

సీఐఎస్ఎఫ్ ఐజీగా సీవీ ఆనంద్

- డిప్యూటేషన్‌పై కేంద్ర సర్వీసుకు..
- ఐదేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగింపు



సీవీ ఆనంద్(ఫైల్)

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (మనం ప్రతినిధి): పౌరసరసరఫరాల కమిషనర్, ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ కేంద్ర సర్వీసులకు బదిలీ అయ్యారు. సీఐఎస్ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్) ఐజీగా ఆయన నియమితులయ్యారు. ఐదేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమాచారం అందింది. 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్.. గతంలో హైదరాబాద్ నగర ట్రాఫిక్ కమిషనర్‌గా సమర్థంగా బాధ్యతలు నిర్వహించి అందరి ప్రశంసలూ అందుకున్నారు. అనంతరం.. పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి.. పౌరసరఫరఫరాల విభాగాన్ని పటిష్ఠం చేసేందుకు కృషి చేశారు. సాంకేతిక ఆధాకరంగా అనేక వినూత్న పద్ధతులు ప్రవేశపెట్టారు. అయితే.. రాష్ట్ర ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యం లభించట్లేదనే ఉద్దేశంతోనే ఆయన కేంద్ర సర్వీసులకు వెళ్లేందుకు సిద్ధపడినట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి.

మైనింగ్ రంగం అభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యం

- రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి జోగు రామన్న
- ముగిసిన మైనింగ్ టుడే-2018 సదస్సు
- సింగరేణి దేశానికే తలమానికం: జగదీశ్వర్ రెడ్డి



జోగు రామన్న(ఫైల్)

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (మనం ప్రతినిధి): మానవాళికి, జంతుజాలానికి ముప్పు వాటిల్లకుండా గనుల వ్యవస్థను ముందుకు తీసుకుపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అటవీ, పర్యావరణ, బీసీ సంక్షేమ శాఖల మంత్రి జోగు రామన్న అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో శుక్రవారం జరిగిన మైనింగ్ టుడే-2018 అంతర్జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనింగ్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందన్నారు. కేసీఆర్, కేటీఆర్‌ల ప్రోత్సాహంతో ఈ సదస్సును నిర్వహించుకుంటున్నామని, గనుల రంగంలో వినియోగిస్తున్న సాంకేతికత గురించి చర్చించడానికి సదస్సు ఉపయోగపడిందని తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కొత్త ఆలోచనలకు మైనింగ్ సదస్సు ఓ వేదికగా నిలిచిందన్నారు. సింగరేణి దేశానికే తలమానికమని, నష్టాలను తగ్గించుకుని లాభాల బాటలో ముందుకు పోతుందన్నారు. మైనింగ్ అంటే మాఫియా నుంచి నేడు ప్రజలకు ఉపయోగపడే వ్యవస్థగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో జయేష్ రంజన్, ఎన్ఎమ్‌డీసీ చైర్మన్ నంద, మైనింగ్ టుడే చైర్మన్ సుశీల్ కుమార్, వినోద్ కుమార్, డాక్టర్ వీఎన్. వాసుదేవ్, అఖిలేష్, ఎన్‌కె.నంద, సెరి సుభాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ అంటే కేసీఆర్‌కు భయం: షబ్బీర్ అలీ

హైదరాబాద్, ఫిబ్రవరి 16(మనం ప్రతినిధి): హైదరాబాద్‌లో పులిలా మాట్లాడే కేసీఆర్ ఢిల్లీలో పిల్లిలా మారిపోతున్నారని శాసనమండలిలో కాంగ్రెస్ పక్ష నాయకుడు షబ్బీర్ అలీ విమర్శించారు. మోదీ చూసి ఎందుక అంతలా భయపడుతున్నారో కేసీఆర్ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పొంగులేటి సుధాకర్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన అసెంబ్లీ మీడియా హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ.40 వేలు కోట్లు రావాలని చెప్పిన కేసీఆర్, వెనుకబడిన జిల్లా అభివృద్ధికి రావాల్సిన నిధులు రూ.450 కోట్లు ఇవ్వాలంటూ జైట్లీకి వినతిపత్రం ఇవ్వడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. కర్ణాటకలో 40 కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే మన రాష్ట్రంలో నియోజకవర్గానికి నాలుగు కేంద్రాలు కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. నిజామాబాద్ జిల్లా పసుపు రైతులకు మద్దతు ధర చెల్లించాలన్నారు. పొంగులేటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో జమాయిల్, సుబాబుల్ రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రెండు రాష్ట్రాలు తనకు సమానమంటున్న పవన్ కళ్యాణ్ తెలంగాణ సమస్యలపై నోరు ఎందుకు విప్పడం లేదో చెప్పాలని ప్రశ్నించారు.

పాతాళానికి చేరుతున్న నీరు

వేగంగా పడిపోతున్న భూగర్భ జలాలు

- వర్షాబావం, అధిక వినియోగమే కారణం
- వేసవి ప్రారంభానికి ముందే ఆందోళన
- సమస్యపై ప్రభుత్వం దృష్టి సారించాలి



(ఫైల్ ఫొటో)

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో భూ గర్భ జలాల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. భూగర్భ జల నిల్వలు వేగంగా పడిపోతున్నాయి. బోర్ల నుంచి భారీగా నీటిని తోడుతుండటంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ఏప్రిల్, మే నెలల్లో తాగునీటి కష్టాలు తప్పవని అధికారులు అంటున్నారు. వేసవి ప్రారంభానికి ముందే పరిస్థితి ఇలా మారడంతో యాసంగి పంటతో పాటు తాగునీటికి ఇబ్బంది కలిగే పరిస్థితి. కరీంనగర్, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో కురవాల్సిన దానికన్నా తక్కువ వర్షపాతం నమోదయ్యింది. గత జనవరి నుంచి ఈ ఏడాది జనవరి వరకు జగిత్యాలలో 982 మిల్లిమీటర్లు వర్షపాతం కురవాల్సి ఉండగా కేవలం 646 మి. మీ. వర్షపాతమే కురిసింది. పెద్దపల్లిలో 1009మి.మీకు గానూ 695మి. మీ. వర్షం కురిసింది. రాజన్న సిరిసిల్లాలో 861 మి.మీ.గానూ 628మి. మీ. వర్షం మాత్రమే నమోదైంది. దీంతో భూగర్భజలాలు ఆశించిన మేర పెరగడంలేదు. పెద్దపల్లి జిల్లా మంథనిలో 24.85 మీటర్లు, వేములవాడ అర్బన్‌లో 26.24 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. రాష్ట్ర సరాసరి 10 మీటర్ల లోపు భూగర్భజలాలు ఉండాలి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో డిసెంబర్, జనవరి మాసాల్లో భూగర్భజలాలు పడిపోతున్నట్టుగా నివేదికలు పేర్కొంటున్నాయి. జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో రెండు నుంచి మూడున్నర మీటర్ల లోతుకు పైగా భూగర్భజలాలు పడిపోయినట్టుగా తెలుస్తుంది. జిల్లాలోని రఘునాథపాలెం మండలం ఈర్లపుడి గ్రామంలో అత్యధికంగా భూగర్భ జల నీటి మట్టం పడిపోయింది. డిసెంబర్లో 9.25 మీటర్ల లోతులో ఉన్న నీరు జనవరిలో 12.60 మీటర్ల లోతుకు పడిపోయింది. మెదక్ జిల్లాలో జనవరి నాటికి 15 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. 2017 మే నెలలో 16.72 మీటర్ల లోతుకు నీళ్ల వెళ్లాయి. ఇదే నెలలో నాగర్‌కర్నూల్‌లో 17.47 మీటర్లలోతుకు భూగర్భజలాలు చేరుకోవటం కొంత ఆందోళన కలిగించే విషయం. 2018 జనవరిలో 13.14 మీటర్లలోతులో నీళ్ల దొరుకుతున్నాయి. 2018 జనవరిలో రంగారెడ్డి జిల్లాలో 12.17 మీటర్లు, వికారాబాద్ జిల్లాలో 12.92 మీటర్లు, సంగారెడ్డి జిల్లాలో 12.67 మీటర్లు, సిద్దిపేట్ జిల్లాలో 13.44మీటర్లు, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 13.44మీటర్లు, కామారెడ్డి జిల్లాలో 12.14 మీటర్లు, మహబూబ్‌నగర్ జిల్లాలో 11.69 మీటర్లు, నిజామాబాద్ జిల్లాలో 11.45, యాదాద్రి జిల్లాలో 11.01మీటర్ల లోతులో నీళ్లు దొరుకుతున్నాయి. రాష్ట్ర సరాసరి ప్రకారం 10 మీటర్ల లోపే నీళ్లు దొరకాల్సి ఉన్నప్పటికీ జనవరి మాసంలోనే ఈ విధంగా ఉంటే ఇక ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాల్లో అడుగంటిన జలం..


రంగారెడ్డి జిల్లాలో 2017 జనవరి 2018 జనవరి వరకు పరిశీలిస్తే 4.16 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. ఇదే క్రమంలో హైదరాబాద్‌లో మాత్రం కేవలం 0.22 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరగటం గమనార్హం. సంగారెడ్డి జిల్లాలో గత మే నెలలో 19.45 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయిన దాఖలాలున్నాయి. సంగారెడ్డి జిల్లాలో గత జనవరిలో 12.59 మీటర్ల లోతులో జలాలు ఉంటే 2018 జనవరిలో 12.67 మీటర్ల లోతుకు నీళ్లు చేరాయి. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట్, కామారెడ్డి జిల్లాల్లో 2017 జనవరిలో రాష్ట్ర సరాసరి కన్నా రెండు నుంచి మూడున్నర మీటర్ల మేర అడుక్కి భూగర్భ జలాలు చేరుకున్నాయి. 2016లో మేలో రాష్ట్ర సరాసరి భూగర్భజలాలు 15.62 మీటర్లు కాగా 15 జిల్లాల్లో అడుగంటిన దాఖలాలున్నాయి. మెదక్‌లో 29.09 మీటర్లు, సిద్దిపేటలో 28.74 మీటర్లు, సంగారెడ్డి జిల్లాలో 23.90 మీటర్ల మేర భూగర్భ జలాలు పడిపోయాయి. 2017 మేలో రాష్ట్ర సరాసరి 12.35 మీటర్లు కాగా సంగారెడ్డి జిల్లాలో 19.45 మీటర్లు, రంగారెడ్డి జిల్లాలో 18.37 మీటర్లు, మెదక్ జిల్లాలో 17.63 మీటర్లు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 17.47 మీటర్లు, మహబూబ్‌నగర్ జిల్లాలో 16.72 మీటర్లు, సిద్దిపేట్ జిల్లాలో 16.03 మీటర్లు, కామారెడ్డి జిల్లాలో 15.52 మీటర్ల మేర భూగర్భ జలాలు అడుగంటాయి. ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే ఈ వేసవి నాటికి భూగర్భ జలాలు మరింతగా అడుగంటే అవకాశం ఉందని భూగర్భ జల అధికారులు ఆందోళన చెందుతున్నారు. అయితే నీటి నిల్వలు పడిపోవడానికి సంబంధించిన కారణాలపై పరిశీలన చేయనున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.

హైదరాబాద్
శనివారం
17-2-2018
సంపుటి: 2, సంచిక: 79
పేజీలు: 16+16, వెల: రూ. 5
/manamnews
www.manamnews.com

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA



ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు
ఆదాయ మార్గాలను
వెల్లడించాల్సిందే

14 లో..

నీరవ్ పాస్‌పోర్టు సస్పెన్షన్

బంధువు మెహుల్ చోక్సీది కూడా..

నాలుగువారాలపాటు అమలు: విదేశాంగశాఖ

వారంలోగా విచారణకు హాజరుకండి

నీరవ్, చోక్సీలకు ఈడీ సమన్లు

రెండో రోజూ కొనసాగిన సోదాలు

14 లో..

ఎదురులేని నేత



రక్తపుబొట్టు చిందకుండా రాష్ట్ర సాధన

పలు ఉద్యమాలకు స్ఫూర్తిగా కేసీఆర్

- రాష్ట్రంలో సమస్యలపై పూర్తి అవగాహన
- సవాళ్లను అధిగమించి.. సతతం శ్రమించి
- పలు రంగాల్లో రాష్ట్రం నెంబర్ వన్
- నిధులు, నియామకాలు, నీళ్లు...
- వీటి సాధనే లక్ష్యంగా నిరంతర కృషి

నేడు 64వ పడిలోకి ముఖ్యమంత్రి

ధూంధాంగా వేడుకలకు శ్రేణుల ఏర్పాట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (మనం ప్రతినిధి):

దశాబ్దాల తెలంగాణ కలను సాకారం చేసిన పోరాట యోధుడు ఆయన. రెండోదశ తెలంగాణ ఉద్యమాన్ని అత్యంత శాంతియుతంగా నడిపి, విజయం సాధించిన ఘనత ఆయన సొంతం. ప్రత్యేకరాష్ట్ర ఉద్యమాన్ని నడిపిస్తూనే, తెలంగాణకు అనుకూలంగా దేశంలోని అన్ని పార్టీల మద్దతు కూడగట్టేందుకు కృషిచేశారు. రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల సమస్యలపై ఆయనకు క్షుణ్ణంగా అవగాహన ఉంది. తెలంగాణ బలం, బలహీనతలు ఆయనకు బాగా తెలుసు. ప్రజా నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు శనివారం 64వ జన్మదినోత్సవం జరుపుకుంటున్నారు.

2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయం సాధించడంతో కేసీఆర్ తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. విడిపోతే తెలంగాణ అన్ని రంగాల్లో నష్టపోతుందన్న వాదనను సవాల్‌గా తీసుకున్న ఆయన నాలుగేళ్లుగా నిరంతరం శ్రమించి.. రాష్ట్రాన్ని అనేక అంశాల్లో మిగతా 6లో..



వీసా నిబంధనలు ఇక సరళం

చమురు, గ్యాస్ వనరులు అందించేందుకు సిద్ధం

- ఇరాన్ అధ్యక్షుడు రోహానీ హామీ
- కుతుబ్‌షాహీ టూంబ్స్ సందర్శన
- మక్కా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు



హైదరాబాద్, ఫిబ్రవరి 16 (మనం ప్రతినిధి):

భారత పౌరుల కోసం తమ దేశ వీసా నిబంధనలు సరళీకరించేందుకు తాము సంసిద్ధంగా ఉన్నామని ఇరాన్ అధ్యక్షుడు హసన్ రోహానీ ప్రకటించారు. భారత్‌తో పూర్వం నుంచే మంచి సంబంధాలున్నాయని గుర్తు చేస్తూ.. తమ దేశంలోని చమురు, గ్యాస్ వనరులను భారత్‌కు అందించేందుకు సంసిద్ధంగా ఉన్నామన్నారు. భారత్‌లో రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం హైదరాబాద్‌కు వచ్చిన రోహానీ.. శుక్రవారం చారిత్రక మక్కా మిగతా 6లో..



థ్యాంక్యూ..
ఇవి చదివి వచ్చే పుట్టినరోజు నాటికి
మా విజ్ఞానాన్ని వెదజల్లుతాం సార్..!

లొంగిపోయిన పురుషోత్తంరెడ్డి



రెండు వారాల పాటు రిమాండ్

ఏసీబీ దాడి విషయం తెలిసి జంప్

- ఆరు బృందాలు వెదికినా..
- 2 వారాలపాటు చిక్కని ఆచూకీ
- వాట్సప్‌తో కుతుళ్లతో టచ్‌లో..
- లొంగిపోతే మంచిదని ఏసీబీ హెచ్చరిక
- శుక్రవారం ఏసీబీ కోర్టులో ప్రత్యక్షం
- లాకర్లలో బయటపడ్డ వజ్రాభరణాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 16(మనం లీగల్ ప్రతినిధి):

హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ పురుషోత్తం రెడ్డికి ఏసీబీ కోర్టు రెండు వారాల పాటు రిమాండ్ విధించింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న పురుషోత్తంరెడ్డి ఈ నెల 2వ తేదీ నుంచి పరారీలో ఉన్న విషయం తెలిసిందే! తాజాగా శుక్రవారం ఆయన నాటకీయ పరిణామాల మధ్య సిటీ సివిల్ కోర్టు ప్రాంగణంలోని ఏసీబీ కోర్టులో లొంగిపోయారు. రెండు వారాల క్రితం మిగతా 6లో..

'డబుల్'కు తక్కువ ధరకే స్టీల్

రూ.43,660కు టన్ను ఉక్కు..అంగీకరించిన ఉక్కు కంపెనీలు

ప్రభుత్వంపై తగ్గిన 264.60 కోట్ల భారం

ఫలించిన కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి ప్రయత్నాలు



హైదరాబాద్, ఫిబ్రవరి 16 (మనం ప్రతినిధి):

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి తక్కువ ధరకే కంపెనీలు ఉక్కును విక్రయించేలా మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి చేసిన ప్రయత్నాలు ఫలించాయి. టన్ను ఉక్కును రూ. 43,660కు విక్రయించేందుకు స్టీల్ కంపెనీల యజమానులు అంగీకరించారు. శుక్రవారం మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డితో కంపెనీల ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్టీలును బేస్ రేట్‌కు అందించాలని మంత్రులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా మిగతా 6లో..

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో శనివారం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలలో మార్పులేదు. చలిగాలుల తీవ్రత స్వల్పంగా పెరుగుతుంది. గంటకు 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 33 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 17 డిగ్రీలు

గాలిలో తేమ: 35 శాతం

ముహూర్తం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథిః విదియ తె.4.51 తదుపరి తదియ; నక్షత్రం: శతభిషం ఉ.11.25 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: సా.6.11 – 7.52; దుర్ముహూర్తం: ఉ.6.46 – 8.17; రాహుకాలం: ఉ.9.38 – 11.04; అమృతఘడియలు: తె.3.44 – 5.27; శుభసమయం : ఉ.11.05–1.00;

సూర్యోదయం: 6.46,

సూర్యాస్తమయం: 6.15



2 లో..

ఎర్రజొన్న రైతులకు ఐడీ కార్డులు

- వారి వద్దనుంచే కొనుగోళ్లు చేయాలి
- 12 క్వింటాళ్లు మించితే నిఘా పెట్టాలి
- దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- మార్కెటింగ్ శాఖలో రీసెర్చ్ విభాగం
- మార్కెట్‌లో పరిస్థితిపై పరిశోధించాలి
- అధికారులకు మంత్రి హరీశ్ ఆదేశాలు

తమిళ తంబికి రొంబ షాక్!



6 లో..

కావేరీ జలాల్లో 14.75 టీఎంసీల కోత

- ఆమేర కర్ణాటకకు వాటా పెంచిన సుప్రీం
- కేరళకు 30, పుదుచ్చేరికి 7 టీఎంసీలు
- బెంగళూరు నీటి అవసరాలూ ముఖ్యమే
- తుది తీర్పు వెల్లడించిన సుప్రీంకోర్టు
- 15 సంవత్సరాల పాటు అమలులో తీర్పు
- మండిపడుతున్న తమిళనాడు వాసులు
- సర్కారు విఫలమైందంటున్న డీఎంకే



సీఐఎస్ఎఫ్ ఐజీగా సీవీ ఆనంద్

డిప్యూటేషన్‌పై కేంద్ర సర్వీసుకు..

ఐదేళ్ల పాటు ఆ పదవిలో..

2 లో..

పది చదివితేనే సర్పంచ్‌కు పోటీ?

- పంచాయతీరాజ్ చట్టంలో సవరణ
- సీఎం కేసీఆర్‌కు సబ్ కమిటీ నివేదిక!



మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
శనివారం, ఫిబ్రవరి 17

ఘరానా మోసం


ఆధునిక భారత దేశ చరిత్రకు స్కాంలే మైలురాళ్లుగా నిలిచాయనిపిస్తోంది. 1948లో వి.కె. కృష్ణమీనన్ ప్రొటోకాల్ పక్కనపెట్టి ఒక విదేశీ సంస్థతో రూ.80 లక్షల రూపాయల జీపుల కొనుగోలు ఒప్పందం చేసుకున్నప్పటి నుంచి యూపీఏ హయాంలో 2జీ, కామన్‌వెల్త్ గేమ్స్, నేడు రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోళ్లు, పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) మోసం దాకా వివిధ రకాల స్కాంలు ప్రభుత్వ విధానాలకు అద్దం పడుతున్నాయి. ప్రభుత్వ బ్యాంకింగ్ రంగం ఇప్పటికే ఏడున్నర లక్షల కోట్ల మొండి బకాయిల సంక్షోభంలో కూరుకుపోయి ఉంటే, పీఎన్‌బీ కుంభకోణంతో ఆ రంగంపై ప్రజల నమ్మకాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. సకాలంలో, తగినంత పెట్టుబడులు అందక, ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో ఇరుక్కుని దేశ రైతాంగం అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటుంటే, కార్పొరేట్ ఘరానా మోసగాళ్లకు మాత్రం రుణ మాఫీలు, సబ్సిడీలు, ప్రోత్సాహకాలు, బెయిల్ ఔట్ ప్యాకేజీలు, పన్ను రాయితీలతో ప్రభుత్వాలు నీరాజనాలు పడుతుండడం దారుణం. కార్పొరేట్ అభివృద్ధి నమూనాతో సాగుతున్న ప్రభుత్వ విధానాల నేపథ్యంలో ప్రజాధనాన్ని స్వాహా చేసే బడా స్కాంలు వెలుగులోకి వస్తున్నాయి. వెలుగులోకి రాని చీకటికోణాలు ఎన్నో ఊహించడమే కష్టం. దక్షిణ ముంబయిలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు అధికారులను అడ్డుపెట్టుకొని ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ పదకొండున్నర వేల కోట్ల రూపాయల మేర మోసం చేయడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఒక బ్యాంకు మరో బ్యాంకు శాఖకు అవగాహనా లేఖ (లెటర్ ఆఫ్ అండర్ స్టాండిగ్ లేదా ఎల్‌ఓయూ) అంటే రుణగ్రహీత చెల్లించకుంటే తాను చెల్లిస్తానని హామీ ఇచ్చే విధానాన్ని అడ్డంపెట్టుకుని నీరవ్ మోదీ విదేశీ బ్యాంకుల నుంచి సొమ్ము తీసుకుని టోకరా ఇచ్చాడు. పీఎన్‌బీ నుంచి దొంగచాటుగా జారీ అయిన ఎల్‌ఓయూలను నీరవ్ అండ్ కో పలు స్వదేశీ, విదేశీ బ్యాంకుల్లో దాఖలు చేసి భారీమొత్తంలో సొమ్ము మూటగట్టుకుని కుటుంబంతో సహా విదేశాలకు పారిపోయాడు.

ప్రతి బ్యాంకులోనూ ఎల్‌ఓయూ లావాదేవీలు ఇదే తీరులో జరుగుతాయి, కాకపోతే ఎక్కడైనా పెద్దమొత్తంలో ఆ లావాదేవీల్లో అడ్డంకులు ఎదురైనపుడు మాత్రమే అది స్కాంల రూపంలో బయటపడుతాయి. మరో మూడు వజ్రాల కంపెనీలు కూడా ఇదే విధంగా పీఎన్‌బీని మోసం చేసినట్లు సమాచారం. ఐదేళ్ల క్రితం విన్‌సమ్ గ్రూప్ అనే వజ్రాల సంస్థ యజమానులైన మెహతాలు కూడా స్టాండ్ బై క్రెడిట్ లెటర్స్‌ను ఉపయోగించి రూ.1600 కోట్లు మోసంపై సీబీఐ దర్యాప్తు నడుస్తున్నప్పటికీ పీఎన్‌బీ జాగ్రత్త పడలేదంటే ఏమనుకోవాలి? లలిత్ మోదీ, విజయ్‌మాల్యా లాంటివాళ్ళు ప్రభుత్వ బ్యాంకుల సొమ్ము వేల కోట్లు ఎగవేసి దేశం విడిచి పారిపోయిన అనుభవం ఉన్నప్పటికీ అలాంటివి మళ్లీ జరగకుండా బ్యాంకింగ్ రంగంలో విధానపరమైన సంస్కరణలు చేపట్టడంలో ప్రభుత్వాలు శషభిషలాడుతున్నాయి. స్కాంలు బయటపడినపుడు అందుకు బాధ్యులైన ఒకరిద్దరు అధికారులను శిక్షించడం పరిష్కారం కాదు, అలాంటివి జరిగేందుకు తావిచ్చే విధాన వైకల్యాన్ని సరిచేయాలి. ఏడేళ్లుగా సాగుతున్న మోదీ మోసంలో ఎల్‌వోయూ ఇచ్చిన బ్యాంకు అధికారులే కాదు, వాటి విశ్వసనీయతను తేల్చుకోకుండా గుడ్డిగా రుణాలిచ్చిన ఇతర బ్యాంకులను, ఈ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్న ఆర్‌బీఐను, ద్రవ్య లావాదేవీలను పర్యవేక్షిస్తున్న ఇతర ప్రభుత్వ యంత్రాంగాలను ఈ స్కాంకు బాధ్యులుగా చేసి విచారించాలి. ఎల్‌వోయూ లావాదేవీల విధానం వాణిజ్య కార్యకలాపాలకు ఉత్ప్రేరకంగా పనికి వచ్చే మాటేమో గాని, దాన్ని అడ్డంపెట్టుకొని జరుగుతున్న మోసాలు ఎన్నో వెలుగులోకి రాకుండానే ఉన్నాయి.

మొండి బాకీల సంక్షోభం యూపీఏ ప్రభుత్వం అనుసరించిన ఆశ్రిత పెట్టుబడిదారీ విధాన ఫలితమేనని, దాన్ని పరిష్కరించేందుకు రూ.2.11 లక్షల కోట్లు ప్రభుత్వ బ్యాంకులకు సమకూర్చడానికి అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. బ్యాంకులు మోసగాళ్ళకు ఇచ్చి నష్టపోతుంటే, ఆ నష్టాన్ని పూడ్చేందుకు కేంద్రప్రభుత్వం ప్రజాధనాన్ని వెచ్చిస్తోంది. ప్రస్తుతం దేశంలోని బ్యాంకుల్లో డిపాజిట్ల రూపంలో రూ.110 లక్షలకోట్ల ప్రజాధనం ఉంటే, బ్యాంకుల్లో అప్పులు, లోన్లు తీసుకొని ఎగనామం పెట్టిన మొండిబాకీలు రూ. 15 లక్షల కోట్లలో 75 శాతం బడా కార్పొరేట్ల కంపెనీలవే. బడా కార్పొరేట్ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం రూ. 7 లక్షల కోట్లు సబ్సిడీ రూపంలో సమకూరుస్తున్నప్పటికీ బ్యాంకు రుణాలను అవి ఎగ్గొడుతున్నాయి. మొండి బకాయిల సంక్షోభంలో కూరుకుపోయిన బ్యాంకులను నిలబెట్టేందుకు, కార్పొరేట్లు ఎగ్గొట్టడం వల్ల కలిగే నష్టాన్ని, ప్రజలు దాచుకున్న డబ్బుతో భర్తీ చేసుకునేందుకు వీలుగా మోదీ ప్రభుత్వం ఎఫ్ఆర్‌డీఐ (ఫైనాన్షియల్ రిజల్యూషన్ ఆఫ్ డిపాజిట్ ఇన్సూరెన్సు బిల్లు)ను రూపొందించింది. ఈ బిల్లు మొండి బకాయిల వల్ల బ్యాంకులు సంక్షోభంలో కూరుకుపోతే డిపాజిట్‌దారుల డబ్బుతో ఆ నష్టాన్ని పూడ్చుకోవచ్చు. ఆ డిపాజిట్లను కూడా నష్టాల లెక్కల్లో జమవేసుకోవచ్చు. అలా డిపాజిట్ దారులు పైసాపైసా కూడబెట్టిన కష్టార్జితాన్ని బ్యాంకులు, ఇన్స్యూరెన్స్ కంపెనీలు స్వాహా చేయడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి దాపురిస్తుంది. కార్పొరేట్ సంస్థలకు ప్రజాధనాన్ని ధారా దత్తం చేసే ప్రభుత్వ విధానాలను, బ్యాంకింగ్ వ్యవస్థను మార్చేందుకు ప్రజలు ఉద్యమించాలి.



మంచిమాట



"వెలిగే దీపమే ఇతర దీపాలను వెలిగించినట్టు, నిరంతరం నేర్చుకొనేవారే ఇతరులకు జ్ఞానాన్ని పంచగలరు."

- రవీంద్రనాథ్ ఠాగూర్

తెగేదాకా లాగుతున్న మోదీ ప్రభుత్వం



జి. రాజశుక

సచేతన

తమ పార్టీ ఎంపీలతో రాజీనామా చేయించాలని వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం తెలుగుదేశం పార్టీలో కలకలం రేకెత్తించినట్టు కనిపిస్తోంది. రాష్ట్ర విభజన హామీలలో భాగమైన ప్రత్యేక హోదాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇవ్వని పక్షంలో ఏప్రిల్ 6న తమ పార్లమెంట్ సభ్యులతో రాజీనామా చేయించాలని ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షం నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 6 పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల చివరిరోజు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం కింద హామీలు, వాగ్దానాలను పూర్తిగా విస్మరించడం పట్ల పార్లమెంట్‌లో తెలుగుదేశం పార్టీ ఎంపీలు అనేక విధాలుగా నిరసన వ్యక్తం చేశారు. అయితే, ఈ నిరసన ఆశించిన స్థాయిలో కేంద్రాన్ని కదిలించలేకపోయింది. అరుణ్ జైట్లీ తన సమాధానంలో గతంలో చెప్పిందే చెప్పారు తప్ప కొత్తగా చెప్పిందేమీ లేదు.

నిజానికి పార్లమెంట్‌లో రాష్ట్ర విభజనపై చర్చ జరిగినప్పుడు అప్పట్లో రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, ప్రస్తుత ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుతో పాటు రాష్ట్ర ప్రయోజనాలను వెనకేసుకొస్తూ గట్టిగా పోరాడారు. అయినప్పటికీ బడ్జెట్‌లో ఏపీని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం చూస్తే ఇక ఎన్‌డీఏ ప్రభుత్వంలో రాష్ట్రానికి న్యాయం జరిగే అవకాశం లేదనే అభిప్రాయం బలంగా ఏర్పడుతోంది. ఒక్క ఆంధ్రప్రదేశ్ గురించే కాదు, తెలంగాణ రాష్ట్ర ప్రస్తావన కూడా బడ్జెట్‌లో ఎక్కడా కనిపించకపోవడం తెలుగు రాష్ట్రాల ప్రజలను, రాజకీయ పక్షాలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో కాలు పెట్టాలనుకుంటున్న బీజేపీకి కూడా ఇది తీరని విఘాతం కావచ్చు.

బడ్జెట్ రూపకల్పనకు ముందు వివిధ రాష్ట్రాలతో కేంద్ర ఆర్థికమంత్రి జరిపే చర్చల్లో చంద్రబాబు ఆర్థిక మంత్రికి రాష్ట్రావసరాల జాబితాను అందజేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి కూలంకషంగా వివరించారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు, రెవెన్యూ లోటు భర్తీ, విశాఖపట్నంలో రైల్వేజోన్ ఏర్పాటు, కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం, కొత్త రాజధాని అమరావతి నిర్మాణానికి సహాయం, ప్రత్యేక హోదాకు బదులుగా ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీల గురించి ఆయన ఇతర కేంద్ర మంత్రులకు కూడా మరీమరీ చెప్పారు. అయినప్పటికీ బడ్జెట్‌లో ఆ చర్చల్ని పట్టించుకున్న పాపాన పోలేదు. ఇది తమ నాయకుడిని చిన్నచూపు చూడడం తప్ప మరేమీ కాదని, మోదీ కన్నా ముందే జాతీయ రాజకీయాల్లో కేంద్రబిందువైన తమ నాయకుని స్థాయిని కించపరుస్తున్నారని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి. కేంద్ర బడ్జెట్‌లో ఈ విధమైన వివక్ష చూపించడం అనేక రాజకీయ దుష్పరిమాణాలకు దారితీస్తుందని కూడా టీడీపీ నాయకత్వం అభిప్రాయపడుతుంది.

వరుసగా వాగ్దాన భంగాలు

అటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, ఇటు కొత్త రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అరకొర నిధులు మంజూరు చేస్తోందే తప్ప పెద్దగా చేసిందేమీ లేదు. ప్రత్యేక హోదా స్థానంలో ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించిన కేంద్రం చివరికి ఆ దిశలో కూడా పెద్దగా చేసిందేమీ లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వ వైఖరి పట్ల రెండు మూడేళ్లుగా తన నిరసనను ఏదోవిధంగా వ్యక్తం చేస్తూనే ఉన్నారు. రెండేళ్ల క్రితం కూడా చంద్రబాబు తమ ఎంపీలతో రాజీనామా చేయిద్దామనుకున్నారు. అయితే, కేంద్రానికి అవకాశం ఇస్తూ పోవడం తప్ప పార్లమెంట్ సభ్యులతో రాజీనామాలు చేయడమనేది జరగనే లేదు. అయితే, చంద్రబాబును తక్కువగా అంచనా వేయడానికి వీల్లేదు. వ్యూహాలు రూపొందించడంలో ఆయన తరువాతే ఎవరైనా. పార్లమెంట్‌లో అటు లోక్‌సభకు, ఇటు రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరగబోతున్న తరుణంలో, బీజేపీ మీద యుద్ధం ప్రకటించడానికి ఇప్పటి నుంచే సమాయత్తం కావాల్సిన సమయం ఆసన్నమైందని, అవసరమైతే బీజేపీయేతర పార్టీలతో తృతీయ ఫ్రంట్ ఏర్పాటు చేయడానికి కూడా చంద్రబాబు సిద్ధమేనని ఆయన సన్నిహితుడు చెప్పారు. తృతీయ ఫ్రంట్ ఏర్పాటు వంటి నిర్ణయం తీసుకునే ముందు ఆయన మరో వ్యూహం గురించి కూడా ఆలోచిస్తున్నట్టు తెలిసింది. ప్రత్యేక హోదా కాకపోయినా ప్రత్యేక ప్యాకేజీ అయినా వెనువెంటనే ఇవ్వడానికి నిరసనలతో ఒత్తిడి తెచ్చి ప్రయోజనం లేదని, బీజేపీ మీద ఒత్తిడి తేవడానికి ఇంతకు మించిన వ్యూహం అవసరమని చంద్రబాబు భావిస్తున్నారు.

చంద్రబాబు సరికొత్త వ్యూహం

పంచాయతీ, మండల సభ్యుల దగ్గర నుంచి కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో సహా అందరినీ ఢిల్లీ తీసుకు వెళ్లి జంతర్ మంతర్ దగ్గరో, పార్లమెంట్ ముందో ధర్నా చేయించడం కూడా ఇందులో ప్రధానభాగం. దీనికి శివసేన, తృణమూల్ కాంగ్రెస్, లాలూ ప్రసాద్ పార్టీలతో సహా వివిధ పార్టీల నుంచి కచ్చితంగా మద్దతు లభిస్తుంది. అంతేకాదు, ఇటువంటి కార్యక్రమం జాతీయ, అంతర్జాతీయ మీడియాను కూడా ఆకట్టుకుంటుంది. చివరికి బడ్జెట్ సమావేశాల సందర్భంగానే మోదీ మంత్రివర్గంలోని తమ ఇద్దరు మంత్రులతో రాజీనామా చేయించాలని ఆయన భావిస్తున్నారు.


Rajesh

> కేంద్ర బడ్జెట్‌ను ప్రకటించిన తర్వాత నుంచి ఆయన, ఆయన ఎంపీలు, మంత్రులు కేంద్ర ప్రభుత్వంపై అడపాదడపా విమర్శలు సాగిస్తూనే ఉన్నారు. తమిళనాడులో అటు అన్నాడీఎంకేతోనూ, ఇటు డీఎం కేతోనూ స్నేహ సంబంధాలు ఏర్పరచుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టే ఇక్కడ కూడా బీజేపీ అటు తెలుగుదేశం పార్టీతోనూ, ఇటు జగన్ పార్టీతోనూ సంబంధాలు ఏర్పరచుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టుందని ఓ తెలుగుదేశం ఎంపీ వ్యాఖ్యానించారు.

కేంద్రానికి నిరసన తెలియజేసే విషయంలో ఇది మొదటి అడుగని ఆయన ప్రకటించారు. అప్పటికీ ప్రధాని మోదీ తమ కోర్కెలకు స్పందించని పక్షంలో బీజేపీ నాయకత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ నుంచి తప్పుకోవాలని ఆయన నిర్ణయించుకున్నారు. ఈ అలయెన్స్ (ఎన్‌డీఏ)లో బీజేపీ, శివసేన తర్వాత ఎంపీల సంఖ్యాపరంగా తెలుగుదేశం పార్టీ అతి పెద్దపార్టీ. 2019లో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో తాము ఒంటరిగా పోటీ చేస్తామని శివసేన ఇప్పటికే ప్రకటించింది. తెలుగుదేశం నాయకత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అగత్యాన్ని పాలక బీజేపీయే కల్పించినట్టు అర్థమవుతూనే ఉంది. సన్నిహిత వర్గాల ప్రకారం చంద్రబాబు ఇంతకన్నా కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోవడం లేదు.

హస్తిన మీద పోరాటం జరపడానికి అమరావతే ప్రధాన వేదిక కాబోతోందని ఆయన సన్నిహిత నాయకుడొకరు వ్యాఖ్యానించారు. వచ్చే ఏడాది ప్రారంభం ఇదే తృతీయ ఫ్రంట్ ఏర్పాటుకు నాంది పలుకుతుంది. అవసరమైతే ఆ తర్వాత ఎంపీలతో రాజీనామా చేయించవచ్చని చంద్రబాబు ఆలోచిస్తున్నట్టు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఏడాదిలో ఎన్నికలు జరగబోతున్నాయనగా రాష్ట్రానికి ఇంతవరకూ ఎటువంటి ప్రయోజనమూ కలగకపోవడం చంద్రబాబును తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఎన్నికల్లో ప్రజలకు ఏం జవాబు చెప్పాలనే ఆలోచన ఆయనను కలచివేస్తోంది. తాము పార్లమెంట్‌లో కొద్దిపాటి నిరసనలు వ్యక్తం చేసినప్పుడైనా నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడతామని, అవసరమైన నిధులు సమకూరుస్తామని, విభజన హామీలన్నిటినీ నెరవేరుస్తామని స్పష్టమైన హామీ ఇచ్చి ఉంటే హుందాగా ఉండేదని, అటువంటి హామీ టీడీపీకే కాక, బీజేపీకి కూడా ఎంతో ఉపయోగకరంగా ఉండేదని టీడీపీ సీనియర్ నాయకులు వాపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తీవ్ర నిరసన వ్యక్తం అవుతున్నా, ఎన్‌డీఏ నుంచి వైదొలగగలమని చంద్రబాబు ప్రకటించినా మోదీలో ఇంతవరకూ ఉలుకూ పలుకూ లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని ఆ నాయకుడు వ్యాఖ్యానించారు.

ఈ స్థితిలో తృతీయ ఫ్రంట్ ఏర్పాటు దిశగా నిర్ణయం తీసుకోవడం వల్ల చంద్రబాబు అటు రాష్ట్రంలోనూ, ఇటు జాతీయ స్థాయిలోనూ తిరుగులేని నాయకుడుగా గుర్తింపు పొందే అవకాశం ఉంది. రెండు దశాబ్దాల కిందట ఆయన ఇదేవిధంగా తృతీయ ఫ్రంట్ ఏర్పాటుకు కృషిచేయడం గమనించాల్సిన విషయం. బీజేపీని అధికారానికి దూరంగా ఉంచడానికి ఆయన దాదాపు 1996 ప్రాంతంలో కాంగ్రెసేతర, బీజేపీయేతర పార్టీలతో యునైటెడ్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేయడానికి కృషిచేశారు. దీనికి కాంగ్రెస్ ఆ తర్వాత బయటి నుంచి మద్దతు ఇచ్చింది. తాము మద్దతునివ్వనంత కాలం బీజేపీ ప్రభుత్వం తమను పట్టించుకోదని ఓ తెలుగుదేశం పార్టీ ఎంపీ వ్యాఖ్యానించారు. 2019లో ఎన్నికలను ఎదుర్కోవాలంటే ప్రత్యేక ప్యాకేజీని, విభజన సమయంలో చేసిన వాగ్దానాలను అస్త్రాలుగా చేసుకుని కేంద్రం మీద గళం ఎత్తక తప్పదని కూడా ఆయన స్పష్టం చేశారు.

వివాదానికి మొదటి బీజం

నిజానికి బీజేపీ, తెలుగుదేశం పార్టీల మధ్య చాలాకాలం నుంచి వివిధ అంశాలపై వివాదం రాజుకుంటోంది. జనవరి రెండవవారంలో చంద్రబాబు ఢిల్లీ వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని కలుసుకునే ముందువరకూ ఈ రెండు పార్టీల మధ్యా స్నేహం సజావుగానే సాగింది. ప్రధానితో సమావేశం జరగడానికి ముందు చంద్రబాబు పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో తాము తలాక్ బిల్లుకు మద్దతునిచ్చే అవకాశం లేదని ప్రకటించారు. అప్పటి నుంచే ఈ రెండు పార్టీల మధ్య కొద్దికొద్దిగా విభేదాలు ఉత్పన్నం అయ్యాయి. ఆ తర్వాత జగన్మోహన్‌రెడ్డి ఓ న్యూస్ చానల్‌తో మాట్లాడుతూ, కేంద్రం ప్రత్యేక హోదా ఇచ్చే పక్షంలో తాము బీజేపీ ప్రభుత్వానికి మద్దతునివ్వగలమని తెలిపారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సుకు వెళ్లి వచ్చిన తర్వాత, ఆయన జగన్ లేవనెత్తిన అంశం మీదా, దాని పర్యవసానాల మీదా పార్టీ నాయకులతో లోతుగా చర్చించారు. తమతో పొత్తుపట్ల బీజేపీకి ఆసక్తి లేని పక్షంలో తాము బీజేపీ కూటమి నుంచి వైదొలగడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

కేంద్ర బడ్జెట్‌ను ప్రకటించిన తర్వాత నుంచి ఆయన, ఆయన ఎంపీలు, మంత్రులు కేంద్ర ప్రభుత్వంపై అడపాదడపా విమర్శలు సాగిస్తూనే ఉన్నారు. తమిళనాడులో అటు అన్నాడీఎంకేతోనూ, ఇటు డీఎంకేతోనూ స్నేహ సంబంధాలు ఏర్పరచుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టే ఇక్కడ కూడా బీజేపీ అటు తెలుగుదేశం పార్టీతోనూ, ఇటు జగన్ పార్టీతోనూ సంబంధాలు ఏర్పరచుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టుందని ఓ తెలుగుదేశం ఎంపీ వ్యాఖ్యానించారు. ఏది ఏమైనా ప్రత్యేక ప్యాకేజీని సాధించడానికి తెలుగుదేశం పార్టీ ముందు నాలుగుమార్గాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొదటిది-మోదీ ప్రభుత్వం నుంచి తమ మంత్రులు అశోక్ గజపతిరాజు, సుజనా చౌదరిలను వెనక్కు పిలిపించడం, రెండవది-పార్టీ ఎంపీలతో రాజీనామా చేయించడం, మూడవది-ఢిల్లీలో ప్రతిపక్షాల సహాయ సహకారాలతో భారీయెత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించడం, నాలుగవది-ఎన్‌డీయే కూటమి నుంచి వైదొలగడం. బీజేపీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో ఇందులో ఏదో ఒకటి గానీ, ఇవన్నీ గానీ జరిగే అవకాశం ఉంది.



రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఓ ప్రబల రాజకీయ శక్తి. దేశ వ్యాప్తంగా మంచి ఆకర్షణ ఉన్న ప్రజాయోధుడు. తెలంగాణ మహాత్ముడు..! ప్రజల్లో వెలుగులను..ఆకాంక్షలను నింపిన సూరీడు. వ్యూహాలకు ప్రతివ్యూహాలు.. ఎత్తులకు పైఎత్తులు.. అస్త్రాలపై బ్రహ్మాస్త్రాలు.. ఇలా చెబుతూపోతే గులాబీ దళాధిపతి కేసీఆర్ రాజకీయ చతురత అవధులు దాటి పోతోంది. తెలంగాణలో విపక్షాలను మట్టి కరిపించిన ఆయన వ్యూహరచన అంచనాలకు అందనిది. సీమాంధ్ర పాలనకు, యూపీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సుదీర్ఘకాలం పోరాడి వాళ్లనుంచి తెలంగాణకు స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను ప్రసాదించిన మానవతావాది. దేశంలో తెలంగాణ 29వ రాష్ట్రంగా అవతరించడానికి ఆయన అలుపెరుగని పోరాటం చేశారు. 66వ సంవత్సరంలోకి అడుగిడిన కేసీఆర్ జీవిత గమనంలో ఎన్నో మైలురాళ్లు దాటి దేశచరిత్రలో గొప్ప రాజనీతిజ్ఞుడిగా కీర్తి గడించారు. అయితే కేసీఆర్ బక్క పలుచని రూపం తెలంగాణ గుండెల్లో వెలిగే ఆత్మగౌరవదీపం. ఆయన గళం గర్జిస్తున్న గులాబీదళం. పడావుపడిన బీడు భూముల్లో పసిడి పంటలు పండించాలన్న ఆయన తాపత్రయం అంతా ఇంతా కాదు. తెలంగాణ తెస్తానని 17ఏళ్ల క్రితమే చెప్పారు. కనుకనే ఉద్యమబాట వీడలేదు. మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగి మూడున్నర కోట్ల తెలంగాణ ప్రజల కలలను సాకారం చేసిన పోరాటయోధుడు! 2014 జూన్ 2న తెలంగాణ మొట్టమొదటి సీఎంగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టారు. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన ప్రజాస్వామ్య దీప్తి, తరతరాలకు స్ఫూర్తి. తెలంగాణపై నిర్లజ్జగా సాగిపోతున్న అహేతుక వివక్షలపై అవిశ్రాంత పోరాటం చేసిన మహనీయుడు. మూడున్నర కోట్ల ప్రజల తరపున ఆయన సాగించిన ప్రత్యేక తెలంగాణ పోరాటం అసమానం. దశాబ్దాల పాటు విద్వేషం, విషం చిమ్మిన సీమాంధ్ర పాలకుల ఏలుబడి నుంచి తెలంగాణకు విముక్తి కల్పించిన ఆయన 'మహాత్ముడి' బాటలో అహింసను, అసమాన క్షమా గుణాన్ని ప్రదర్శించి యూపీఏ ప్రభుత్వంపై అలుపెరుగని పోరాటం సాగించి దిగ్విజయుడయ్యారు. అనంతరం తెలంగాణ ముఖ్యమంత్రిగా దేశవ్యాప్తంగా సరి కొత్త ప్రజాస్వామ్య స్ఫూర్తిని రగిల్చారు. కేసీఆర్ రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే, ఒక జిల్లా జన్మనిస్తే మరోజిల్లా అక్షరజ్ఞానాన్ని ప్రసాదించింది. మిగతా జిల్లాలో తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలోనూ భాగస్వామిగా మార్చింది. ఇలా తెలంగాణాలోని పది జిల్లాలతో



ప్రగతి దళపతి కేసీఆర్

అనుబంధం పెనవేసుకున్న ఈ విద్యావేత్త, మేధావి సవ్యసాచిగా కీర్తిగడించిన కేసీఆర్ తెలంగాణ ప్రజలకు ఆరాధ్యుడు! పూర్వ మెదక్ జిల్లా చింతమడకలో కల్వకుంట్ల వెంకటమ్మ-రాఘవరావు దంపతులకు 1952 ఫిబ్రవరి 17న జన్మించిన కేసీఆర్ అదే గ్రామంలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేశారు. సిద్ధిపేటలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన ఆయన ఎంఏ తెలుగు సాహిత్యాన్ని ఉస్మానియా యూనివర్సిటీలో చదివారు. విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలు అలవర్చుకున్న కేసీఆర్ చదువులోనూ చురుకైన విద్యార్థే. విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘంనేతగా పని చేస్తూ ఎంఏ సాహిత్యంలో విశేష ప్రతిభ కనబరచి యూనివర్సిటీ ఆచార్యుల అభిమానాన్ని చూరగొన్నారు. అనంతరం 1970లో యువజన కాంగ్రెస్ తరపున రాఘవాపూర్ గ్రామ సింగిల్ విండో చెర్మన్‌గా ఎన్నికై సుదీర్ఘ కాలం ఆ పదవిలో కొనసాగారు. 1983లో తెలుగుదేశంలో చేరి మొదటిసారి ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓడారు. ఆ తర్వాత 1985 నుంచి వరుసగా ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎన్‌టీఆర్, చంద్రబాబు నాయుడు కేబినెట్‌లో వివిధ శాఖలకు మంత్రిగా పనిచేసిన చంద్రశేఖర్‌రావు 1999-2001 మధ్యకాలంలో అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. అయితే సీమాంధ్ర పాలనలో మొదటినుంచి తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, మోసాలు, దగాకుట్రలను గమనించిన కేసీఆర్ 2001లో డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే పదవులతోపాటు, తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)ని స్థాపించారు. వెనువెంటనే జరిగిన ఉపఎన్నిక ల్లో టీఆర్ఎస్ పార్టీ నుంచి సిద్ధిపేట ఎమ్మెల్యేగా గెలుపొందారు. అలాగే 2004లో కరీంనగర్ లోక్‌సభకు ఎన్నికైన ఆయన అప్పటి కేంద్రంలోని యూపీఏ సర్కారులో చేరి కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. కేంద్రంలోని యూపీఏ సర్కారు వైఖరికి నిరసనగా కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి 2009 నవంబర్ 29 నుంచి డిసెంబర్ 9 వరకు 11 రోజుల పాటు ఆమరణ నిరహార దీక్ష చేసి తెలంగాణ ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లారు. అప్పటి నుంచి సాగిన మలిదశ ఉద్యమం అంతా కేసీఆర్ చూపుడు వేలు పట్టుకొని నడిచింది. ఈ ప్రస్థానంలో ఉద్యమ దీపం ఆరిపోకుండా ఆయన వేసిన ఎత్తు గడలు, ఆ క్రమంలో జరిగిన పోరాటాలు ఉద్యమచరిత్రలో కొత్త అధ్యాయానికి తెరతీశాయి. హైదరాబాద్ జలదృశ్యంలో 2001లో గుప్పెడు మందితో పురుడుపోసుకున్న ఉద్యమం జనసాగర కెరటమై ఢిల్లీని ముంచెత్తడం ఒక అపూర్వ సన్నివేశం. గ్లోబల్ యుగంలో ఒక బక్కపలచని మనిషి దేశాన్ని అరచేత శాసించే పారిశ్రామిక, రాజకీయ, మీడియా శక్తులను ఢీకొట్టి తుత్తునియలు చేయడం చారిత్రాత్మకం. శత్రువుకు చిక్క కుండా ఉద్యమరథాన్ని వడివడిగా గమ్యంవైపు పరుగెత్తించడం - ఈ ప్రస్థానంలో ఎన్నెన్నో మరపురాని ఘట్టాలు. 2001 నుంచి 2014 మధ్యకాలంలో ఎన్నెన్నో దూషణ, భూషణలు, అవమానాలు అన్నింటినీ ఎదుర్కొని ముందుకు సాగిన యోధుడు కేసీఆర్. ఫలితంగా 2013 జులై 30న సీ డబ్ల్యూసీ తీర్మానం తదనంతర పరిణామాలు అందరినీ అబ్బురపరిచేలా చేశాయి. చివరకు 2014 జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంగా కేంద్రం నిర్ణయించింది. అప్పటికే తెలంగాణ రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో టీఆర్ఎస్ పూర్తి మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవడం, శాసనసభాపక్ష నేతగా కేసీఆర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో అదేరోజు ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. పద్నాలుగు సంవత్సరాల పోరాటం తరువాత పగ్గాలు చేపట్టిన కేసీఆర్ ప్రభుత్వం ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజలు కోల్పోయిన వైభవాన్ని, అస్థిత్వాన్ని పునఃప్రతిష్ఠ చేసే దిశగా అడుగులేస్తున్నది. కేసీఆర్ పరిపాలనలో అడుగడుగునా తెలంగాణ ముద్ర కనిపిస్తున్నది. మనది ధర్మపోరాటమని పదేపదే ప్రవచించిన విధంగానే ఆచరించి చూపి అందరి మెప్పుపొందిన కేసీఆర్ నిజంగా తెలంగాణ రాష్ట్రానికి మహాత్ముడే. ప్రత్యేక రాష్ట్ర సాధనకోసం అలుపెరగని పోరుచేసిన ఈ యోధుడు ఇప్పుడు బంగారు తెలంగాణ కోసం పాలనను పరుగుతీయిస్తున్నారు. ప్రజారంజక పాలనతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తున్నారు. ప్రపంచాన్ని తెలంగాణ వెప్పు చూసేలా అభివృద్ధికి కేసీఆర్ బాటలు వేస్తున్నారు. రూ. 40 వేల కోట్లతో 35 సంక్షేమ పథకాలు చేపట్టి చరిత్రలో సువర్ణాధ్యాయం లిఖించారు.

◆ గడ్డం కేశవమూర్తి
ప్రెసిడెంట్, వరంగల్ ప్రెస్ క్లబ్
8008794162

కృష్ణా జలాల కోసం రౌండ్‌టేబుల్ సమావేశం

కరపత్రం

నీళ్లు, నిధులు, నియామకాలు అనే ట్యాగ్‌లైన్ తెలంగాణ ఉద్యమంలో ప్రధానమైంది. స్థానికత అనేది ఈ అన్నింటికి పునాది అంశం. తెలంగాణలోనే అతిపెద్ద జిల్లా, అత్యంత వెనుకబడిన జిల్లా మహబూబ్‌నగర్. సాగునీటి పథకాల అమలులో మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు జరుగుతూ వచ్చిన అన్యాయం నివారించాలని గత మూడు సంవత్సరాలుగా అనేక ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. గత సంవత్సరం 14 నియోజక వర్గాల కేంద్రాలలో వేలాదిగా ప్రజలతో ధర్నాలు నిర్వహించారు. అయినా తెలంగాణ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వాల వలనే మహబూబ్‌నగర్ జలవనరుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగాను, వివక్షతోను వ్యవహరిస్తున్నది. ఈ పరిస్థితులలో మహబూబ్‌నగర్ ఇంజనీర్లు ఎంతో ఆవేదనతో ముందుకు వచ్చి ఒక వేదికగా ఏర్పడి ఈనెల 9న డిమాండ్లతో కూడిన ఒక నోట్‌ను హైదరాబాద్‌లో పాత్రికేయుల సమావేశంలో విడుదల చేశారు. ఆ ప్రకటన మేరకు ఈ డిమాండ్లను సాధించుకోవడానికి తగిన కార్యాచరణ రూపొందించడానికి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 17వ తేదీన విస్తృత రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశం గాయత్రి ఫంక్షన్ హాల్, పద్మావతి కాలనీ, మహబూబ్‌నగర్‌లో ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేశారు.

- పాలమూరు అధ్యయన వేదిక, డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ తదితర ప్రజా సంఘాలు



యాభై రూపాయలకే సైకిల్

– సందీప్ రెడ్డి వంగా



నాకు సైకిల్‌ని మా తాతగారు కొనిచ్చారు. నేను అప్పుడు ఐదవ తరగతి చదివేవాడిని. అప్పట్లో హీరో రేంజర్ సైకిల్స్ కొత్తగా మార్కెట్లోకి వచ్చాయి. రెడ్ కలర్ సైకిల్‌ను కొనిచ్చారు. ఆ అట్లాస్ సైకిల్‌పై రెబల్ అని రాసుండేది. నేను మూడవ తరగతి చదివేటప్పుడు నా దగ్గ రుండే యాభై రూపాయలను తాతయ్య తీసుకున్నారు. అలా తీసుకునేటప్పుడు 'నీకు నాలుగు వందల రూపాయలిస్తాను' అని మాట ఇచ్చారు. అన్నట్లుగానే నాకు నాలుగు వందలు రూపా యలిచ్చారు. 'ఈ డబ్బుతో ఏం చేస్తావ్ రా?' అని అడిగారు. నాకేం చెప్పాలో తెలియలేదు. 'ఆ డబ్బులు నాకివ్వు, సైకిల్ కొనిస్తా' అన్నారు. నేను కూడా సరేనని ఆయనకు నా దగ్గరున్న డబ్బులిచ్చేశాను. ఆయన నాకు సైకిల్ కొనిచ్చారు. అప్పట్లో సైకిల్ 1200 రూపాయ లుండేది. నేను నాలుగు వందలిస్తే.. మిగిలిన డబ్బులను మా తాతగారే వేసు కుని కొనిచ్చారు. అంటే నాకు యాభై రూపాయలకే సైకిల్ వచ్చిందన్న మాట. ఆ సైకిల్‌కి టైర్లు చాలా లావుగా ఉండేవి. ఇప్పుడు ఆ సైకిల్ నా దగ్గర లేదు. మా స్కూల్ మొత్తంలో అలాంటి సైకిల్ ఒకట్రెండే ఉండేవి. అందులో నాది ఒకటి.

ఫస్ట్ సైకిల్

తొలి గేర్ సైకిల్

– శివ బాలాజీ



ఇంట్లో అమ్మనాన్నలే సైకిల్‌ను కొనిచ్చారు. నాకు కొనిచ్చిన సైకిల్‌కు వెనుక బ్యాలెన్స్ కోసం మూడు చక్రా లుండేవి. చివరి రెండు చక్రాలను తీసే శాను. మా ఇంట్లో ఫియెట్ కారుండేది. ఆ కారును పట్టుకుని దాని చుట్టూ తిరు గుతూ సైకిల్ నేర్చేసుకున్నాను. నేను స్కూల్‌కి వెళ్లాక హకీ బాగా ఆడేవాడిని. గ్రౌండ్‌కి వెళ్లేటప్పుడు నా స్నేహితుల క్యారియర్‌కి నా సైకిల్‌ని గట్టిగా కట్టేసే వాడిని. దాంతో నేను సైకిల్ తొక్కే అవ సరం ఉండేది కాదు. స్ట్రీట్ క్యాట్ అనే గేర్ సైకిల్‌ను తొలిసారి మార్కెట్లోకి విడుదల చేసి నప్పుడు .. ఆ సైకిల్‌ని అమ్మ వాళ్లు నాకు కొనిచ్చారు. నా స్నేహితులందరిలో నా దగ్గరే అలాంటి సైకిల్ ఉండేది. నేను కాలేజ్‌కి వచ్చే వరకు దాదాపు ఏడు సైకిల్స్‌ను కొన్నాను. అవేవీ ఇప్పుడు నా దగ్గర లేవు.

ఇంటర్వ్యూలు : మోహన్ కుమార్ తుమ్మల

రెండు చక్రాల విమానం

నిశ్శబ్దం అందమైంది, అందమైనదల్లా నిశ్శబ్దంగానే ఉంటుంది. ఈ రెండూ మనకు సైకిల్‌లోనే దొరుకుతాయంటాడు టర్కిష్ నాటక ప్రయోక్త, నవలాకారుడు మెహ్మెత్ మూరత్ ఇల్డన్. సైకిల్ నిరాండబరతకు చిహ్నం. నల్లటి తాచుపాములాంటి రోడ్డు మీద మనిషి కాళ్ళకు రెండు చక్రాల్ని కట్టి పరుగెత్తించి, గెలిపించే నేస్తం సైకిల్. ఇంచుమించు ప్రతి ఒక్కరికీ సైకిల్ ఒక బాల్యజ్ఞాపకం. నాన్నో, అమ్మో, అన్నో, అక్కో కొనిపెట్టిన సైకిల్‌ని చూసి, మురిసి పోతూ పెడల్ మీద అడుగు పెట్టిన క్షణం మనకు రెక్కలు మొలిచిన జ్ఞాపకం. ద్విచక్రవాహనమే అయినా కాలుష్యానికి బద్ధశత్రువు. పేదవాడికి నేల మీది విమానం. పసివాడికి నేల మీదే ఆకాశాన్ని అందించే స్నేహహస్తం సైకిల్. ఇవాళ 'మైత్రి' అలా మనకందరికీ ప్రియనేస్తమైన సైకిల్‌ని పలుకోణాల్లో మీ ముందుకు తెచ్చింది.

– మీ 'మైత్రి'

సౌలభ్యం

మడత సైకిల్

అపార్ట్‌మెంట్ సంస్కృతి పెరిగిపోయింది, జీను కొన్న తరువాతే గుర్రాన్ని కొనాలి మరి, పార్కింగ్ ఏరియా సరిపడా ఉందో, లేదో చూసుకున్న తరువాతే కారు కొనాలి. అద్దె ఇల్లయినా, సొంత ఇల్లయినా ఇదే గతి! కారు సంగతి సరే, మరి సైకిల్‌కి పార్కింగ్ సమస్య ఉండదా, ఎందుకుండదు, తప్పక ఉంటుంది. సైకిల్‌ని లిఫ్ట్‌లో పెట్టుకుని మన అపార్ట్‌మెంట్ కారిడార్‌లో పెట్టుకోవచ్చు. కొంచెం ఇబ్బందిగానే ఉంటుంది. ఏ కాస్త జాగా అయినా ఇవాళ్రేపు విలువైందే! అందుకే తక్కువ స్థలంలో ఇమిడిపోయే సైకిల్ అయితే బావుంటుంది కదూ! మీరు రైల్వే స్టేషన్ వరకు మీ సైకిల్ మీద వెళ్ళారనుకుందాం, మరి రైల్లో మీతో పాటు మీ సైకిల్‌ని తీసుకెళ్ళడం సాధ్యమా? కాదు, అయితే దీన్ని కూడా సుసాధ్యం చేయవచ్చు, ఎలాగంటారా, ఇదిగో ఈ మడత సైకిళ్ళు మీ సమస్యల్ని ఇట్టే పరిష్కరించేస్తాయి! ఇది 'స్పేస్ సేవర్ల' ప్రపంచం మరి, స్పేస్ సేవింగ్ (తక్కువ స్థలంలో ఇమడ్చగలిగేది) ఫర్నీచర్ మాత్రమే కాదు, సైకిల్ కూడా స్పేస్ సేవింగ్ వస్తువై పోయింది. స్పేస్ సేవింగ్ మాత్రమే కాదు, పోర్టబుల్ (సులభంగా మోసుకుపోగలిగేది) కూడా అయితే మరింత బావుంటుంది కదూ! ఇదిగో ఇక్కడ మనం కొన్ని 'ఫోల్డబుల్ సైకిళ్ళ' గురించి తెలుసుకుందాం. ఈ సైకిళ్ళని ఎంచక్కా మడిచేయవచ్చు! అయితే ఇవన్నీ ఇవాళే కనుగొన్న విషయాలేమీ కావు, ఫోల్డబుల్ సైకిళ్ళ చరిత్ర మొదటి ప్రపంచ యుద్ధకాలంలోనే అంటే 1918లోనే మొదలైంది. నాటి నుంచి వీటి రూపాన్ని ఆధునిక అవసరాలకు తగినట్టుగా మార్చుతున్నారు. ఇక్కడ మీరు చూస్తున్న ఫోల్డబుల్ సైకిళ్ళు ఈ ఏడాది ఫిబ్రవరిలోనే మార్కెట్‌లో అందుబాటులోకి రావడం విశేషం.



బ్రామ్టన్ ఎమ్ 6 ఎల్

బ్రామ్టన్ ఎమ్ 6 ఎల్ అన్నది బ్రామ్టన్ అనే కంపెనీ తయారు చేసిన అధునాతనమైన సైకిల్. ఈ కంపెనీ ఫోల్డబుల్ సైకిళ్ళను తయారు చేయడంలో మేటి. దీని కర్మాగారం లండన్‌లో ఉంది. ఈ సైకిల్ రకరకాల రంగుల్లో, పలు ఆకారాల హ్యాండ్ బార్లతో లభ్యమవుతోంది. కావసినంత లగేజీని కూడా ఈ సైకిల్ మీద తీసుకెళ్ళ వచ్చు. అమెరికన్ మార్కెట్‌లో దీని ధర సగటు పౌరునికి అందుబాటులోనే ఉన్నా, భారతీయ కరెన్సీ ప్రకారం దీని వెల అక్షరాలా 97,438 రూపాయలు మాత్రమే!



సిటిజన్ గోథమ్ 7

సిటిజన్ గోథమ్ అనే కంపెనీ సిటిజన్ గోథమ్ 7 అనే ఫోల్డబుల్ సైకిల్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. నగరవాసుల అవసరాల్ని దృష్టిలో ఉంచుకుని తయారు చేసిన ఈ సైకిల్‌లో డైరెక్ట్ పుల్ బ్రేక్స్ ఉంటాయి. దీంతో దీన్ని నగర ట్రాఫిక్‌లో వెంటనే ఆపివేయడానికి మరింత సౌకర్యంగా ఉంటుంది. దీని ధర 24,231 రూపాయలు మాత్రమే.



టెర్న్ జిఎస్‌డి

టెర్న్ జిఎస్‌డి సరుకు తరలింపును దృష్టిలో ఉంచుకుని తయారు చేసింది. కొండలు, గుట్టలు ఎక్కుతూ సైక్లింగ్ చేయాల్సిన సందర్భాల్లో లగేజీని మోసుకు వెళ్ళడానికి ఈ ఫోల్డబుల్ సైకిల్ ఉపయుక్తంగా ఉంటుంది. దీనికి చిన్నపాటి మోటారును అమర్చారు. దీని వల్ల కొండలపైకి ఎక్కేటపుడు మనం ప్రయాస పడుకుండానే సైకిల్ సజావుగా నడుస్తుంది. దీని మీద ఏకంగా 180 కిలోల బరువును మోసుకుని వెళ్ళవచ్చు.

చరిత్ర

యుద్ధ సేవలు

ఒక సగటు పౌరుని చవకైన వాహనంగా ఇవాళ మనం చూస్తున్న సైకిల్‌ను మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో సైనిక అవసరాలకు ఉపయోగించే వారంటే నమ్మశక్యం కాదు. ఆ కాలంలో బ్రిటీష్ సైన్యంలో 'ఆర్మీ సైక్లిస్ట్ కార్ప్స్' పేరిట సైక్లిస్టు సైనికుల కోసమే ఒక ప్రత్యేక బెటాలియన్ ఉండేది. సైన్యంలో స్వచ్ఛందంగా పనిచేసేందుకు ముందుకు వచ్చే యువకులు సొంతసైకిల్‌ను కలిగి ఉంటే, వారిని వెంటనే సైన్యంలో యోధులుగా నియమించుకునే వారు. సైనిక శ్రేణుల మధ్య యుద్ధ సమాచారాన్ని వెంటవెంటనే తరలించడానికి ఈ బెటాలియన్ సేవల్ని వినియోగించుకునే వారు. రాయల్ స్కాట్స్, నార్‌ఫోర్క్ రెజిమెంట్, ఈస్ట్‌యోర్క్‌షైర్ రెజిమెంట్, తదితర పేర్లతో ఈ బెటాలియన్లను వ్యవహరించే వారు. అయితే ఈ ఆర్మీ సైక్లిస్ట్ కార్ప్స్‌ను 1922 నాటికి పూర్తిగా రద్దు చేసేశారు.



వందకోట్లు


మనిషి తాను కోరుకున్న గమ్యానికి చేరుకోవాలంటే తన కాళ్ళ మీదే ఆధారపడాలి, మైళ్ళకు మైళ్ళు నడవాలి. మరి ఎంతకాలం ఇలా నడుస్తూనే ఉంటాడు. అందుకే తనకు నడక శ్రమ నుంచి కాస్త ఉపశమనాన్ని కలిగించే సాధనాన్ని తయారు చేశాడు మనిషి. ఆ సాధనం పేరే సైకిల్. మనిషి కొంచెం శ్రమపడి పెడల్‌ని తొక్కితూ తన గమ్యాన్ని సునాయాసంగా చేరుకునే వీలును కలిగించింది సైకిల్. భూమ్మీద అన్ని మోటారు వాహనాలకు ముత్తాత సైకిల్ అంటే అతిశయోక్తి కాదు కదా! మానవజీవిత గమనానికి చేదోడు, చక్రాలజోడుగా ఉపకరించిన సైకిల్ 19వశతాబ్దంలో యూరోపులో అవతరించింది. అప్పటి నుంచి ఇవాళ దాకా రమారమి వందకోట్ల సైకిళ్ళు తయారయ్యాయంటే ఔరా అనిపించక మానదు.

సైకిల్ అనే పదం ప్రపంచంలో తొలిసారిగా 1868లో 'ది డైలీ న్యూస్'అనే పత్రికలో ప్రచురితమైంది.

జర్మనీ దేశానికి చెందిన బరోన్ కార్ల్ వాన్ డ్రైస్ అనే వ్యక్తి ప్రపంచంలో తొలిసైకిల్‌ను రూపొందించారు. ఆయన 1817లో సైకిల్‌ను తయారు చేశారు. చెక్క ఫ్రేముతో తయారైన ఈ సైకిల్‌ను కాళ్ళతో నడిపించాల్సి వచ్చేది. అంటే ఆది సైకిల్‌కు పెడల్స్ లేవన్నమాట. అయితే ఈ నమూనాను ఆదర్శంగా తీసుకుని కిర్క్‌పాట్రిక్ మాక్‌మిలన్ అనే స్కాట్లాండ్‌కు చెందిన ఒక కమ్మరి మొదటిసారిగా పూర్తిస్థాయి యాంత్రిక పరిజ్ఞానాన్ని జోడించి, ఇప్పటి సైకిల్‌కు మాతృకను తయారు చేశాడు. ఆయన తాను తయారు చేసుకున్న సైకిల్ మీద రోడ్డు వెళుతూ ట్రాఫిక్ నియమాలను అతిక్ర మించినట్టు 1842లో గ్లాస్‌గోవ్ అనే వార్తాపత్రికలో చిన్న వార్త ప్రచురితమైంది. అయితే 1860ల నాటికి ఫ్రాన్స్‌కు చెందిన పియెరీ మైకాక్స్, పియరీ లల్లామెంట్ అనే వ్యక్తులు సైకిల్‌కు పెడల్స్‌ని, యాంత్రికమైన పిడిని తయారు చేసి, జతచేశారు. ఈ సైకిల్‌కు తదనం తర కాలంలో అనేకానేక మార్పులు జరిగి, ప్రస్తుతం మనం వాడుతున్న సైకిల్ రూపొందింది.

ఒక బలమైన ప్రతీక

చిత్రకారుడు ఆంజనేయులు గుండు




'గోడకు వేలాడదీసిన సైకిల్'... నిజమే గోడకు సైకిల్ వేలాడుతోంది... మరి కాస్త ముందుకు వెళితే... అది సైకిల్ కాదు, సైకిల్ ప్రతిరూపం. సైకిల్ అంటే ఇష్టమున్న ప్రతివ్యక్తి కళ్ళకీ ఆ కాన్వాస్ రెండు చక్రాల చూపునిస్తుంది. ఇలా ఉన్నది ఉన్నట్టు కాన్వాస్ మీద చిత్రిస్తే దాన్ని ఆర్ట్ పరిభాషలో 'హైపర్ రియలిజం' లేదా 'ఫోటో రియలిజం' అంటారు. కానీ ఉన్నది ఉన్నట్టు చిత్రిస్తూనే, ఆ వస్తువును మరింత విశదం చేస్తే అది ఆంజనేయులు గుండు పెయింటింగ్ అవుతుంది. తన శైలి హైపర్ రియలిజం కాదని, ఆ ప్రక్రియను కేవలం ఒక సాధనంగా ఉపయోగించుకుని, చిన్నతనంలో తనకు పరిచ యమైన వస్తువుల్ని వాటి వ్యక్తిత్వంతో సహా చిత్రించడమే తన శైలి అని ఆంజనేయులు అంటారు. నల్లగొండ జిల్లా, గరిడేపల్లిలో జన్మించిన ఆంజనేయులు గుండు తాజాగా ఢిల్లీలో జరిగిన ఇండియన్ ఆర్ట్ ఫెయిర్‌లో తన చిత్రాల్ని ప్రదర్శించారు. ఒక్కో పెయింటింగ్‌కు కనీసం రెండు, మూడు నెలలు శ్రమించి చిత్రిస్తారాయన. తాను చిత్రించాలనుకున్న వస్తువును కాన్వాస్ మీద ఆయిల్ కలర్స్‌తో 'సజీవ చిత్రం'గా మలచడమే ఆంజనేయులు శైలిలోని ప్రత్యేకత. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివసిస్తున్న ఆంజనేయులు తాజాగా ఢిల్లీలో జరిగిన ఇండియన్ ఆర్ట్ ఫెయిర్‌లో 'హియర్ నౌ అండ్ దెన్' పేరిట సోలోషోను నిర్వహించారు. ముఖ్యంగా ఆయన చిత్రించిన 'సైకిల్' చిత్రకళాభిమానుల ప్రశంసల్ని చూరగొన్నది. ఈ సందర్భంగా ఆంజనేయులు 'మైత్రి'తో ఇలా సంభాషించారు.



మైత్రి : ఆంజనేయులు గారు హైపర్ రియలిజంలో మీరు ఒక కొత్త ఒరవడిని సృష్టించారు. అభినందనలు. మీ పెయింటింగ్స్ 'స్టిల్ లైఫ్' శైలికి దగ్గరగా ఉన్నట్టనిపిస్తుంది, స్టిల్ లైఫ్ శైలి, హైపర్ రియలిజం కలగలిసినట్టుండే మీ పెయింటింగ్ శైలి గురించి వివరిస్తారా?

ఆంజనేయులు గుండు : స్టిల్ లైఫ్ అన్నది పాశ్చాత్య చిత్రకళా శైలి. వస్తువుల్ని తమకు కావలసినట్టుగా ఒక రాశిగా అమర్చి చిత్రించడాన్ని స్టిల్ లైఫ్ అంటారు. అలాంటి పెయింటింగ్స్‌లో ఏ ఒక్క వస్తువూ విడిగా కనిపించదు. దాని ప్రత్యేకత ఏదీ ఉండదు. వస్తువుల కూటమిగానే కనిపిస్తుంది. అయితే నా శైలి దీనికి భిన్నమైంది. నేను ఒక వస్తువును ఎంచుకుంటాను. దాన్ని ఒక స్మృతిచిహ్నంలాగా ప్రజెంట్ చేయడానికి ప్రయత్నిస్తాను. అంటే వస్తువు దాని వ్యక్తిత్వంతో సహా కాన్వాస్ మీద కనిపిస్తుందన్న మాట. బ్యాక్‌గ్రౌండ్ కూడా ఉండదు. కేవలం వస్తువు ఒక్కటే కనిపిస్తుంది. నిజానికి హైపర్ రియలిజం అన్న దాన్ని ఆర్ట్‌ఫామ్‌గా పరిగణించం. హైపర్ రియలిజం లేదా ఫోటో రియలిజంలో ఫోటోలో కనిపించిన ఛాయల్నే చిత్రించడానికి ప్రయత్నిస్తారు. ఫోటోలో ఒక చోట అస్పష్టత ఉంటే, దాన్ని పెయింటింగ్‌లో కూడా అలాగే కొనసాగిస్తారు. కానీ నా పెయింటింగ్స్‌లో వస్తువే ప్రధానమైంది. దాన్ని చిత్రించే టెక్నిక్ కాదు. హైపర్‌రియలిజం పెయింటింగ్స్ చేసే వాళ్ళు ఇంతవరకు సైకిల్, మంచం, సోడా బండి వంటి దైనందిన జీవితానికి దగ్గరగా ఉన్న వస్తువుల్ని చిత్రీకరించలేదు. నా పెయింటింగ్స్‌లో వస్తువుతో పాటు, దానికి సంబంధించిన భావోద్వేగాలు కూడా ప్రధానంగా రూపుదిద్దుకుంటాయి.



ఆంజనేయులు మరో పెయింటింగ్
సోడా బండి

మైత్రి : ఇటీవల మీరు చిత్రించిన సైకిల్ పెయింటింగ్‌కు మంచి ఆదరణ లభించిందని తెలిసింది. ఆ వివరాలు చెబుతారా?

ఆంజనేయులు గుండు : ఇంట్లో నా గదిలో కనిపించే వస్తువుల్నే నేను ప్రధానంగా పెయింటింగ్‌లుగా మలిచాను. అవన్నీ నా చిన్ననాటి జ్ఞాపకాలకు సంబంధించినవే. సైకిల్, మంచం, సోడాబండి వంటివి నాతో, నా బాల్యంతో ముడిపడ్డవే. ఢిల్లీలో ఈ నెల 9వ తేదీ నుంచి 12 వ తేదీ వరకు ఇండియన్ ఆర్ట్ ఫెయిర్ జరిగింది. అక్కడ నేను ప్రదర్శించిన చిత్రాల్లో సైకిల్ కూడా ఒకటి. దాదాపు పదేళ్ళ నుంచి సైకిల్‌ను చిత్రించాలని అనుకుంటుండే వాడిని. అయితే అది టెక్నికల్‌గా చాల పెద్ద పని. ఆర్టిస్టుగా నేను ఎదిగి, కాస్త నిలబడిన తరువాత పెద్దపెద్ద కాన్వాసులు చిత్రించేందుకు అనువైన స్టూడియోను సమకూర్చుకున్న తరువాత ఇలాంటి చిత్రాల్ని చిత్రించడం మొదలు పెట్టాను.

మైత్రి : సైకిల్‌తో మీ అనుబంధాన్ని ఒక కళాకారునిగా వివరించండి.

ఆంజనేయులు గుండు: దైనందిన జీవితానికి సంబంధించిన వస్తువుల్ని చిత్రించే క్రమంలో భాగంగా సైకిల్‌ను చిత్రించాలని నేను చాలాకాలంగా అనుకుంటుండే వాడిని. అయితే సైకిల్‌కు సంబంధించి నా మనోభావనలకు అనుకూలమైన చిత్రమేదీ మనసులో నాకు అప్పుడు రూపుదిద్దుకోలేదు. దానికి తోడు పెద్దపెద్ద సైజుల్లో పెయింటింగ్స్ వేయాలన్న నా ఆలోచనకు తగిన స్థలం నాకు ఉండేది. కాదు. ఆర్టిస్టుగా జీవితాన్ని మొదలు పెట్టిన రోజుల్లో సరైన స్టూడియో సౌకర్యం కూడా ఉండేది కాదు. అందుకే తొలిరోజుల్లో అంతంత పెద్ద కాన్వాసులతో పనిచేయడమన్నది నాకు కుదిరేది కాదు. అయితే చిత్రకారునిగా నేను జీవితంలో నిలదొక్కుకోవడం మొదలైన తరువాత నా అవసరాలకు తగినంత పెద్ద స్టూడియోలోకి మారగలిగాను. ఇక అప్పుడు సైకిల్‌ను చిత్రించాలన్న ఆలోచనతో పని మొదలు పెట్టాలనుకున్నాను. కానీ సైకిల్‌ను ఏ భంగిమలో చిత్రించాలన్న సందేహం వచ్చింది. పడుకోబెట్టిన భంగిమా, లేక స్టాండ్ మీద నిలుచోబెట్టిన భంగిమా, లేక యురోపియన్ చిత్రకారుల శైలిలో కొక్కేలకు వేలాడదీసిన భంగిమా... చివరికి మూడో భంగిమనే ఎంచుకున్నాను. అయితే కొక్కేలకు బదులుగా నేను గోడకు వైర్లు కట్టి వేలాడదీసిన సైకిల్‌ను చిత్రించాలని నిర్ణయించుకున్నాను. చిన్నతనంలో నేను నివసించిన ఊరికి వెళ్ళాను. నా స్నేహితులతో కలిసి రోడ్ల మీద సైకిల్‌పై తిరిగిన జ్ఞాపకాల్ని ప్రోది చేసుకున్నాను. ఊళ్ళో ఒక పెద్దాయన నాకు ఎదురు పడ్డారు. ఆయన మా నాన్నగారి సమకాలికులు. అప్పట్లో ఊళ్ళో మా నాన్న గారికి మాత్రమే సొంత సైకిల్ ఉండేదని ఆయన చెప్పినప్పుడు కొంత గర్వంగా అనిపించింది. అటు నుంచి చిన్నతనంలో నేను చూసిన ఒక సైకిల్ రిపేరింగ్ దుకాణానికి వెళ్ళాను. అక్కడ గుట్టలుగా పోసిన సైకిల్ విడిభాగాల్ని చూశాను. సైకిల్ డైనెమో కూడా నా చిన్ననాటి మార్మిక జ్ఞాపకాల్లో ఒకటి. ఆ చిన్న సిలిండర్ మీద పడిన కాంతి అటు నుంచి వైరు మీదుగా ప్రయాణించి హ్యాండిల్ బార్ మీద పడినట్టుగా అప్పుడు నాకు ఒక ఊహాచిత్రం మనసులో మెదిలింది. అయితే తుదిరూపాన్ని చిత్రించే క్రమంలోనే రచించాల్సి వచ్చింది. సైకిల్ అన్నది బలమైన ప్రతీక. 'సైకిల్ అన్నది సామాన్యుడి గుర్రం' అని ఎవరో అన్న మాట నా మనసులో నాటుకు పోయింది. ఎన్ని వేగవంతమైన వాహనాలు ఉనికిలోకి వచ్చినా సరే, సైకిల్ స్థానం సైకిల్‌దే. సైకిల్ తొక్కడం వల్ల ఎంత మంచి ప్రయోజనాలు చేకూరుతాయో ఇటీవల వైద్యులు, పర్యావరణ శాస్త్రవేత్తలు, ఆరోగ్య నిపుణులు చెబుతుండడం వల్ల సైకిల్ ఇవాళ మళ్ళీ మన జీవితంలో భాగమైంది కదా!

మైత్రి : మీ కలర్‌స్కీమ్ గురించి వివరిస్తారా?

ఆంజనేయులు గుండు : నేను ఎక్కువగా భూ సంబంధిత వర్ణాల్నే ఉప యోగిస్తాను. మన దైనందిన జీవితంలోని వస్తువులు ఉదాహరణకు నులకమం చం, సోడా బండి వంటివన్నీ గోధుమవర్ణంలోనే ఉంటాయి. ఎల్లో ఆకర్, గ్రే (లేత నలుపు) వంటి రంగులకే నేను ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తాను.

మైత్రి : ఫోటోగ్రఫీకి, హైపర్ రియలిజంకి ఉన్న సంబంధాన్ని వివరిస్తారా? మీ చిత్రాలకు ఫోటోగ్రఫీని కూడా వాడుకుంటారా?

ఆంజనేయులు గుండు : లేదు. నేను ఫోటోల ఆధారంగా పెయింటింగ్‌లు చేయను. పెయింటింగ్ చేయాలనుకున్న వస్తువును ముందు పెట్టుకుని చిత్రిస్తాను. కానీ కొన్ని సందర్భాల్లో అది ఇబ్బందికరంగా మారినపుడు మాత్రమే ఫోటోల్ని వాడుతాను. సోడాబండి వంటి వాటిని చిత్రించేటపుడు వస్తువును ఎదురుగా పెట్టుకుంటే సరిపోదు. ఉదాహరణకు ఒక మంచం పెయింటింగ్‌నే తీసుకుంటే, కాన్వాస్ మీద కనిపిస్తున్న మంచం ఒక్క మంచాన్ని చూసి చిత్రించింది కాదు, అలాగే ఒక్క మంచం ఫోటోను చూసి చిత్రించింది కూడా కాదు. పది మంచం ఫోటోల్ని నేను నాకు కావలసిన విధంగా మార్చుకున్న తరువాత ఆ పెయింటింగ్ పూర్తయింది. ఫోటో అనేది నాకు సంబంధించినంత వరకు ఒక సాధనం మాత్రమే. అదే ప్రధానం కాదు. దేనినైనా పెద్దగా చేసి చూపాలనుకున్నపుడు ఫోటోగ్రఫీ ఉపయోగపడుతుంది. సోడాబండికి వేలాడుతున్న నీలంరంగు తాడు ఏ ఫోటోలోను లేదు. నేను కావాలని దాన్ని చిత్రించాను. ఉన్నదానికంటే ఎక్కువ వివరాల్ని చూపించడాన్ని హైపర్ రియలిజం అంటారు. అయితే నేను ఆ శైలిని అనుసరిస్తూనే మరికొంత భిన్నంగా వస్తువును దాని వ్యక్తిత్వంతో సహా చిత్రీకరిస్తాను.

మైత్రి : భారతీయ సమకాలీన కళ గురించి మీ అభిప్రాయం చెప్పండి. అంతర్జాతీయ స్థాయిని మన ఆర్టిస్టులు అందుకుంటున్నారా? ఈ దిశగా ఎలాంటి అధ్యయయనం, అవగాహన అవసరమంటారు?

ఆంజనేయులు గుండు : బయటి దేశాల్లో ఏం జరుగుతోందో గమనించాలి. స్థానికంగా సంప్రదాయశైలికి ఒకప్పుడు ఇక్కడ ఆదరణ ఉండేది. అప్పట్లో తోటవైకుంఠం, లక్ష్మాగౌడ్ లాంటి వాళ్ళు కొత్తశైలిని పరిచయం చేశారు. అయితే అటు తరువాత వారిని చాలామంది అనుకరించారు. ఇలా అనుకరించిన వాళ్ళెవ్వరూ ఇప్పుడు మిగలలేదు. వెనుకబడి పోయారు. తొలుత ప్రయోగం చేసిన వాళ్ళే చివరి వరకు మనగలుగుతారు. ముందుతరాల వారి ప్రభావం నుంచి తప్పించుకుని కొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టాలి. సుబోధ్ గుప్తా లాంటి వాళ్ళు ఇన్‌స్టలేషన్ ఆర్ట్ చేస్తున్నారు. కొత్తవాళ్ళలో కూడా మంచి చిత్రకారులున్నారు.

మైత్రి : ఆర్టిస్టుగా మీ ప్రస్థానాన్ని చెబుతారా?

ఆంజనేయులు గుండు : నాకు ఇద్దరు సోదరులున్నారు. చిన్నప్పటి నుంచి ఇంట్లో ఆర్ట్‌కు అనుకూలమైన వాతావరణం ఉండేది. ఇంట్లో గ్రేట్‌మాస్టర్స్ గురించిన పుస్తకాలుండేవి. దాంతో చిన్నప్పటి నుంచి ఆర్ట్‌ను అభ్యసించడమన్నది జీవితంలో ఒక భాగమైంది. తరువాత ఫైన్‌ఆర్ట్స్ చదువుకున్నాను. నేను 2006లో మొట్టమొదటి సారిగా సోలోషో చేశాను. ఢిల్లీలో తాజాగా ఇండియన్ ఆర్ట్ ఫెయిర్‌లో చేసింది నా నాలుగో సోలోషో.

ఇంటర్వ్యూ : పసుపులేటి గీత



ప్రజాదక్షుడికి జేజేలు

- కేసీఆర్ వీడియో ఆల్బం ఆవిష్కరణ
- నేడు రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు
- జలవిహార్‌లో ధూంధాంగా సంబురాలు
- ఎంపీ కవిత, టీఆర్ఎస్ నేత సంతోష్

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (మనం ప్రతినిధి): సీఎం కేసీఆర్ 64వ జన్మదిన వేడుకులను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా టీఆర్ఎస్ శ్రేణులు, ఆయన అభిమానులు ఉద్యుక్తులవుతున్నారు. ఇందులో భాగంగా టీఆర్ఎస్ యువజన విభాగం రూపొందించిన 'కేసీఆర్ బర్త్‌డే' వీడియో సాంగ్ ఆల్బమ్‌ను నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత శుక్రవారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కేసీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా అనేక కానుకలు వస్తాయని, ఈ పాట సీఎం ఆలోచనల ప్రతిరూపంగా రూపుదిద్దుకుందని కవిత చెప్పారు. కానీ, ఇది ప్రత్యేక కానుకగా నిలవాలని ఆమె ఆకాంక్షించారు. కేసీఆర్ చేపట్టిన వివిధ పథకాల వివరాలు, వాటి ఫలాలను తెలియజెప్పేలా వీడియో ఆల్బంను రూపొందించిన టీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎంఎల్సి శంభీపూర్ రాజును ఎంపీ కవిత అభినందించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్, కార్పోటర్లు జగన్, సత్యనారాయణ, రావుల శేషగిరి, ఎండీ రఫీక్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, టిఆర్ఎస్ కుత్బుల్లాపూర్‌మండల పార్టీ అధ్యక్షుడు నాగరాజు యాదవ్ పాల్గొన్నారు. కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం తెలంగాణ రాష్ట్రమంతటా ఘనంగా జరుపనున్నారు. పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని హైదరాబాద్‌లో పలు చోట్ల ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. శనివారం ఉదయంమే ఎంపీ కవిత పలు ఆలయాల్లో పూజలు నిర్వహించనున్నారు. హోమాలు చేయనున్నారు. తెలంగాణ భవన్‌తోపాటు, జలవిహార్, ప్రగతిభవన్‌లో నిర్వహించే వేడుకలు, రక్తదాన శిబిరాల్లో మంత్రి కేటీఆర్, ఎంపీ కవిత, పార్టీ ప్రధాన కార్యదర్శి జోగినిపల్లి సంతోష్‌కుమార్ పాల్గొననున్నారు.



'డబుల్'కు తక్కువ ధరకే స్టీల్

(3వ పేజీ తరువాయి)

లేనివిధంగా నిరుపేదలకు నాణ్యతతో విశాలమైన డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మిస్తున్నదని, ఇటువంటి ఉన్నత కార్యక్రమానికి.. లాభాపేక్షతో కాకుండా సానుకూల దృక్పథంతో సరసమైన ధరకు ఉక్కును విక్రయించాలని సూచించారు. గ్రామాల్లో లక్ష ఇండ్లకు 1.45 లక్షల మెట్రిక్ టన్నులు, పట్టణాల్లో 60 వేల ఇండ్లకు 1.04 లక్షల మెట్రిక్ టన్నులు, జీహెచ్ఎంసీ పరిధిలో లక్ష ఇండ్లకు 2.78 లక్షల మెట్రిక్ టన్నుల స్టీల్ అవసరమని వివరించారు. ఈ మేరకు రెండు నెలల కాలానికి (లాక్ ఇన్ పీరియడ్ ఫిబ్రవరి 16- ఏప్రిల్ 16 వరకు)గానూ రూ. 43,660కే ఉక్కును అమ్మేందుకు ఉక్కు కంపెనీలు అంగీకరించాయి. దీంతో గృహనిర్మాణశాఖపై దాదాపు రూ.264.60 కోట్ల భారం తగ్గనుంది. కాగా, బేస్‌రేట్ ధరల నిర్ణయం కీలక పాత్ర పోషించిన గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్ర రామచంద్రన్‌ను ఈ సందర్భంగా మంత్రులు అభినందించారు. సమావేశంలో హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ మడుపు భూంరెడ్డి, ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎదురులేని నేత

(3వ పేజీ తరువాయి)


నెంబర్ వన్‌గా నిలిపారు. ఉద్యమ నినాదమైన నిధులు, నియామకాలు, నీళ్లు... వీటి సాధనే లక్ష్యంగా కృషిచేస్తున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో కేసీఆర్‌కు విశిష్ట స్థానం ఉంది. శాంతియుత మార్గంలోనే రాష్ట్రాన్ని సాధించిన ఘనత ఆయనకే దక్కింది. దీంతో దేశంలో చాలా ప్రాంతాల్లో ప్రత్యేకరాష్ట్ర ఉద్యమాలకు కేసీఆర్ పోరాటం స్ఫూర్తిగా నిలిచింది. తెలంగాణ ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలను ఏకతాటికిపైకి తీసుకురావడంలో కేసీఆర్ అనుసరించిన వ్యూహం అమోఘం. టీఆర్ఎస్ మాత్రమే ఉద్యమాన్ని నడిపిస్తే.. అనేక వర్గాలు, శక్తులు, వ్యక్తులు కలిసి వచ్చే అవకాశం లేదని గుర్తించిన ఆయన ఎలాంటి భేషజాలకు పోకుండా.. జేఏసీని ఏర్పాటు చేశారు. తన నిరహార దీక్షతో ఉద్యమాన్ని తారస్థాయికి తీసుకెళ్లారు. దీంతో కేంద్రం ప్రత్యేక తెలంగాణ ప్రకటన చేయక తప్పలేదు. మధ్యలో కొంత అంతరాయం వచ్చినా... కేసీఆర్ పట్టుదలతో ఉద్యమాన్ని కొనసాగించారు.. చివరకు విజయం సాధించారు. ఒక్క రక్తం బొట్టు కూడా చిందించకుండా కొత్త రాష్ట్రాన్ని సాధించి చూపించారు. తెలంగాణ కల సాకరం కాగానే ఆయన సోనియాగాంధీని కుటుంబ సభ్యులతో సహా కలిసి కృతజ్ఞతలు తెలపడంలోనే ఆయన రాజనీతజ్ఞత కనిపిస్తుంది. నాటి పరిణామాలతో.. టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేయకూడదని నిర్ణయించుకున్నారు. ఇది రాష్ట్ర రాజకీయాల్లో ఎంతో కీలకమైన మలుపు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా తానే ఉండాలన్న నిర్ణయానికి కేసీఆర్ వచ్చేందుకు ఇది దోహదపడింది. తెలంగాణ సెంటిమెంట్ ఉన్నా.. టీఆర్ఎస్‌కు ఎన్నికల్లో భారీ ఆధిక్యం రాలేదు. దీంతో ఆయన పార్టీ బలోపేతంపై దృష్టిపెట్టారు. ముఖ్యంగా ఖమ్మం, నల్లగొండ, మహబూబ్ నగర్ లాంటి జిల్లాలపై ప్రత్యేకదృష్టి కేంద్రీకరించి పార్టీని నేడు తిరుగులేని శక్తిగా మార్చారు. ప్రభుత్వపరంగా ఆయన చేపట్టిన పథకాలు, నిర్ణయాల పట్ల ఆకర్షితులైన అనేకమంది ఇతర పార్టీల ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లో చేరారు. పార్టీని బలపేతం చేయడంలో కేసీఆర్ రాజకీయ చతురత కనిపిస్తుంది. కేసీఆర్ రాజకీయ ఉద్దండుడు, వ్యూహరచనా చతురుడు. నేడు రాష్ట్ర రాజకీయాల్లో ఆయనతో సరితూగగల నాయకుడి కోసం ప్రత్యర్థిపార్టీలు కాగడా పెట్టి వెతుకుతున్నాయి. రాజకీయ పరిణామాలను విశ్లేషించడంలో కేసీఆర్ దిట్ట. కేంద్రంతో ఎప్పుడు ఘర్షణ పడాలో, ఎప్పుడు సఖ్యతగా ఉండాలో బాగా తెలిసిన నాయకుడు ఆయన. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వాటిని రాబట్టుకోవడంలో ఆయన వ్యవహరించే తీరు చాలామందికి అర్థం కానిది. కేంద్రం పట్ల మెతక వైఖరి అనుసరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నా.. ఆయన తన పంథాలోనే సాగుతూనే ఉన్నారు. కేంద్రం చేసిన సాయానికి కృత జ్ఞతలు తెలుపుతూనే, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా చెప్పిన నిధుల లెక్కలపై ఘాటుగానే స్పందించారు. రానున్న ఎన్నికల్లోనూ విజయం సాధించేందుకు ఆయన మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేయాలని భావిస్తున్నారు. అదే సందర్భంలో రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ ఒంటరిగానే పోటీ చేస్తుందని ప్రకటించిన ఆయన, అందుకు అవసరమైన కసరత్తు ప్రారంభించారు. టీఆర్ఎస్ శ్రేణుల్లో ఎక్కడా నిరుత్సాహం రాకుండా చూస్తున్నారు. పార్టీ యంత్రాంగాన్ని ఎన్నికల కోసం సిద్ధం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసేందుకు సరికొత్త వ్యూహానికి పదును పెడుతున్నారు. దేశంలో ఇంతవరకు ఏపార్టీ చేయనివిధంగా వచ్చే ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఎన్నికల ఖర్చును పార్టీయే భరిస్తుందని చెప్పడం ద్వారా ఆయన మంచి సంప్రదాయానికి తెరలేపినట్లు భావిస్తున్నారు. ఎన్నికల్లో విచ్చలవిడి ఖర్చును తగ్గించవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాజకీయ ఎత్తుగడల విషయంలో శత్రువులు కూడా ఆయనను మెచ్చుకోకుండా ఉండలేరు. ఎవరూ ఊహించని రీతిలో ఎత్తుగడలు వేయడంలో ఆయనకు ఆయనే సాటి. అందుకే ఎన్నికల్లో ఆయన సారథ్యంలోని టీఆర్ఎస్‌ను ఢీకొనేందుకు విపక్షాలు ఏకం అయ్యేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రస్తుతానికైతే తెలంగాణలో కేసీఆర్ అజేయ, తిరుగులేని రాజకీయ నాయకుడు. ప్రజాదరణ పొందిన ముఖ్యమంత్రి. తెలంగాణ సరికొత్త చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందనడంలో సందేహం లేదు.



మా కష్టానికి ప్రతిఫలం ఇవ్వండి

- సారపాక ఐటీసీ వద్ద రైతుల ధర్నా
- మద్దతు పలికిన రేణుకా చౌదరి

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 16(మనం బ్యూరో): జామాయిల్, సుబాబుల్ రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల పక్షం ఆధ్వర్యంలో సారపాకలోని ఐటీసీ సంస్థ ఎదుట రైతులు శుక్రవారం ధర్నా చేశారు. జామాయిల్‌కు గతంలో టన్నుకి రూ.6 వేలు చెల్లించిన యాజమాన్యం నేడు రూ.3 వేలు కూడా ఇవ్వడం లేదని రైతులు వాపోయారు. గతంలో ఇచ్చిన ధరను ఇచ్చి తమ కష్టానికి ప్రతిఫలం దక్కేలా చూడాలని కోరుతున్నారు. అంతకుముందు నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి రైతులకు మద్దతు పలికారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ఐటీసీ యాజమాన్యం విఫలమయ్యిందని అన్నారు. తమది రైతు ప్రభుత్వం అని చెప్పుకునే టీఆర్ఎస్ నేతలు రైతుల సమస్యలను గాలికి వదిలేయడం ఏంటని ప్రశ్నించారు. రైతు కన్నీళ్ళు పెట్టిన రాజ్యామేది బాగుపడలేదని, వారి కన్నీళ్ళలో ప్రభుత్వం కొట్టుకుపోతుందన్నారు. రైతులు తమకు గతంలో ఇచ్చిన ధరనే కోరుతున్నారన్న విషయాన్ని ఐటీసీ గ్రహించాలన్నారు. రైతులకు సంకెళ్లు వేసిన ఘనత టీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే సున్నం రాజయ్య మాట్లాడుతూ ఒకప్పుడు ఆరువేల రూపాయిలు ఇచ్చిన యాజమాన్యం ఇప్పుడు మూడువేల లోపే ఇవ్వడం సబబు కాదన్నారు. రైతులు పండించిన పంటను ఐటీసీ నేరుగా కొనాలని డిమాండ్ చేశారు. ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకుని యాజమాన్యం రైతులకు న్యాయం చేయాలని పలువురు డిమాండ్ చేశారు.



వీసా నిబంధనలు ఇక సరళం

(3వ పేజీ తరువాయి)

మసీదును సందర్శించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం మత పెద్దలను ఉద్దేశించి మాట్లాడారు. భారత్‌తో ఇరాక్‌కు చారిత్రక, సాంస్కృతిక సంబంధాలు ఉన్నాయని ఈ సందర్భంగా రోహానీ పేర్కొన్నారు. ఇందులో భాగంగానే తమ దేశంలోని చాబహార్ పోర్టును భారత్ అభివృద్ధి చేస్తోందని తెలిపారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు పెంపొందించేలా వీసా నిబంధనలు సరళీకరిస్తామని అన్నారు. అంతకుముందు రోహానీ గోలకొండ కోట, కుతుబ్‌షాహీ టూంబ్స్‌ను తమ దేశానికి చెందిన 21 మంది ప్రతినిధులతో కలిసి సందర్శించారు. పర్షియన్-పస్తూన్- హిందూ నిర్మాణ శైలిని మిళితం చేసిన నిర్మించిన కుతుబ్‌షాహీ టూంబ్స్ అద్భుతమని కొనియాడారు.

నేరెళ్ల బాధితులను ఆదుకోండి

- నాయినికి వామపక్ష, జేఏసీ నేతల వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (మనం ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేరెళ్ల ఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వామపక్ష పార్టీల నేతలు, టీజేఏసీ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం మినిష్టర్స్ క్వార్టర్స్‌లో హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డిని కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. నాయినిని కలిసిన వారిలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి, టీజేఏసీ చైర్మన్ కోదండరాం తదితరులు ఉన్నారు. ఈ సదర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలని హోంమంత్రిని కోరామని చెప్పారు.

లొంగిపోయిన పురుషోత్తంరెడ్డి

(3వ పేజీ తరువాయి)

పురుషోత్తమ్ రెడ్డికి ఇళ్లతో పాటు, బంధువుల ఇళ్లపై ఏకకాలంలో ఏసీబీ సోదాలు నిర్వహించింది. సోదాల్లో భారీగా అక్రమాస్తులు వెలుగు చూశాయి. ఈ నేపథ్యంలో తనకు బెయిల్ మంజూరు చేయాలని పురుషోత్తం రెడ్డి కోర్టులో చేసుకున్న అభ్యర్థనను న్యాయమూర్తి తిరస్కరించారు. శుక్రవారం ఆయన లొంగిపోవడంతో కోర్టు రిమాండ్ విధించింది. దాంతో ఆయనను పోలీసులు జైలుకు తరలించారు. ఇదిలా ఉండగా, పురుషోత్తమ్‌రెడ్డిని తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఏసీబీ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు విచారణ జరపనుంది. మరోవైపు పురుషోత్తంరెడ్డి బంధువులకు చెందిన లాకర్లను అధికారులు శుక్రవారం తెరిచారు. కొటక్ మహీంద్రా బ్యాంకులో ఉన్న ఆ లాకర్లల్లో విలువైన బంగారు, వజ్రాభరణాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు

అక్రమంగా వెనుకేసిన సొమ్మంతా పురుషోత్తం రియల్ ఎస్టేట్‌లోనే పెట్టినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. బినామీలు యాదవరెడ్డి కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఓనర్(శ్రీసాయి హరహరాప్రైవేట్ లిమిటెడ్) పురుషోత్తంరెడ్డి బామ్మర్ది శ్రీనివాస్‌రెడ్డి ద్వారా యాదవరెడ్డి కంపెనీలో పెట్టుబడి పెట్టినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. శ్రీనివాస్‌రెడ్డి, యాదవరెడ్డిలతో కలిసి కొన్నేళ్లుగా పురుషోత్తంరెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడని అధికారుల విచారణలో బయటపడింది. కాగా, ఏసీబీ అధికారుల సోదాల్లో రూ.70 కోట్ల విలువచేసే ఆస్తుల డాక్యుమెంట్లు దొరికాయి. పురుషోత్తంరెడ్డి ఇళ్లు, శ్రీనివాస్‌రెడ్డి ఇళ్లలో ఇంకా సోదాలు చేయాల్సి ఉందని అధికారులు వివరించారు. ఆ రెండిళ్లలో సోదాలు చేస్తే బంగారం, లాకర్ల సమాచారం తెలిసే అవకాశం ఉందన్నారు. పురుషోత్తంరెడ్డి బినామీలు మరి కొంతమందిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని తెలిపారు.

దాడి విషయం ముందే లీక్?

హెచ్ఎండీఏ డైరెక్టర్ ఇంట్లో సోదా అంటే అందరికీ తెలిసే వ్యవహారం కాదు. కొంతమంది ఏసీబీ టీం కనుసన్నల్లో జరిగే వ్యవహారమిది. కానీ పురుషోత్తం రెడ్డిపై జరుగుతున్న దాడి ముందుగానే లీక్ అయ్యింది. ఏసీబీ అధికారులు ఇంటికి రావడానికి కొద్ది గంటల ముందే పురుషోత్తం అతని బినామీ బావమరిది శ్రీనివాసరెడ్డి ఈ రెండు కుటుంబాలతో సహా చడీచప్పుడు కాకుండా జారుకున్నారు. ఎలా జరిగిందో ఇప్పటికీ ఏసీబీ అధికారులకు అంతు బట్టడంలేదు. విదేశాలకు పారిపోకుండా ఏసీబీ అధికారులు లుక్‌అవుట్‌నోటీసులు కూడా జారీచేశారు. అయితే ఏసీబీ అధికారులు ఆరుబృందాలుగా విడిపోయి వేటసాగించినా పురుషోత్తం ఆచూకీ దొరకకపోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. పరారీలో ఉన్న పురుషోత్తంరెడ్డిని పట్టుకునేందుకు ఏసీబీ అధికారులు తీవ్రంగా ప్రయత్నించినా ఫలితంలేకపోయింది. ఎప్పటికప్పుడు స్థావరాలు మార్చేస్తూ అధికారుల కళ్లుగప్పి తప్పించుకుంటూ తిరుగుతున్నాడు. పురుషోత్తం కేరళ, చెన్నైలో ఉన్నాడన్న సమాచారంతో ఏసీబీ బృందాలు అక్కడికి తరలివెళ్లాయి. హైదరాబాద్‌లోనే తలదాచుకున్నట్లు వచ్చిన సమాచారంతో ఇక్కడా అధికారులు విస్తృతంగా గాలించారు. పురుషోత్తం రెడ్డి ఎప్పటికప్పుడు స్థావరాలు మారుస్తున్నట్లు, కూతుళ్లతో ఇంటర్నెట్, వాట్సాఫ్ కాల్స్‌లో మాట్లాడుతున్నట్లు అధికారులు గుర్తించారు. దీనిపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేసిన అధికారులు.. లొంగిపోతే మంచిదని పురుషోత్తం రెడ్డికి హెచ్చరికలు పంపారు.

భూసేకరణ వేగం పెంచండి : తుమ్మల

హైదరాబాద్, ఫిబ్రవరి 16(మనం ప్రతినిధి): జాతీయ రహదారుల విస్తరణ కోసం చేపడుతున్న భూసేకరణ ప్రక్రియ వేగం పెంచాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన ద్వారా మాట్లాడారు. రాష్ట్రంలోని జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, ఇతర నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూ.8 వేల కోట్లు ప్రకటించింది. ఈ రహదారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన కొత్త భూసేకరణ చట్టం ప్రకారం భూమి సేకరించాలని మంత్రి సూచించారు. ఈ భేటిలో అధికారులు సునీల్ శర్మ, రవిందర్‌రావు, గణపతి రెడ్డి, కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తీవ్రవాద ప్రాంతాల రోడ్లకు రూ.547 కోట్లు


రాష్ట్రంలోని తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి కేంద్రం నుంచి రూ.547 కోట్లు మంజూరయ్యాయి. ఈ నెల 6న మంత్రి తుమ్మల నేతృత్వంలోని అధికారుల బృందం కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, నరేంద్ర సింగ్ తొమర్‌ను కలిసి నిధులు మంజూరు చేయవల్సిందిగా కోరింది. చత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోని తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలను అనుసంధానిస్తూ ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో 452 కిలోమీటర్ల నిడివితో 20 రహదారులను నిర్మించనున్నారు. రహదారి నిర్మాణంలో భాగంగా గోదావరి నదిపై పర్ణశాల వద్ద, ముక్కనూరు-బూర్గుగూడెం మధ్య, మున్నేరుపై ఆరెంద వద్ద వంతెనలు నిర్మించనున్నారు.

తంబికి రొంబ షాక్

కావేరీ జలాల్లో 14.75 టీఎంసీల కోత.. ఆమేర కర్ణాటకకు వాటా పెంచిన సుప్రీం

- కేరళకు 30, పుదుచ్చేరికి 7 టీఎంసీలు
- బెంగళూరు నీటి అవసరాలూ ముఖ్యమే
- తుది తీర్పు వెల్లడించిన సుప్రీంకోర్టు
- 15 సంవత్సరాల పాటు అమలులో తీర్పు
- మండిపడుతున్న తమిళనాడు వాసులు
- సర్కారు విఫలమైందంటున్న డీఎంకే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: కావేరీ జలాల పంపిణీలో సుప్రీంకోర్టు తమిళనాడుకు కొద్దిగా షాకిచ్చింది. కర్ణాటక ప్రభుత్వం రెండు రాష్ట్రాలకు సంబంధించిన బిలిగుండ్లు డ్యాం నుంచి 177.25 టీఎంసీల కావేరీ జలాలను తమిళనాడుకు విడుదల చేయాలని తీర్పిచ్చింది. దీంతో కలిపి తమిళనాడుకు మొత్తం 404.25 టీఎంసీల నీళ్లు ఏడాదికి అందుబాటులో ఉంటాయి. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలో జస్టిస్ అమితవరాయ్, జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్‌లతో కూడిన బెంచి గత సంవత్సరం సెప్టెంబరు 20 వరకు తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల ప్రతినిధుల వాదనలు విని.. అప్పట్లో తీర్పు వాయిదా వేసింది. శుక్రవారం నాడు ఆ తీర్పు వెల్లడించింది. ఇంతకుముందు.. అంటే 2007లో ట్రిబ్యునల్ చేసిన కేటాయింపుల కంటే కర్ణాటకకు ఏడాదికి 14.75 టీఎంసీల నీళ్లు అదనంగా అందుబాటులో ఉంటుండగా, తమిళనాడుకు అంతేమొత్తంలో తగ్గుతాయి. కొత్త తీర్పు 15 సంవత్సరాల పాటు అమలులో ఉంటుందని, అప్పటివరకు ఇదే నిష్పత్తిలో రెండు రాష్ట్రాలు కావేరీ జలాలను పంచుకోవాలని సుప్రీం ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. 2007లో కావేరీ జలాల వివాదాల ట్రిబ్యునల్ ఇచ్చిన అవార్డు ప్రకారం కర్ణాటకకు 270 టీఎంసీల నీళ్లు అందుతుండగా ఇప్పుడు 284.75 టీఎంసీలు అందుతాయి. ఇక కేరళకు అప్పట్లో కేటాయించిన 30 టీఎంసీలు, పుదుచ్చేరికి కేటాయించిన 7 టీఎంసీలు యథాతథంగా ఉంటాయని బెంచి తెలిపింది. కావేరి బేసిన్‌కు 20 టీఎంసీల దిగువన భూగర్భ జలాల నుంచి 10 టీఎంసీల నీటిని తోడుకోడానికి మాత్రం తమిళనాడుకు సుప్రీంకోర్టు అనుమతించింది. ఈ 10 టీఎం సీల భూగర్భ జలాలు తగ్గడంతో పాటు బెంగళూరు వాసుల తాగునీటి అవసరాల కోసం మరో 4.75 టీఎంసీ ల నీళ్లు కావాలి కాబట్టే కర్ణాటకకు అదనంగా 14.75 టీఎంసీల నీళ్లు కేటాయించామని తెలిపింది.



అనేక మలుపులు..

సుదీర్ఘకాలంగా ఈ వివాదం కోర్టులలో పెండింగులో ఉండటంతో ఈ మధ్యకాలంలో కూడా పలు మధ్యంతర ఉత్తర్వులను సుప్రీంకోర్టు కర్ణాటకకు ఇచ్చి తమిళనాడుకు కావేరీ జలాలు ఇప్పించింది. 2016 సెప్టెంబరు 30వ తేదీన కర్ణాటకను తీవ్రంగా తప్పుపడుతూ.. చట్టం ఎప్పుడు ఆ రాష్ట్రం మీద పడుతుందో ఎవరికీ తెలియదని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. కాగా, సుప్రీం ఉత్తర్వులను కర్ణాటక ఆ తర్వాత సవాలు చేసింది. ఆ మధ్యలో కర్ణాటక తమకు కేటాయించిన నీళ్ల కంటే ఎక్కువ వాడుకుంటోందని, అసలు తమకు ఇవ్వడం లేదంటూ తమిళనాడు ఆరోపించింది. సుప్రీంకోర్టుకు నదీజలాల గురించి విచారించే అధికారం లేదని, ఆ విషయం ట్రిబ్యునల్ చూసుకుంటుందంటూ కేంద్రం వ్యక్తం చేసిన అభ్యంతరాన్ని సైతం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

తమిళుల ఆగ్రహం

కావేరీ జలాల వాటాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో తమిళనాడు వాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తగిన వాటా పొందేందుకు ప్రయత్నం చేస్తామని పాలక అన్నాడీఎంకే చెబుతుండగా.. సుప్రీంకోర్టులో సమర్థంగా వాదనలు వినిపించడంలో ప్రభుత్వం విఫలమైందంటూ డీఎంకే మండిపడింది. తమ ప్రభుత్వం పోరాటం కొనసాగిస్తుందని అన్నాడీఎంకే ఎంపీ ఎం. నవనీతకృష్ణన్ అన్నారు. తొలి అడుగుగా కావేరీ నదీజలాల యాజమాన్య బోర్డును ఏర్పాటుచేయాలని ఆయన కేంద్రాన్ని కోరారు. ముఖ్యమంత్రి పళనిసామి కూడా దీనిపై త్వరలో ఒక ప్రకటన చేసే అవకాశం ఉంది. కాగా.. ఈ తీర్పు దిగ్భ్రాంతికరమని, తగినన్ని నీళ్లు తెప్పించుకోడానికి కావల్సిన సాక్ష్యాధారాలను సుప్రీంకోర్టుకు సమర్పించడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని డీఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంకే స్టాలిన్ అన్నారు. డెల్టా రైతులు తమ అవసరాల కోసం పూర్తిగా కావేరీ నదిపైనే ఆధారపడతారు కాబట్టి.. వాళ్లు తీవ్రంగా నష్టపోతారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జి.రామకృష్ణన్ అన్నారు. ఇందులో సంతోషించడానికి ఏమీ లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు తమిళిసై సౌందరరాజన్ మండిపడ్డారు.

అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి

- తెలుగు రాష్ట్రాల సీఎంలకు మందకృష్ణ మాదిగ డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 16(మనం ప్రతినిధి): ఎస్సీ వర్గీకరణకు సంబంధించి మార్చి 5 లోపు ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలంటూ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. వర్గీకరణకు మద్దతునిస్తూ పెద్ద మాదిగ అన్పించుకుంటున్న చంద్రబాబు కేంద్రంలో మాత్రం నోరెత్తడంలేదని విమర్శించారు. నాలుగు రోజుల పాటు రాజ ధానిలో ఉన్నప్పటికీ కేసీఆర్ ఎస్సీ వర్గీకరణ ఊసే ఎత్తలేదని ఆరోపించారు. జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీల అసమర్థత వల్లే పార్లమెం ట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టలేకపోయారన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో బిల్లును పార్లమెంటులో పెడతామని చెప్పి.. నాలుగేండ్లు దాటినా నేటికీ ఆ దిశగా అడుగులు వేయలేదని మందకృష్ణ మండిపడ్డారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలంటూ బీజేపీ అధిష్టానా నికి ఆయన సూచించారు. లేదంటే తెలంగాణలో బీజేపీ నేతలు తీవ్ర ప్రతిఘటన చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. రెండేళ్లుగా ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా లేఖ రాయకుండా రాహుల్ గాంధీ తాత్సారం చేస్తున్నారని మందకృష్ణ మండిపడ్డారు. లేఖ రాయకుండా తెలంగాణాలో పర్యటిస్తే రాహుల్‌ను అడ్డుకుని తీరతామని స్పష్టంచేశారు. వర్గీకరణ ఉద్యమం గాంధేయ పద్ధతిలోనే సాగుతుందని వివరించారు. అయితే, ఎమ్మార్పీఎస్ శ్రేణులు సహనం కోల్పోతే దేశంలో ఎన్నడూ లేని అశాంతి తప్పదని, దానికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.



కేసీఆర్ అంటే కల్వకుంట్ల చంద్రశేఖర రావే కాదు భగీరథ ప్రయత్నం చేసి గోదావరిని ఇంటింటికీ రప్పించే ప్రాజెక్టులు శరవేగంగా నిర్మింపజేస్తున్నారు కాబట్టి కే అంటే కల్వకుంట్ల కాదు కాళేశ్వర అని కీర్తించాలన్నారు రాష్ట్ర గవర్నర్ నరసింహన్. ఇది ఆయన ఒక్కరే కాదు ఎందరో అంటున్న మాట... ఇక్కడితోనే ఆగిపోతే మన ప్రియతమ ముఖ్యమంత్రి గురించి ఏమీ తెలియదనే అనుకోవాలి. పథకాలతో ప్రజలకు స్వరాజ్య సంక్షేమం అంటే ఏమిటో ప్రత్యక్షంగా చూపుతున్నారు. కాబట్టి సీ అంటే చారిటీ...సంక్షేమ(చారిటీ)ం అనుకోవాలి... ఉమ్మడి పాలకులు దండుగ అన్న తెలంగాణ వ్యవసాయాన్ని... పండుగగా మారుస్తూ కర్షక మిత్రుడైనాడు కాబట్టి ఆర్ అంటే రైతు రావు అనాలి. నాలుగు కోట్ల మంది నాలుగు దశాబ్దాల కోరిక తీర్చడం కోసం ఉద్యమాన్ని స్థాపించి స్వరాష్ట్ర పాలన కల సాకారం చేసిన ఉద్యమయోగి. తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక. పాలన అంటే ఇదీ అని చూపుతూ అంతర్జాతీయ స్థాయి దాకా ఎందరెందరితోనో ప్రశంసలందుకుంటున్న మన ముఖ్యమంత్రి, ప్రియతమ నేత కేసీఆర్ గురించి ఎంతైనా చెప్పుకోవచ్చు. ఎంతైనా రాయొచ్చు. విద్యార్థిగా, సాహితీవేత్తగా, తండ్రిగా, రాజకీయ నేతగా, ఉద్యమకర్తగా, పాలకుడుగా... ఇట్లా ఎన్ని పాత్రలకైనా వన్నె తేగల మిస్టర్ పర్‌ఫెక్ట్ కేసీఆర్. ఒక్క మాటలో చెప్పుకోవాలంటే 'కేసీఆర్ ద నేమ్ ఈజ్ ఏ బ్రాండ్... యాన్ ఐకాన్ ఆఫ్ తెలంగాణ'... తెలంగాణ అస్తిత్వ ప్రతీక... తెలంగాణ జాతి రత్నం... బువ్వ ఉడికిందో లేదో తెలుసుకోవడానికి ఒక్క మెతుకు పట్టి చూసినట్లే ఆయన జన్మదినోత్సవం సందర్భంగా చంద్రునికో నూలు పోగు అన్నట్లు ఆయన గురించి జనం పత్రిక 'మనం' అందిస్తున్న కొన్ని సచిత్ర, విశేషణాలు...

కేసీఆర్..

ద నేమ్ ఈజ్ ఏ బ్రాండ్.. యాన్ ఐకాన్ ఆఫ్ తెలంగాణ

నేనంటే ఎంతో గౌరవం

కేసీఆర్ గురువు మృత్యుంజయ శర్మ



ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే సామెతను అక్షరాలా పాటిస్తున్న వ్యక్తి కేసీఆర్. చదువుచెప్పిన గురువులపట్ల కేసీఆర్ చూపిస్తున్న వినయ విధేయతలే ఆయన్ను ఉన్నత స్థానానికి చేరుస్తున్నాయి. 1966లో దుబ్బాక పాఠశాలలో చదవమన్న పద్యాన్ని వెంటనే కంఠస్థం చేసి గుక్క తిప్పుకోకుండా ఒప్పజెప్పినందుకు నేను నోటు పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చిన సందర్భాన్ని ఇప్పటికీ గుర్తుచేస్తూంటాడు. ఏ వ్యక్తికి అయినా గురువులుంటారు. ఎంత ఎదిగినా గురువుల పట్ల కేసీఆర్ చూపుతున్న అభిమానం నేటి తరానికి ఆదర్శప్రాయం. ఒక పద్యం జీవితాన్నే మార్చింది అని చెప్పేందుకు కేసీఆరే ఉదాహరణ. తెలుగు భాషపై పట్టు, భాషపై అభిమానం, ఆసక్తి, పురాణాలు, ఇతిహాసాలు, నీతి కథలు విరివిగా చదివి కేసీఆర్ గొప్ప ప్రజ్ఞను సాధించుకున్నాడు. తెలుగు మహాసభల వేదికపై నాకు చేసిన గురువందనం సమాజానికి మంచి సందేశం. నాటి ఉత్తర గోగ్రహణ పాఠం అతనిలో మార్పు తీసుకువచ్చిందన్నారు. కేసీఆర్ అల్లరిపిల్లవాడు. తెలివైనవాడు. ఏకసంథాగ్రాహి. గురువులే తనకు ప్రధాన దేవతలని తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పుడు మాట్లాడిన మాటలు ముఖ్యమంత్రి అయినా నేటికీ పాటిస్తున్నాడు.



మా నాయిన మనస్సు సున్నితం

మా నాయినకు సహనమెక్కువ. ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించరు. ఎవరి బాధనైనా అర్థం చేసుకుంటారు. తగు విధంగా స్పందిస్తాడు. దేన్నైనా వెంటనే గ్రహిస్తాడు. ఏ విషయంపై అయినా ఎంతో స్పష్టత కలిగి ఉంటారు. అదే నాకు, అన్నకు నేర్పారు. నాన్నకు పుస్తకాలు చదవడం అంటే చాలా ఇష్టం. ఇప్పటివరకు లక్ష పుస్తకాలు చదివుంటారు. వ్యక్తులను, సమాజాన్ని ఎంతో గౌరవిస్తారు. నాన్న ఎంతో సున్నిత మనస్కుడు. చిన్నప్పటి నుంచి అట్లే ఉండేవారని నాయినమ్మ ఎన్నో సార్లు చెప్పింది. ఎప్పుడు ఎవ్వరికి ఏ సమస్య వచ్చినా ముందుండేవారంట. నాయిన ఎప్పుడూ ఒంటరిగా ఉండరు. నా చిన్నతనం నుంచి చూస్తున్నా నాన్న ఎప్పుడు ఒంటరిగా తినలేదు. ప్రజల్లో ఉండటం అంటే చాలా ఇష్టం. ఎప్పుడూ ఎవరో ఒకరితో చర్చిస్తూంటారు. మాట్లాడటం ద్వారా ఎంతో జ్ఞానాన్ని నేర్చుకుంటానని చెప్తుంటారు.

ఉద్యమ నాయకుడికి సెల్యూట్...

జన నాయకుడికి జన్మదినోత్సవ శుభాకాంక్షలు.. ఇలాంటి జన్మదినోత్సవాలు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్నాను

మంచి లీడర్. అవకాశం వస్తే భారతదేశాన్ని మొత్తం కంట్రోల్ చేసే నాయకుడు. ఉద్యమ సమయంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనకడుగు వేయ్యలేదు. తన దగ్గరకు వచ్చే కార్యకర్త ఎందుకోసం వస్తున్నాడో చెప్పగల నాయకుడు. బహుశా ఆయన లాంటి నాయకుడు తెలుగు రాష్ట్రాల్లో లేరు. దిక్సూచిగా ఉద్యమాన్ని ముందుండి నడిపించారు. ఆయనకు సాటి తెలంగాణలో లేరు. ప్రాజెక్టు విషయంలో గానీ, అభివృద్ధి విషయంలోగానీ, సంక్షేమంలోగానీ ప్రణాళికాద్ధంగా నడుస్తున్న వ్యక్తి. తన పిల్లలను ఏవిధంగా చూసుకున్నారో ఉద్యమ నాయకులను కూడా అలాగే చూసుకున్నారు. ఆయన దగ్గర పనిచేసే బాలయ్య, ఆఫీస్ బాయ్ బాధలను పట్టించుకుని తీరుస్తారు. తెలంగాణ భవన్ దగ్గర కాన్సర్ ఆసుపత్రికి ఆంధ్ర నుంచి వచ్చే వారికిచ్చాడా జేబులో ఎంత ఉంటే అంతా ఇచ్చేవారు. ఒక వేళ తన దగ్గర లేకున్నా పక్కన ఉండే వారి అడిగి ఇచ్చేవారు. ఆయనకు ప్రాంతంతో సంబంధం లేదు. ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు ఆయనకు కొంత దూరం ఏర్పడది. దాంతో కేసీఆర్ ఎవర్నీ కలువట్లేదనే భావన ఏర్పడది. రాజ్యం ఏర్పడ్డ తర్వాత దూరం అనేది సహజంగా వస్తుంది. ఆప్యాయంగా పలకరించే గొప్ప మనసు ఉన్న దార్శనికుడు. 2009లో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నా అనుకున్నోళ్లు అందరూ ఆయనకు దూరమయ్యారు. చెప్పాలంటే పిడికిలంత మందే ఆయనతో ఉన్నారు. ఆయనకున్న మేధా సంపత్తితోటి, పట్టుదలతో మళ్లీ ఉద్యమానికి ఊపిరినిచ్చారు. ఏ దేశంలోనైనా కొన్ని సందర్భాల్లో ఒక నియంతలా నిర్ణయాలు తీసుకుంటేనే పనులు జరుగుతాయి. సామాన్య ప్రజలకు కొన్ని అంచనాలుండొచ్చు. అధికారంలోకి రాగానే అద్భుతాలు జరుగుతాయనే భావన ఉంటుంది. ఇంతకన్నా ఏ పాలకుడు కూడా తెలంగాణను అభివృద్ధి చేయలేకపోవచ్చు. పశ్చిమ బెంగాల్లో 27 ఏండ్లు సీఎంగా ఉన్న జ్యోతి బసు గానీ, 17 ఏండ్లు సీఎంగా ఉన్న షీలా దీక్షిత్ గానీ అక్కడ కూడా వ్యతిరేకత వచ్చింది. కొన్ని సార్లు నియంతలా ఉంటేనే పనులు జరుగుతయి. కార్యకర్తలకు 'ఓల్గా సే గంగా' పుస్తకం చదవమని చెప్పేవారు. రాష్ట్ర కమిటీలో ఆయన మాట్లాడుతూ... ఎన్నికల్లో చేసేది ఖర్చు కాదు. 2009 నాయకుడిగా ఎదగాలంటే నిత్యం ప్రజల్లో ఉండాలని సలహాలిచ్చేవారు. చట్ట సభల్లో ఉంటేనే నాయకుడు అనుకుంటే తప్పని చెప్పేవారు. రాజకీయాల్లో తెల్లబట్ట వెనుక విషాదాలు కూడా చాలా ఉంటయి. వాటిని ఓర్చుకున్నప్పుడే నాయకుడవుతారు. కేసీఆరే నాకు స్ఫూర్తి.



- డా॥ కాచం సత్యనారాయణ గుప్త

చింతమడక నుంచి సింహగర్జన దాకా..






కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రాజకీయ చరిత్ర

1954 ఫిబ్రవరి 17న మెదక్ జిల్లా సిద్ధిపేట మండలం చింతమడక గ్రామంలోని రాఘవ రావు, వెంకటమ్మ దంపతుల ఇంట శిశూదయం జరిగింది. తొమ్మండుగురు ఆడపిల్లలు, ఒక మగ పిల్లవాడి తరువాత పదకొండో సంతానంగా జన్మించిన బాబుకు చంద్రశేఖర రావు అని పేరు పెట్టారు. 'పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జనియించినపుడే పుట్టదు జనులా...' అన్నట్లు కాకుండా వారు శిశువును చూసి సంతోషపడ్డారు. పిల్లవాడు ఎదుగుతున్న కొద్దీ ఆ సంతోషం పెరుగుతూ వచ్చింది. వ్యవసాయంలో అన్నకు చేదోడు వాదోడుగా ఉంటూ చదువుకునే వాడు.





- ఇంటర్మీడియట్‌లో స్నేహితులతో కలిసి పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేవాడు. 15 ఏండ్ల వయస్సులోనే కోడూరుపాకకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు కేశవరావు కుమార్తె శోభతో పెండ్లయింది. నిజాంకు వ్యతిరేకంగా తన మామ కేశవరావు చేసిన పోరాట స్ఫూర్తితో కేసీఆర్ తెలంగాణ ఉద్యమం వైపు నడిచారు. 1970లో సంజయ్‌గాంధీ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్‌లో చేరాడు. తెలుగు భాషపై ఉన్న మక్కువతో ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీలో ఎంఏ తెలుగు లిటరేచర్ చదివారు. న్యాయశాస్త్రంలోనూ పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.
- ఇందిరాగాంధీకి సపోర్టుగా ఉన్న నాయకుల్లో కేసీఆర్ ఒకరు. విద్యార్థి దశలోనే రాజకీయ అనుభవం సంపాదించాడు.
- ఎన్‌టీఆర్ అధ్యక్షతన నడుస్తున్న టీడీపీలో చేరి ఆయనకు నమ్మకస్తుడిగా నడుచుకున్నారు. ఎన్‌టీఆర్ కరీంనగర్ వస్తే సిద్ధిపేటను జిల్లా చేయాలని అంబేద్కర్ విగ్రహం వద్ద పలువురు నాయకులతో కలిసి దరఖాస్తు అందించారు. 1982లో టీడీపీ నుంచి ఎమ్మెల్యే టికెట్ పొందారు. 1983లో పోటీ సిద్ధిపేట నుంచి పోటీ చేసి 887 ఓట్ల తేడాతో మదన్ మోహన్ (కాంగ్రెస్) చేతిలో ఓడిపోయాడు. 1985లో సిద్ధిపేట నుంచి రాష్ట్ర శాసన సభ్యుడిగా ఎన్నికై మొదలుపెట్టిన విజయపరంపర 1989,1994,1999 దాకా కొనసాగించారు. తెలంగాణ యాసతో ప్రజల మన్ననలు పొందాడు. 1987లో రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 1992–93లో పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్ పదవిని నిర్వహించాడు.
- 2000లో చంద్రబాబు విజన్ 2020 డాక్యుమెంట్‌లో 'హరిజనుల గిరిజనుల వెనుక బడిన వర్గాల మైనార్టీల ప్రసక్తిలేని పత్రం ఇదేం పత్రం? ఇందులో తెలంగాణా అభివృద్ధిని గురించి అసలు ప్రస్తావించలేదెందుక'ని ప్రశ్నించారు. 2000 ఆగస్టులో విద్యుత్ చార్జీలు పెంచుతూ బాబు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాసిన లేఖను పత్రికలు ''తెలంగాణ రైతులకు ఉన్న గోచీ ఊడిపోతుందనే'' శీర్షికతో ప్రచురించాయి. ఆ సమయంలోనే అనేక మంది తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు గురించి ఆయనతో చర్చించటం ప్రారంభించారు. 1969లో తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించిన వారిలో ఒకరైన సంతపురి రఘువీర్‌రావు సెప్టెంబర్2000లో కేసీఆర్‌ను కలిసి తెలంగాణ ఉద్యమంలోకి రావాలని ఆహ్వానించారు. అక్టోబర్ 2000లో జయశంకర్, కేసీఆర్ మధ్య జరిగిన చర్చలో 'తెలంగాణ కోసం ఎంతో మంది నాయకులతో కలిసి పనిచేశాను కానీ మీతో మాట్లాడిన తర్వాత మీ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడుతుందన్న నమ్మకం నాలో కలుగుతుందని' జయశంకర్ కేసీఆర్‌తో అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు ఏకైక పరిష్కారం పార్టీ స్థాపించడమే అని భావించి పార్టీ ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించారు. ఇది తెలుసుకున్న చంద్రబాబు మంత్రి పదవి ఇస్తానని ఎర చూపాడు. అయినా కేసీఆర్ లొంగి పోలేదు. తనకున్న డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీని వీడారు. మే 17, 2001న సింహగర్జన పేరుతో కరింనగర్‌లో ఒక భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద గల జలదృశ్యంలో సమావేశాలు ఏర్పాటు చేసి తెలంగాణ ప్రాముఖ్యతను వివరించారు.
- ఈ సింహగర్జన సభతోనే తెలంగాణ ఉద్యమానికి శంఖారావం పూరించారు.



కరీంనగర్ సింహగర్జన

కేసీఆర్‌కే సాధ్యం



బోర్ల రాంరెడ్డి.. ఈ పేరు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో కేసీఆర్ నోటి వెంట మాటిమాటికీ విన్పించింది. ఆయనెవరో తెలుసా? కేసీఆర్ ఎందుకు అన్నిసార్లు ఆయన పేరు ప్రస్తావించాడో తెలుసా? రాంరెడ్డి ఓ సాధారణ రైతు. నల్లగొండ జిల్లా ముషంపల్లికి చెందిన ఈయన ఇంటిపేరు బైరెడ్డి. తన పొలంలో నీళ్ల కోసం ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 67 బోర్లు వేశాడు. దీంతో బైరెడ్డి రాంరెడ్డి ఇంటి పేరు కాస్త బోర్ల రాంరెడ్డిగా మారిపోయింది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో రాంరెడ్డి బాధను ప్రస్తావిస్తూ తెలంగాణలో రైతులు పడుతున్న గోసను ఎన్నో సభల్లో కేసీఆర్ సజీవంగా ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం అధికారంలోకొచ్చిన సీఎం కేసీఆర్ బోర్ల రాంరెడ్డి ఇంటికి పోయి ఆయనతో దోస్తానా చేశాడు. ఆయనతో కలిసి భోజనం చేసి సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. తన కారులో సచివాలయానికి తీసుకపోయి రాంరెడ్డిని ఉన్నతాధికారులకు పరిచయం చేశారు. అంతటితో పరిమితం కాకుండా రాంరెడ్డి కుమారుడి పెండ్లికి కూడా హాజరై అందరినీ ఆశ్చర్యపరిచారు. ఓ సాధారణ రైతు కుమారుడి పెండ్లికి రాష్ట్ర ముఖ్యమంత్రి రావడంపై రాష్ట్రవ్యాప్తంగా పెద్ద చర్చ అయింది. 'గొప్పస్థాయిలో ఉన్నప్పటికీ నాలాంటి సాధారణ రైతును ఆదరించడం కేసీఆర్‌కు మాత్రమే సాధ్యమ'ని బోర్ల రాంరెడ్డి అంటారు.



పాఠశాలకు ఇచ్చిన కేసీఆర్ సొంతిల్లు

ఇప్పటికీ మా దుకాండ్లనే కొంటడు

అది హైదరాబాద్ హైదర్‌గూడలోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ ప్రాంతం. హఠాత్తుగా పోలీసులు పెద్ద ఎత్తున అక్కడ దిగారు. అక్కడికి వచ్చే దారులన్నింటిలో ట్రాఫిక్‌ను నిలిపివేశారు. వాహనదారులతో పాటు స్థానికులకు అక్కడేం జరుగుతుందో తెలిసేలోపే సీఎం కేసీఆర్ కారులో వచ్చి దిగాడు. సీఎం ఈడికెందుకొచ్చిండంటూ ప్రశ్నార్థకంగా చూశారు. దిగడంతోనే నేరుగా అక్కడున్న శ్రీ సాయి ఖాదీ వస్త్రాలయంలోకి పోయిండు. కేసీఆర్... అక్కడికెందుకొచ్చారో తెలుసా? డ్రెస్సులు కుట్టించుకోవడానికొచ్చారు. కేసీఆర్‌కు ఆ దుకాణమంటే ఇష్టం. 1990 నుంచి అక్కడే షాపింగ్ చేస్తున్నారు. ఆయనకదొక అలవాటు. దీనిపై దుకాణదారుడు సాయిబాబా 'సీఎం కేసీఆర్ నాకు 1984 నుంచి తెలుసు. 1990 నుంచి మాదగ్గరే బట్టలు కొని, మాదగ్గరే కుట్టిస్తారు. పొందూరు, బీహర్, కలకత్తా, బెంగాల్ వంటి వెరైటీ ఖద్దరంటే ఆయనిష్టపడతారు' అన్నాడు. కేసీఆర్ ఎవరితోనైనా సంబంధాలు తెంపుకోకుండా కొనసాగిస్తాడనడానికి ఇదే నిదర్శనం.

- శ్రీసాయి ఖాదీ వస్త్రాలయ యజమాని సాయిబాబా

పచ్చి పుల్సంటే శానా ఇష్టం



పచ్చి పులుసు అంటే కేసీఆర్‌కు శానా ఇష్టం. పచ్చి పులుసు లేకుండా అన్నమే తినడు. మేము చిన్నప్పటి నుంచి డిగ్రీ వరకు కలిసే చదువుకున్నం. 1969 ఉద్యమ సమయంలో జైలుగ్గూడ పోయినం. నన్నిప్పటికీ 'అరేయ్ మల్లేశా' అని ప్రేమతో పిలుస్తడు. చిన్ననాటి నుంచే ఆయనకు పుస్తకాలపై మక్కువ . రాఘవాపూర్ సింగిల్ విండో చైర్మన్‌గా రాజకీయ జీవితం మొదలుబెట్టిండు. ముఖ్యమంత్రిగా ఉన్నా ఇప్పటికీ ఆయన ప్రవర్తన, పలకరింపుల్లో అదే ప్రేమ కన్పిస్తది.

- కేసీఆర్ చిన్నప్పటి దోస్త్ బూర మల్లేశం, సీతారంపల్లి

ఒకే కంచం.. ఒకే మంచం అన్నట్టు మెదిల్నం



మొదట్నుంచి ఎప్పుడొచ్చినా మా ఇంట్లనే తింటడు. ఆయన అండతోనే నాల్గు సార్లు సర్పంచ్‌గ గెల్సిన. మా ఇద్దరి అనుబంధం వెలకట్టలేనిది. ప్రగతిభవన్‌కు రెండుసార్లు పోయిన. నాలుగు రోజులుండిపో మాధన్న అనన్నడు. మా కొడుకు, బిడ్డ పెండ్లికి ఆయన భార్యతో కల్సొచ్చిండు. ముఖ్యమంత్రి అయినా గింత గర్వం లేదు. సొంత అన్నదమ్ముల్లెక్క ఉన్నం. ఒకే కంచం.. ఒకే మంచం అన్నట్టు మెదిలినం.

- మాధవరెడ్డి, కొండం రాజుపల్లి

ఎవుసం అంటే ఆయనకెంతో ఇష్టం...



ఎవుసం అంటే ఆయనకెంతో ఇష్టం. ఇప్పటికీ నాకు ఫోన్‌జేసి 'ఎంకన్నా ఎట్లజేద్దం, ఏం పంట ఏస్తె బాగుంటద'ని సలహాలు అడుగుతడు. శత్రువులను సైతం మిత్రులుగా మార్చుకునే నైజం ఆయనది. మేమంతా ఒకే కుటుంబంలా మెదుల్తం. ఏ కార్యంజేసినా వస్తడు. ఇప్పుడు మా కొడుకు పర్మేశ్వర్ ఆయనకు పీఏగా పనిచేస్తుండు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో వర్థిల్లాలని కోరుకుంటున్న.

- వేముల వెంకట్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్

కలుపుకుని పోయే గుణం ఎక్కువ




మొదట్నుంచీ కేసీఆర్ అందర్నీ కలుపుకొనిపోతడు. ఎంతమందిలో ఉన్నా తెలిసిన వ్యక్తి కనిపిస్తే పిలిపించుకుని మరీ మాట్లాడతడు. ఇదే ఆయన గొప్పతనం. 1969 ఉద్యమం నుంచి నేను ఆయనతోటే ఉన్న. సిద్దిపేట డిగ్రీ కాలేజీలో కలిసే చదువుకున్నం. గడగడా మాట్లాడ్తడు. మంచి మాటకారి. ఆయన ఆప్త మిత్రుల్లో ఒకడిని కావడం నా అదృష్టం.

- ఆప్త మిత్రుడు సంగు పురెందర్, సిద్ధన్నపేట



నవాబ్ సాబ్ అని ప్రేమగా పిలుస్తడు



కేసీఆర్ నన్ను నవాబ్ సాబ్ అని ప్రేమగా పిలుస్తడు. ఆయన ప్రోత్సాహంతోనే రెండుసార్లు మా ఊరికి సర్పంచ్‌గా ఎన్నికైన. 30 ఏండ్ల క్రితమే మానేరు నుంచి సిద్దిపేటకు సురక్షిత మంచి నీరందించిండు. ముఖ్యమంత్రి అయినంక సిద్దిపేటకొచ్చినప్పుడు తొవ్వల నిలబడ్డ నన్ను చూసి 'నవాబ్ సాబ్' అని ప్రేమగా పిలిచి కార్ల ఎక్కించుకున్నడు. అంతటి గొప్ప గుణం ఉన్న వ్యక్తి. సీఎం అయినా చిన్నప్పటి దోస్తులనెవల్నీ మర్చిపోలేదు.

- సయ్యద్ మోహినొద్దీన్ (నవాబ్), తిమ్మాయిపల్లి

ఉద్యమ రథసారథి కేసీఆర్..





దాదాపు ఆరు దశాబ్దాల పాటు తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని చూస్తే.. 'పెనం మీద నుంచి తప్పించుకుని పొయ్యిలో పడ్డట్లు ఉండేది. నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా తెలంగాణ ప్రజలకు ఆంధ్రపాలకుల రూపంలో వివక్ష తప్పలేదు. ఆ వివక్షతను సహించలేక వారి పాలనకు చరమగీతం పాడేలా అనేక పోరాటాలు సాగాయి. ఈ దశలో ఎందరో ఉద్యమకారులు అమరులయ్యారు. కానీ ఆంధ్ర పాలకుల్లో ఏమాత్రం పశ్చాత్తాపం గానీ కనికరం గానీ కన్పించేది కాదు. తెలంగాణ రాష్ట్రం కోసం సాగించిన అనేక ఉద్యమాలు కాల గర్భంలో కలిసిపోతూ మరెన్నో కొత్త ఉద్యమాలు పుట్టుకొచ్చాయి. సరైన ఉద్యమపటిమలేని అనేక పోరాటాలు మధ్యలోనే ముగిసిపోయాయి. ఈ దశలో తెలంగాణ ఉద్యమాలకు ఆజ్యం పోస్తూ ఓ ఉద్యమ కెరటం ఉవ్వెత్తున ఎగిసిపడింది. 2001, ఏప్రిల్ 27న 'మా నిధులు, నీళ్లు.. మాకే' అంటూ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటయ్యింది. పార్టీ ప్రారంభ దశ నుంచి ఉద్యమాలే ఊపిరిగా కేసీఆర్ ముందుకు సాగారు. తెలంగాణ భాష, యాసలోనే ఆయన ప్రసంగాలన్నీ ఉండేవి. ఆయన పోరాట పటిమకు ముగ్ధులై ఎంతోమంది ప్రజలు ఆయన వెంట ముందుకుసాగారు. పార్టీపరంగానే కాక రాజకీయాలకతీతంగా తెలంగాణ ఉద్యమ శక్తులన్నింటినీ ఏకం చేసి పోరు సాగించారు. ఏనాడూ పదవుల కోసం ప్రాకులాడిన దాఖలాలల్లేవు. ప్రతి ఎన్నికల్లో పోటీ చేయడం గెలవడం.. రాజీనామా చేయడం పరిపాటిగా మారింది. నిజంగా కాలగర్భంలో కలిసిపోయిన నాయకుల మాదిరిగా పదవుల కోసం కేసీఆర్ ఆరాటపడి ఉంటే.. మరో 50 ఏండ్ల వరకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ప్రజలు చూసుండేవారు కాదు. ప్రొఫెసర్ జయశంకర్ వంటి మేధావులతో కలిసి రాష్ట్ర సాధనకు ఏం చేయాలి? ఎలా చేయాలి? అనే అంశంలపై నిరంతరం తపిస్తూ ముందుకుసాగాడు. కొంతకాలం పాటు కేంద్ర ప్రభుత్వం మాటల్ని నమ్మి ఉద్యమ వేగాన్ని కొంతమేరకు తగ్గించారు. కానీ కేంద్రం రాష్ట్ర ఏర్పాటు దిశగా అడుగులు వేయకపోవడంతో 'కేసీఆర్ చచ్చుడో.. తెలంగాణ వచ్చుడో' అని నినదిస్తూ ఉద్యమ కదనరంగంలోకి దూకారు. ఉద్యమంతో ప్రారంభమై.. 13 ఏండ్ల పాటు అలుపెరగని పోరాటం చేసి తెలంగాణ ప్రజల దశాబ్దాల కలను సాకారం చేశారు. నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజలతో తెలంగాణ జాతిపితగా కీర్తించబడే హక్కు ఒక్క కేసీఆర్‌కు మాత్రమే ఉందనడంలో అతిశయోక్తి లేదు.

టీఆర్ఎస్ ప్రస్థానం.. పరిణామాలు

2000 సంవత్సరం తెలంగాణలో కరెంటు చార్జీలు పెంపునకు నిరసనగా బహిరంగంగానే చంద్రబాబు సర్కారును విమర్శించారు.
చంద్రబాబు ప్రభుత్వానికి విజన్ 2020ని తయారు చేయాలని కేసీఆర్ చెప్పారు. ఆ విజన్‌లో తెలంగాణ అభివృద్ధి ప్రస్తావన లేకపోవడంతో టీడీపీపై తీవ్ర విమర్శలు చేశారు. తదనంతర పరిణామాలతో విసుగు చెందిన కేసీఆర్ తెలంగాణలోని మేధావులు, విద్యార్థులు, ఎన్‌జీఓ సంఘ నాయకులతో తర్జనభర్జనలు చేసి సొంతంగా పార్టీ పెట్టాలనే ఆలోచన చేశారు. ఈవిషయాన్ని పసిగట్టిన చంద్రబాబు కేసీఆర్‌కు మంత్రి పదవి ఇస్తానని రాయబారం పంపితే.. కేసీఆర్ ఆ ప్రతిపాదనను తిప్పికొట్టి 'తెలంగాణ ఏర్పాటే నా ధ్యేయం' అని ప్రకటించారు. అందులో భాగంగానే 2001 ఏప్రిల్ 27న అప్పటి ఉపసభాపతి పదవి, శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీకి గుడ్ బై చెప్పారు. హైదరాబాద్‌లోని జలవిహార్‌లో తెలంగాణ రాష్ట్ర సమితిని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.
అప్పటి నుంచి పార్టీపరంగా కేసీఆర్ ప్రస్థానం సాగిందిలా..





- 2001 జూన్‌లో మహబూబ్‌నగర్, నల్గొండ, నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో సభలు ఏర్పాటు చేసి తెలంగాణ చరిత్రను వివరించారు. ఈ సభలు నిర్వహించిన జిల్లాల్లో 85 జెడ్పీటీసీ, 100 ఎంపీటీసీ, రెండు జెడ్పీ చైర్మన్ స్థానాలను టీఆర్ఎస్ పార్టీ గెలుచుకుంది.
- 2002లో నల్గొండ జిల్లాలో మొదటిసారి పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంవత్సరం మే నెలలో భూదాన్‌పోచంపల్లిలోని చేనేత కార్మికుల కోసం కేసీఆర్ 'భిక్షాటన' చేశారు. నవంబర్‌లో ఆలె నరేంద్ర పార్టీని టీఆర్ఎస్‌లో విలీనం చేసి ఉద్యమాన్ని ఉధృతం చేశారు.
- 2003 జనవరిలో సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'తెలంగాణ గర్జన' సభ విజయవంతమైంది. ఏప్రిల్‌లో వరంగల్ జైత్రయాత్రలో 15 లక్షల మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ సభకు కేంద్ర నాయకులు దేవేగౌడ, అజిత్‌సింగ్ హాజరయ్యారు. మొదటిసారిగా టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడి హోదాలో సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినానికి ఉస్మానియా క్యాంపస్‌కు హాజరయ్యారు.
- 2004 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని 26 అసెంబ్లీ, ఐదు ఎంపీ సీట్లు గెలుచుకుంది. పదవులు చేపట్టిన సంవత్సరానికే ఆరు మంత్రిత్వ శాఖలకు రాజీనామా చేయడం గమనార్హం. యూపీఏ ప్రభుత్వంలో ఆలె నరేంద్రతో పాటు కేసీఆర్ మంత్రి పదవికి(కార్మిక శాఖ) రాజీనామా.
- 2006 కరీంనగర్ ఉపఎన్నికల్లో జీవన్‌రెడ్డి(కాంగ్రెస్)పై 2,01,582 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.
- 2007 తెలంగాణ భవన్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు.
- 2008లో మూడు ఎంపీ, 16 ఎమ్మెల్యే, మూడు ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా. ఉప ఎన్నికల్లో రెండు ఎంపీలు, ఏడు ఎమ్మెల్యే సీట్లను టీఆర్ఎస్ గెలిచింది.
- 2009 సిద్ధిపేటలో నిర్వహించిన తెలంగాణ ఉద్యోగ గర్జన సభ విజయవంతమైంది.
- 2009 సాధారణ ఎన్నికల్లో చంద్రబాబు, లెఫ్ట్‌పార్టీలతో ఏర్పాటు చేసిన మహాకూటమిలో భాగస్వాములయ్యారు. 45 స్థానాల్లో పోటీచేస్తే పది స్థానాల్లో మాత్రమే గెలుపొందారు.
- 2009 నవంబర్ 29 సిద్ధిపేటలో ఆమరణ నిరహార దీక్ష చేస్తున్నట్టు ప్రకటన. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అని పిలుపుతో సిద్ధిపేటకు వస్తున్న కేసీఆర్‌ను రోశయ్య సర్కార్ అరెస్టు చేయడంతో తెలంగాణ అట్టుడికి పోయింది. ఊరూ వాడా ఏకమై కేసీఆర్‌కు సంఘీభావంగా రిలే నిరాహార దీక్షలకు పూనుకున్నారు.
- 11 రోజులకు కేసీఆర్ ఆరోగ్యం క్షీణించడంతో తెలంగాణ ప్రజలు ఆందోళనలు ఉధృతం చేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. కేంద్ర హోంశాఖ నుంచి తెలంగాణ ఏర్పాటు ప్రకటన చేశారు. ప్రకటన చేసిన మరునాడే ఆంధ్రా పాలకుల ఒత్తిడికి తలొగ్గిన కేంద్రం ప్రకటనను వెనక్కి తీసుకుంది.
- 2010 టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాజీనామాను స్పీకర్‌కు అందజేశారు.
- ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ అఖండ మెజారిటీతో విజయం సాధించింది.
- 2010 వరంగల్‌లో తెలంగాణ మహాగర్జన సభకు 20 లక్షల మంది హాజరై విజయవంతం చేశారు.
- 2011లో కేసీఆర్ అధ్యక్షతన మిలియన్ మార్చ్ విజయవంతం. అదే సభలో సకల జనుల సమ్మెకు పిలుపు.
- 42 రోజుల పాటు ఏకధాటిగా సాగిన సమ్మెతో యావత్ తెలంగాణ కదం తొక్కింది.
- 2012 కేంద్రం తెలంగాణకు అనుకూలంగా అఖిలపక్ష కమిటీ వేసింది. ఇందులో అన్ని పార్టీల అభిప్రాయాలను తెలపాలని కోరింది.
- టీఆర్ఎస్ నుంచి కేసీఆర్, వినోద్ వెళ్లి తమ అభిప్రాయాన్ని తెలిపారు.
- 2013లో 10 జిల్లాతో కూడిన తెలంగాణను హైదరాబాద్ రాజధానిగా ప్రకటించాలని సీడబ్ల్యూసీ నిర్ణయం.
- 2014 జూన్ 2 తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం. అదే రోజున తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు.





కేసీఆర్ దత్తపుత్రిక ప్రత్యూష

సవతి తల్లి చేతిలో చిత్రహింసలకు గురై.. ఆస్పత్రి పాలైన 19 ఏండ్ల బాలిక ప్రత్యూష. ఈ విషయం తెలుసుకున్న కేసీఆర్ తన సతిమణి శోభారాణితో కలిసి ప్రత్యూషను పరామర్శించారు. ప్రత్యూష దీనస్థితిని చూసి చలించి ఆమెను దత్తత తీసుకున్నారు. ఆమె వారి కుటుంబ సభ్యురాలిగా ఉంటుందని కేసీఆర్ వాగ్ధానం చేశారు. విద్య, ఉద్యోగం, ఇల్లు కల్పించడంతో పాటు తన సొంత ఖర్చుతోనే వివాహం జరిపిస్తానని కేసీఆర్ హామీచ్చారు. తన కూతురు కవిత ప్రత్యూషకు సోదరిలాగా ఉంటుందని, ఆమెను జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు. ప్రత్యూషను కేసీఆర్ తన ఇంటికి భోజనానికి పిలిచి తన లక్ష్యం ఏంటో తెలుసుకున్నాడు. ఆమె నర్సు కావాలనుందని తెలుపగా, కేసీఆర్ ఆ మాటకు అభినందించి కొన్ని రోజుల పాటు ప్రత్యూషను తన ఇంట్లోనే ఉంటుందని, చిత్రహింసలకు గురి చేసిన ఆమె తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారమే ప్రత్యూషకు చదువుకు కావాల్సిన సాయాన్ని అందించారు. కేసీఆర్ ప్రోత్సాహంతోనే ప్రత్యూష తన జీవిత లక్ష్యమైన నర్సింగ్ విద్యను అభ్యసిస్తోంది. ఇప్పుడు తన జీవితం ఎంతో సంతోషంగా ఉందని, దానికి కారణం ముఖ్యమంత్రి కేసీఆర్ అని ప్రత్యూష చెబుతోంది.

నిలువెత్తు ఉద్యమం కేసీఆర్

'ఎవడికి కావలోయ్.. ఓడినవాడి సంజాయిషీ..
వాలుకు కొట్టుకు పోయినవాడికి లోకం జల సమాధి కడుతుంది..
ఒడ్డుకు చేరినవాడికి వంగి సలాం కొడుతుంది...'

అని సీనారే(సి.నారాయణరెడ్డి).. చెప్పిన ఈ వాక్యం సీఎం కేసీఆర్‌కు చక్కగా సరిపోతుంది.

ఉద్యమానికి ఊపిరిలూది 60 ఏండ్ల తెలంగాణ ప్రజల కలను సాకారం చేసేందుకు ముమ్మందుకు ఉరికాడు. నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజలకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచాడు. గులాబీ దళపతిగా తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అంతరంగంలోకి ఓసారి తొంగిచుద్దాం..

జన్మనిచ్చిన తల్లిదండ్రులంటే దైవంతో సమానమని, అలాంటి వారిని వృద్ధాప్యంలో ఇబ్బందులు పెట్టే ప్రభుత్వోద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ తల్లిదండ్రుల్ని పట్టించుకోవడం లేదంటూ నిత్యం లేఖలు వస్తున్న నేపథ్యంలో కేసీఆర్ పై విధంగా స్పందించారు. తల్లిదండ్రుల బాగోగులను పట్టించుకోని వారి జీతం నుంచి నెలకు రూ.వెయ్యి కట్ చేస్తామని ప్రకటించారు. ఈ విషయం తల్లిదండ్రులపై కేసీఆర్‌కు ఉన్న గొప్పతనానికి ఉదహారణగా చెప్పొచ్చు.

చూడ్డానికే సన్నగా..

ఆయన చూడ్డానికే సన్నగా ఉంటారు. కానీ పహిల్వాన్లు, మేధావులను తలదన్నేలా శక్తి, ఓపిక ఆయన సొంతం. అన్ని విషయాలపై స్పష్టమైన అవగాహన కల్గి ఉంటారు. విద్యార్థులు, ఉద్యోగులు, పారిశ్రామిక వేత్తలు అంటూ తేడా లేకుండా అందరినీ తన సమాధానంతో ఒప్పించగలిగే సామర్థం కేసీఆర్‌లో దాగి ఉంది. బక్కపలచని దేహం నుంచి వచ్చే మాటల తూటాలకు ఎవరైనా తలొగ్గాల్సిందే. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి కేంద్ర, ఉమ్మడి పాలకులను గడగడలాడించారు. అందుకే ఆయన తెలంగాణ ప్రజలందరీ గుండెల్లో ఆరాధ్య నాయకుడిగా నిలిచిపోయారు.

తెలంగాణ బాద్‌షా

బంగారు తెలంగాణ స్వాప్నికుడు అలుపెరుగని పోరాటయోధుడు...దశాబ్దాల కలలను సాకారం చేసిన ధీరుడు...బంగారు తెలంగాణ స్వాప్నికుడు...హరిత తెలంగాణ ప్రేమికుడు...నిరంతర కర్షకశ్రామికుడు...అపర భగీరథుడు...రైతు సంక్షేమ బాంధవుడు...షాదీముభారక్, కళ్యాణలక్ష్మిలతో దళిత, గిరిజన, మైనార్టీ, బడుగు, బలహీన వర్గాల ఆడపడుచులకు పెద్దన్న...కుల వృత్తులకు పూర్వ



వైభవప్రధాత...నిరంతర విద్యుత్ వెలుగు జిలుగుల స్ఫూర్తిదాత...వ్యవసాయానికి 24గంటల నిరంతర విద్యుత్ సరఫరాకు బాటలు వేసిన అన్నదాతల స్నేహశీలి... సింగరేణి బొగ్గు గని కార్మికులను దేశ సరిహద్దు సైనికులతో పోల్చిన మానవతావాధి...అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు తోబుట్టువుగా...శాంతి భద్రతలే ప్రధాన లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న పోలీస్, హోంగార్డులకు అండగా...తెలంగాణ యాస, భాషాభ్యున్నతే లక్ష్యంగా ప్రపంచ తెలుగు మహాసభలను నభూతో నభవిష్యత్తుగా నిర్వహించి తెలుగు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని ఏర్పార్చుకుని...తెలంగాణ ప్రజలందరి మనస్సులో చిరస్థాయిగా నిలిచిన నవతెలంగాణ నిర్మాత మన సీఎం కేసీఆర్...ఆయనే మన తెలంగాణ భాద్‌షా కల్వకుంట్ర చంద్రశేఖర్‌రావ్. రాష్ట్ర వ్యాప్తంగా కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలను శనివారం ఘనంగా ప్రజలు జరుపుకోనున్నారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించటమే తన లక్ష్యంగా కేసీఆర్ మలి ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ అడుగుజాడల్లో నడుస్తూ, కాళోజీ స్ఫూర్తితో ఊపిరి పోశారు. బెదిరించారు, అదిరించారు అయినా పట్టిన పట్టు విడవకుండా ప్రత్యేక తెలంగాణ కోసం అలుపెరుగని పోరాటం చేశారు. పోరాటాన్ని ప్రజాఉధ్యమంగా మలిచారు. ప్రత్యేక రాష్ట్రం కోసం తెలంగాణ ప్రజలంతా ఉవ్వెత్తున ఎగిసిపడ్డారు. అనుకున్నది సాధించారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ అధికార బాధ్యతలు చేపట్టారు. ప్రజా సంక్షేమం కోసం నూతన ఆలోచనలకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలోనే మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పనులను రూ. వేల కోట్లతో చేపట్టారు. సాగు, తాగు నీటికి ప్రథమ ప్రాధాన్యమన్నారు. కోటి ఎకరాలను సాగులోకి తేవటంతో పాటు ఇంటింటికి నల్లా నీటిని అందించేందుకే ఈ పథకాలని అన్నారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్ల సౌకర్యానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చే దిద్దే పనిలో పడ్డారు. ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు జిల్లాల పునర్విభజన చేపట్టారు. తెలంగాణకే తలమానికమైన సింగరేణి బోగ్గుబావుల్లో రద్దైన వారసత్వ ఉద్యోగాల స్థానంలో కారుణ్య నియామకాలకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. పేద గిరిజన, దళిత, మైనార్టీ, బీసీల పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో మెరుగైన విద్యనందించేందుకు విరివిగా గురుకులాలను ఏర్పాటు చేస్తున్నారు. రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తూ అన్నదాతల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయారు. పేదలైన యువతుల వివాహానికి ఇచ్చే ఆర్థిక సాయాన్ని రూ. లక్షకు పెంచేలా చర్యలు చేపట్టారు. కుల వృత్తులను ప్రోత్సహించేందుకు యాదవులకు, కురుమ గొల్లలకు గొర్రెల పంపిణీ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. ఆసరాతో వృద్ధులను, వితంతులకు ఆదుకున్నారు. టీహబ్‌తో పారిశ్రమలకు ఊతమిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే పనిలో పడ్డారు మన కేసీఆర్ సార్.

సకలం నీవే... సబ్బండ వర్ణాలూ నీవే

రైతు నాగలి నల్లరేగడి రాజు నీవని దీవిస్తుంటే
పూరి గుడిసెలే సందమామలా నిన్ను దాచుకుంటే...

పెద్ద కొడుకువని వృద్ధులందరూ ఆత్మపూర్తి ఆలింగనమిస్తే
ఆడబిడ్డలే కన్నతండ్రిలా నిన్ను కొలుస్తుంటే...

పచ్చపచ్చనీ పైరులు మొలిచే రైతన్నల పెదవుల్లో
పైరు నీవే పంటా నీవే పాడీ నీవే
ఆ శిశువుని శిగను తలపించుచున్నదే తెలంగాణలో చెరువే
నీరూ నీవే యేరూ నీవే నదులూ నీవే

ఈ నేలకు ఆనందాలూ ప్రతి పల్లెకు సంతోషాలూ
నీ పాలనలో పథకాలై ప్రతి గడప చేరినాయే
మన పాలమూరు భూముల్లో పల్లేరు ముల్లనే తెంచి
తరలిపోయె కృష్ణమ్మా చనుబాలు పంచినావె

కారణజన్ముడా ఓ కార్యసాధకుడా చీకటిని ఛేదించి
వెలుగు వెదజల్లే చందురుడా
కారణ జన్ముడా ఓ కార్యసాధకుడా చీకటిని ఛేదించి
వెలుగు వెదజల్లే చందురుడా

పంట కాల్వలూ పరవళ్లూ
పరుగులెత్తే నాగండ్లూ
కరువు కోరలకు ఉరితాళ్లూ
వరిని ముద్దాడే కొడవండ్లూ
బంజరు భూముల మడినీ
బంగారు పంటల వడిగా

కారణజన్ముడా ఓ కార్యసాధకుడా చీకటిని ఛేదించి
వెలుగు వెదజల్లే చందురుడా

కోతలేని విద్యుత్తు రాకతో కలతలెన్నో తీరే
పలుగు పారతో పట్టణాలకూ వలసలాగిపోయే
చేప పిల్లే పల్లెటూళ్లకు సంపదగా నిలిచే

ఊరికి ఉపాధి కదిలొచ్చి తాతల తరాలు గురుతొచ్చే
గొల్లకురుమల వాడలలో మూగ జీవి సిరులనిచ్చే
హరితహారం చిగురించీ వేళకు వానలు దిగివచ్చే
యవ్వనం పండుగలా మారే అది నీ ముందు చూపు వల్లే

కారణజన్ముడా ఓ కార్యసాధకుడా చీకటిని ఛేదించి
వెలుగు వెదజల్లే చందురుడా

– రచన మిట్టపల్లి రవీందర్



కేసీఆర్‌తో వండర్ కిడ్ లక్ష్మీ ప్రయాణం..

చాలా మందికి ఏదో ఒక రంగంలో వాళ్ల టాలెంట్స్‌ని నలుగురిలో ప్రదర్శించి ఏదైనా సాధించాలనే తపన ఉంటుంది. కొంతమంది కొన్ని కారణాల వల్ల సాధించలేకపోతారు. కానీ నాలో ప్రతిభను గుర్తించి నన్ను ప్రోత్సహించారు. నాకంటూ ఒక స్థానాన్ని కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక మహనీయుడు. టీ న్యూస్ ఛానల్ నా ప్రతిభకు అద్దం పట్టింది. అదే సమయంలో నా టాలెంట్ విషయం సీఎం వరకు చేరింది. తన క్యాంప్ కార్యాలయంలో కలిసేందుకు ఆహ్వానించారు. నాకోసం కేసీఆర్ ప్రత్యేకంగా టైమ్ కేటాయించి నాతో ముచ్చటించడం మరిపోలేని అనుభూతి. రాష్ట్ర అత్యున్నత స్థానంలో ఉండి కూడా నాతో సామాన్యుడిలా మాట్లాడిన పద్ధతి నన్ను ఎంతోగానో అశ్చర్యపరిచింది. ఆ రోజు క్యాంప్ ఆఫీస్‌లో ఇచ్చిన మాట ప్రకారం 2016 ఏప్రిల్ 10న మా ఇంటికి రావడం సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. ఇచ్చిన మాటను గుర్తుంచుకుని రూ.10 లక్షల చెక్కును బహుమతిగా అందజేశారు. కేసీఆర్ ద్వారానే తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కల్పించారు. డిసెంబర్ నెలలో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహసభల వేదికపై తెలంగాణ గురించి మాట్లాడేందుకు మరొసారి అవకాశం కల్పించారు. వాగ్దానాలను నెరవేర్చడంల కేసీఆర్‌కి ఎవరూ సాటి రారు.

తెలంగాణ ఉద్యమ పాట కేసీఆర్

తెలంగాణ ప్రజల అస్థిత్వాన్ని నిద్రలేపి పోరుబాట తప్పదని గుర్తు చేసింది ఈ పాట.

పాటకి ప్రాణం పల్లవి అంటారు.. కానీ ఆ పాటకి ప్రాణం పోసింది మాత్రం గీత రచయిత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు. కేసీఆర్‌కు విశేష భాషా ప్రావీణ్యం ఉన్న సంగతి తెలిసిందే. ఆయనకు సాహిత్యంపై ఉన్న పట్టు కారణంగానే అద్భుతమైన వక్తగా రాణించారు. ఆకట్టుకునే ప్రసంగం మూలంగానే ప్రపంచ వ్యాప్తంగా ఎందరో అభిమానులను సంపాదించుకున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ ఉద్యమ సమయంలో మరోసారి తన అసమాన ప్రతిభకు నిదర్శనంగా 2011లో జై భోలో తెలంగాణ సినిమాకు రాసిన పాట..

గారడి చేస్తుండ్రు గడిబిడి చేస్తున్రు/ తొండికి దిగుతున్రు మొండికి పోతున్రు
బెమాను నాయకులూ బేతాలా మాంత్రికులు/ బాజారున దూకిన్రు.. బాఘోతం ఆడిన్రు
ఏ అరపై ఎల్లయుద్ధంలోన పొద్దు పోడిసేను/ అరె అద్దర రాతిరి తెలంగాణ ముద్దుగ వస్తేను
నోటి కాడికి వచ్చిన బుక్కకు అడ్డు పడుతున్రు/ అరె రారే రారే నాలిముచ్చుల నాటకాలకు పరదా తిస్తుండ్రు

ఈ పాట ద్వారా ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపారు. ప్రపంచ చరిత్రలోనే తెలంగాణది ఒక సుదీర్ఘపోరాటం. చెరగని అధ్యాయం. అలుపెరగని పోరాటలకు, బలిదానాలకు నిలువెత్తు రూపం. అటువంటి తెలంగాణా సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పడుతూ 2015లో 'కొలిమి' చిత్రంలో కేసీఆర్ రాసిన పాట యావత్ తెలంగాణా ప్రజల మనస్సుని హత్తుకుంది.

మన రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ.. జననీ జయ కేతనం' గేయానికి సైతం కొన్ని చరణాలను అందించి తెలంగాణపై ప్రేమను మరోమారు చాటుకున్నారు కేసీఆర్.

గోదావరి కృష్ణమ్మలు మన బీళ్లకు మల్లాలి/ పచ్చని మగానాలు పసిడి సిరులు పండాలి
సుఖశాంతుల తెలంగాణ సుభీక్షంగా వుండాలి/ స్వరాష్ట్రంగ తెలంగాణ స్వర్ణయుగం కావాలి

ఈ పాట తెలంగాణ ప్రజల మన్ననలను పొందింది. ఈ పాటలో తనకున్న మాతృ భాషాభిమానాన్ని కండ్లకు కట్టినట్టు చూపించారు.



తెలంగాణ బిడ్డగా పాట రూపంలో.. ఉద్యమకారుడి రూపంలో.. ఒక గొప్ప రాజకీయ నాయకుడిగా ప్రజల పక్షాన నిత్యం నిలిచే మన ముఖ్యమంత్రి కేసీఆర్.

కాన్సెప్ట్ అండ్ క్యారీ : ఎన్. మదనయ్య

ఇన్‌పుట్స్: మల్లాది క్రాంతి, బాదిని నర్సింహ, డేగ కుమార్, గుంటుపల్లి నవీన్, ట్రైనీ జర్నలిస్టులు శ్రీకాంత్ తాళ్లపల్లి, శివ కుమార్ రెడ్డి, తాటిపర్తి కుమార స్వామి,నల్లమాస మనోజ్, గోపీచంద్, స్వరూప, హిమబిందు, యమున, మాధురీ, రఘు, కార్తీక్, ప్రదీప్, రామక్రిష్ణ

ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గారికి జన్మదిన శుభాకాంక్షలు

















మా ఫ్యామిలీ గర్వపడుతుంది

– చిరంజీవి



వరుణ్‌తేజ్, రాశీఖన్నా జంటగా వెంకీ అట్లూరీ దర్శకత్వంలో బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ నిర్మించిన 'తొలిప్రేమ' చిత్రం ఇటీవల విడుదలై అందరి ప్రశంసలు అందుకుంటున్న సందర్భంగా శుక్రవారం ఉదయం హీరో చిరంజీవి... హీరో వరుణ్ తేజ్, దర్శకుడు వెంకీ, నిర్మాత వి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, బాపినీడులను హైదరాబాద్‌లోని తన నివాసానికి ఆహ్వానించి సన్మానించారు. చిరంజీవి మాట్లాడుతూ ''సినిమా ఆలస్యంగా చూశాను. చూసి చాలా ఇన్‌స్పైర్ అయ్యాను. నా బ్రదర్ పవన్ 'తొలిప్రేమ' టైటిల్‌తో వచ్చిన సినిమా కావడంతో చాలా క్యూరియాసిటీ కలిగింది. సినిమా ఇంత ప్రెష్‌గా ఉందంటే కారణం డైరెక్టర్ థాట్ వలనే. వరుణ్ పెర్ఫార్మెన్స్ చూసి మా ఫ్యామిలీ అంతా గర్వపడుతోంది'' అని అన్నారు. చిత్ర దర్శకుడు మాట్లాడుతూ ''చిరంజీవిగారు మా సినిమా చూసి నచ్చి మమ్మల్ని ఇలా పిలిపించి మాట్లాడటం చాలా సంతోషంగా, గర్వంగా ఉంది'' అని అన్నారు. నిర్మాత బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ మాట్లాడుతూ ''33 ఏళ్ల క్రితం సినిమాలు చేద్దామని మద్రాస్ వెళ్లాను. ఆ సమయంలో పసుపులేటి రామారావుగారి ద్వారా చిరంజీవిగారి ఇంటికి వెళ్లాను. నిర్మాతకన్నా... అక్కడ ఓ అభిమానిగానే చిరంజీవిగారితో పరిచయం జరిగింది. ఇన్నేళ్లకు రామ్ చరణ్, పవన్ కల్యాణ్, బన్నీ ఇప్పుడు వరుణ్‌తో సినిమా చేసే అవకాశం లభించింది. అన్నీ పెద్ద హిట్ అయ్యాయి. చాలా సంతోషంగా ఉంది'' అని అన్నారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ ''నాకు యాక్టర్ అవ్వాలన్న ఆలోచన చిరంజీవిగారిని చూసే వచ్చింది. ఈరోజు డాడీ వచ్చి మంచి మాటలు చెబుతుంటే చాలా సంతోషంగా ఉంది'' అని అన్నారు. థమన్ మాట్లాడుతూ ''చిరంజీవిగారు మమ్మల్ని గుర్తించి పిలిపించి....ప్రశంసించడం మాకు చాలా ఆనందాన్నిస్తుంది. ఇంటర్ పాస్ అయి డిగ్రీకి వెళ్తున్న ఫీలింగ్ కలుగుతోంది'' అన్నారు.

మాటలు లేకుండానే!



● ప్రభుదేవా

ప్రభుదేవా... డాన్స్ మాస్టర్‌గా, నటుడిగా, దర్శకుడిగా తనకంటూ ప్రత్యేకతను సంపాదించుకున్నారు. ప్రస్తుతం 'పిజ్జా' దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ప్రభుదేవా నటించిన చిత్రం 'మెర్క్యురీ'. ఆసక్తికరమైన విషయమేమంటే ఇందులో డైలాగ్స్ ఉండవట. సైలెంట్ థ్రిల్లర్‌గా సినిమా రూపొందుతుంది. అప్పుడెప్పుడో కమల్ హాసన్, సింగీతం శ్రీనివాసరావు కాంబినేషన్‌లో విడుదలైన 'పుష్పక విమానం' తర్వాత మరో సైలెంట్ మూవీ రాలేదు. ఈ సినిమాకు సంతోష్ నారాయణ్ సంగీతం అందించారు.

మెకానిక్ మహేశ్?



● మహేశ్

అర్జున్‌రెడ్డి'తో సంచలన విజయం అందుకున్న దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులు, విమర్శకులనే కాదు.. ఎంతో మంది సెలబ్రిటీలను ఈ సినిమా ఆకట్టుకుంది. వారిలో మహేశ్‌బాబు కూడా ఉన్నారు. ఈ సినిమా మహేశ్‌కు ఎంత నచ్చిందంటే.. త్వరలో సందీప్ దర్శకత్వంలో ఓ సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేంత. తాజాగా.. ఈ సినిమాకి సంబంధించిన మరో ఆసక్తికరమైన విషయం తెలిసింది. అదేమిటంటే.. ఇందులో మహేశ్ మెకానిక్ పాత్రలో సందడి చేయనున్నారట. త్వరలోనే ఈ విషయంపై క్లారిటీ వస్తుంది. ప్రస్తుతం మహేశ్ 'భరత్ అనే నేను' సినిమా చేస్తున్నారు. ఇది వేసవిలో తెరపైకి రానుంది. దీని తరువాత వంశీ పైడిపల్లి సినిమా చేయనున్నారు మహేశ్. దీని తరువాతే సందీప్ సినిమా ఉండొచ్చు. ఈ లోపు 'అర్జున్‌రెడ్డి' హిందీ వెర్షన్ పూర్తి చేసేందుకు సందీప్ ప్లాన్ చేస్తున్నారు.



● రుక్సర్ మీర్

తేజు సరసన రుక్సర్

కాంచి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఫస్ట్‌షో'. ఈ సినిమా ఇంకా విడుదల కాలేదు. ఈ సినిమాతో హీరోయిన్‌గా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది రుక్సర్ మీర్. ఆ తర్వాత 'ఆకతాయి' సినిమాలో నటించింది. అలాగే ఏప్రిల్‌లో నాని హీరోగా రూపొందిన చిత్రం 'కృష్ణార్జునయుద్ధం'లో కూడా నటించింది. త్వరలోనే మెగా క్యాంప్ హీరో సాయిధరమ్ తేజ్ సినిమాలో నటించబోతుందని వార్తలు వినపడుతున్నాయి. చంద్రశేఖర్ యేలేటి దర్శకత్వంలో తేజు నటించబోయే సినిమాలో రుక్సర్ మీర్ పేరు పరిశీలనలో ఉంది. త్వరలోనే ఈ విషయమై అధికారిక సమాచారం వెలువడుతుంది.

'చెన్నైచిన్నోడు' ఆడియో లాంచ్



జి.వి.ప్రకాష్‌కుమార్ హీరోగా నటించిన ఓ తమిళ చిత్రాన్ని 'చెన్నై చిన్నోడు' (వీడి లవ్‌లో అన్నీ చిక్కులే ట్యాగ్‌లైన్) పేరుతో శూలిని దుర్గా ప్రొడక్షన్స్ పతాకంపై తెలుగులోకి అనువదిస్తున్నారు వి.జయంత్‌కుమార్. నిక్కీ గల్రానీ , రక్షిత హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి ఎం.రాజేష్ దర్శకుడు. ఈ చిత్రంలోని పాటలను ఇటీవల హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టిఎఫ్‌సిసి ఛైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్ సీడీలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ''ఈ చిత్రంతో సక్సెస్ సాధించి తనకు నిర్మాతగా మంచి భవిష్యత్ ఏర్పడాలని కోరుకుంటున్నాను'' అన్నారు. సాయివెంకట్ మాట్లాడుతూ ''పాటలు, ట్రైలర్ బావున్నాయి. ఈ సినిమా జయంత్‌కు మంచి ఆరంభం కావాలి'' అన్నారు. నిర్మాత జయంత్‌కుమార్ మాట్లాడుతూ ''జి.వి.ప్రకాష్‌గారి నటనతో పాటు సినిమాకు మంచి సంగీతాన్ని కూడా అందించారు. అతి త్వరలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు.

'అ!' అనిపించే ప్రయత్నం



తెలుగులో కాన్సెప్ట్ ఒరియెంటెడ్ మూవీస్ రావడం అరుదు. అలాంటి అరుదైన చిత్రాలలో ఒకటిగా వచ్చిన సినిమా 'అ!'. వరుస విజయాలతో దూసుకుపోతున్న యువ కథానాయకుడు నాని ఈ సినిమాని నిర్మించడంతో.. ఈ చిత్రంపై ప్రత్యేక ఆసక్తి ఏర్పడింది. కాజల్, నిత్యా మీనన్, రెజీనా వంటి తారలు తోడవడంతో.. సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. దీనికి తోడు ఓ కొత్త దర్శకుడు (ప్రశాంత్ వర్మ) తెరకెక్కించిన సినిమా కావడంతో ఈ చిత్రంపై మంచి బజ్ వచ్చింది. శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమాపై 'మనం' అందిస్తున్న సమీక్ష మీ కోసం..

మనం రివ్యూ

కథ

కాలి (కాజల్) ఒక కాఫీ షాప్‌లోకి అడుగుపెట్టడంతో సినిమా మొదలవుతుంది. ఆ రోజే ఆమె పుట్టిన రోజు కూడా. అయితే, ఏదో తెలియని ఆందోళనతో ఆమె ఉంటుంది. మరో వైపు అదే కాఫీ షాప్‌లో తన తల్లిదండ్రులతో ప్రేమ వ్యవహారం చెప్పి.. తన లవర్‌ను పరిచయం చేస్తుంది రాధ (ఈషా రెబ్బా) . అయితే.. ఆ లవర్‌ను చూసి 'అ!' అని నోరు వెల్లబెట్టడం ఆమె తల్లి (రోహిణి) వంతు అవుతుంది. ఆ లవర్ ఎవరంటే.. బ్రైన్ డాక్టర్ క్రిష్ అలియాస్ కృష్ణవేణి (నిత్యా మీనన్). ఇక అదే షాప్‌లో వంటవాడి ఉద్యోగం కోసం వస్తాడు నల (ప్రియదర్శి). అతనికి జాబ్ ఇవ్వడానికి చిత్ర (ప్రగతి) కొన్ని టెస్ట్‌లు పెడుతుంది. నాని అనే చేప (దీనికి నాని వాయిస్ ఓవర్), చంటి అనే బోన్సాయ్ మొక్క (దీనికి రవితేజ వాయిస్ ఓవర్) సహాయంతో ఆ టెస్ట్‌లలో పాస్ అవుతూ వస్తుంటాడు. ఇక అదే కాఫీ షాప్‌లోకి యోగి (మురళీశర్మ) అనే మెజీషియన్ వస్తాడు. అయితే ఆ కాఫీ షాప్ ఓనర్ కూతురు (చిన్న పాప) నీ కంటే గ్రేట్ మేజిషన్ ఉన్నారు అనడంతో.. అతని ఇగో దెబ్బతింటుంది. అతను ఎవరో తెలుసుకోవాలనే ప్రాసెస్‌లో.. విచిత్రమైన పరిస్థితుల్లో ఓ బాత్‌రూమ్‌లో లాక్ అయిపోతాడు యోగి. ఇంకోవైపు సైంటిస్ట్ కావాలనుకునే శివ (అవసరాల శ్రీనివాస్).. టైమ్ మిషన్ సహాయంతో తను చిన్నప్పుడు మిస్ అయిన తల్లిదండ్రులను కలుసుకోవాలను కుంటుంటాడు. వీల్ ఛైర్‌లో పార్వతి (దేవదర్శిని) అక్కడికి వచ్చి.. 'నేను భవిష్యత్‌ను' అని చెబుతుంది. నేను చెప్పినట్టు చేస్తే.. మన తల్లిదండ్రులను కలుసుకోవచ్చు అంటుంది. మరో వైపు.. డ్రగ్ అడిక్ట్ మీరా (రెజీనా) అదే కాఫీ షాప్‌లో పనిచేస్తుంటుంది. తన ప్రియుడు చెప్పిన ప్లాన్‌కు సహకరిస్తే.. వాళ్ల లైఫ్ సెటిల్ అయిపోతుంది. ఇలా.. ఐదు కథలు ఒకే షాప్‌లో జరిగిపోతుంటాయి. అయితే వీటన్నింటికి ఒక లింక్ ఉంటుంది. అదేమిటన్నదే 'అ!' సినిమా.

విశ్లేషణ

ఓ కాఫీ షాప్.. ఐదు జోనర్లు.. చిన్న చితకా పాత్రలతో కలుపుకుని అటుఇటుగా 35 క్యారెక్టర్లు.. ఇది సింపుల్‌గా 'అ!' మూవీ గురించి చెప్పాలంటే. పతాక సన్నివేశానికి ముడిపెడుతూ.. నాలుగు జోనర్లతో సినిమా నడిపించాలనే దర్శకుడి ఆలోచన మెచ్చుకు తీరాల్సిందే. అయితే..కొత్తదనం పేరుతో కొన్ని సన్నివేశాలకు నేల విడిచి సాము చేయడం మాత్రం.. ప్రేక్షకులను కొంత గందరగోళానికి గురిచేస్తుంది. సినిమా మొత్తానికి.. కాజల్ పాత్రనే కీలకం. ఆమె పాత్రకి, మిగిలిన పాత్రలకి ఉన్న సంబంధం ఏమిటన్నది? తెరపైనే చూడాలి.

నటీనటుల విషయానికి వస్తే.. మల్టీపుల్ పర్సనాలిటీ డిజార్డర్ ఉన్న పాత్రలో కాజల్ నటన బాగుంది. పతాక సన్నివేశాల్లో.. ఆమె కనిపించే విధానం ఆమె అభిమానులను అలరిస్తుంది. నిత్యా మీనన్, ఈషా రెబ్బా, రెజీనా, అవసరాల శ్రీనివాస్, ప్రియదర్శి.. ఇలా అందరూ తమ పాత్రలకు న్యాయం చేశారు. ఇప్పటి వరకు చూడని పాత్రల్లో కనిపించి అలరించారు.

సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. మార్క్ కె.రాబిన్ అందించిన నేపథ్య సంగీతం, సాహి సురేష్ ఆర్ట్ వర్క్, కార్తీక్ ఘట్టమనేని ఛాయాగ్రహణం సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. మాటల్లో 'దేవుడు సృష్టించింది పాపం ఎలా అవుతుంది', 'ఎముకలోని గుజ్జుని లాగినట్టు.. నీ బుర్రలోని గుజ్జుని కూడా లాగేసినట్టుంది', 'కళ్ళు మూసుకోవడానికి కనీసం రెప్పలు కూడా ఇవ్వలేదు దేవుడు' అనే మాటలు బాగున్నాయి. నిర్మాణ విలువలు బాగున్నాయి.

చివరగా: 'అ!' అనిపించే ప్రయత్నం

రేటింగ్.. 2.75/5

చిత్రం: మనసుకు నచ్చింది



ప్రకృతికి, మనసుకు ముడిపెడుతూ హీరో కృష్ణ తనయ, మహేష్‌బాబు సోదరి మంజుల ఘట్టమనేని రూపొందించిన ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'మనసుకు నచ్చింది'. సందీప్ కిషన్, అమైరా దస్తూర్ జంటగా నటించిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ చిత్రంపై 'మనం' అందిస్తున్న సమీక్ష మీకోసం..

ప్రేక్షకుల మనసును నొప్పించే సినిమా

మనం రివ్యూ

కథ:

సూరజ్ (సందీప్ కిషన్), నిత్య(అమైరా దస్తూర్) చిన్నప్పటి నుంచి మంచి స్నేహితులు. వాళ్ళ మనసు తెలుసుకోకుండా వారిద్దరికీ పెళ్లి చేయాలనుకుంటారు పెద్దవాళ్ళు. ఐతే పెళ్లిరోజే ఇద్దరూ పారిపోయి గోవాకి చేరుకుంటారు. అక్కడ నిఖిత (త్రిధా చౌదరి)తో సూరజ్, అభయ్ (అదిత్ అరుణ్)తో నిత్య ప్రేమలో పడతారు. అయితే కొన్ని సంఘటనల తర్వాత నిత్యకి తన మనసులో ఉన్నది సూరజ్ అని అర్థమవుతుంది. మరి.. నిత్యని ఒక స్నేహితురాలిగా మాత్రమే చూస్తున్న సూరజ్ కూడా నిత్యతో ప్రేమలో పడ్డాడా? లేదా? అనేది మిగిలిన కథ.

విశ్లేషణ:

'నువ్వే కావాలి'కి మరో వెర్షన్ మూవీ 'మనసుకు నచ్చింది'. అందులో విరామ సమయానికి తను రిచాని ప్రేమిస్తున్న విషయం తరుణ్‌కు అర్థమవుతుంది. ఈ సినిమాలో అది హీరోయిన్ పాత్రకి అర్థమవుతుంది. అయితే ఒక ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కు కావాల్సిన అన్ని అంశాలు 'నువ్వే కావాలి'లో ఉంటే.. ఇందులో ఆ అంశాల్లో ఏ ఒక్కటీ కూడా లేవనే చెప్పాలి. దర్శకురాలు ప్రకృతి, మనసు అనే అంశాల మీద పెట్టిన ఫోకస్... కథ, కథనం మీద పెట్టి వుంటే మంచి ఫలితం వచ్చి ఉండేది. డాక్యుమెంటరీని తలపించే కథనంతో.. ఆద్యంతం ప్రేక్షకులని విసిగించడానికి అందివచ్చిన ఏ అవకాశాన్ని దర్శకురాలు వదులుకోలేదేమో అనిపిస్తుంది... సినిమాని చూస్తుంటే. సినిమాలో ఒక్కటంటే ఒక్కటి.. ఆకట్టుకోనే ఎమోషనల్ సీన్ లేదు. తన మనసుకు నచ్చింది ఇదీ.. అంటూ దర్శకురాలు చేసిన ఈ ప్రయత్నం.. ప్రేమకథా చిత్రాలను ఇష్టపడే వారిని ఏ ఒక్క సన్నివేశానికి కనెక్ట్ చేయలేకపోయింది. అలాగే హీరోహీరోయిన్ల పాత్రలు ఫస్ట్ హాఫ్‌లో ఒకలా ఉంటే.. సెకండాఫ్‌లో మరోలా ప్రవర్తిస్తుంటాయి. ఈ మార్పు కూడా ప్రేక్షకులకు మింగుడుపడని అంశమే. అలాగే ఫస్ట్ హాఫ్‌లో ఇంటర్వెల్‌కి ముందు రెండు పాటలైతే నిమిషం కూడా గ్యాప్ లేకుండా వచ్చి పడతాయి. అదేవిధంగా మూడు లిప్ లాక్ సీన్స్ ఉన్నా.. హీరోహీరోయిన్ పాత్రల మధ్య కెమిస్ట్రీ ఎక్కడా వర్కవుట్ కాలేదు. ఓవరాల్‌గా.. దర్శకురాలిగా, కథకురాలిగా మంజుల సక్సెస్ కాలేకపోయారనే చెప్పాలి.

ఇక నటీనటుల విషయానికి వస్తే.. తన ఇష్టాలు, తన ప్రతిభ ఏమిటో కూడా తెలియని కుర్రాడి పాత్రలో సందీప్ కిషన్ ఏదో నటించాలి తప్పదు అన్నట్టు కనిపించాడు. చాలా సన్నివేశాల్లో చాలా బాగా ఇరిటేట్ చేసేశాడు. ఇక ప్రకృతి ప్రేమికురాలిగా ఫస్ట్ హాఫ్‌లో.. సూరజ్ ప్రేమికురాలిగా సెకండ్ హాఫ్‌లో కనిపిస్తుంది అమైరా. అందం పరంగా ఓకే అయినా.. నటన విషయంలో అంతగా మెప్పించలేకపోయింది. మరో నాయిక త్రిధా చౌదరి.. అందాల ఆరబోతకే పరిమితమయ్యింది. మిగిలిన వారి గురించి మాట్లాడుకోవడానికి పెద్దగా ఏమీ లేదు.

సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే.. రవి యాదవ్ అందించిన ఛాయాగ్రహణం చాలా బాగుంది. తన కెమెరా ప్రకృతి అందాలను చాలా చక్కగా ఒడిసిపట్టింది. ప్రత్యేకంగా గోవా అందాలను చాలా బాగా చూపించారు. సినిమాకి ఎస్సెట్ ఏదైనా ఉందంటే.. అది రవి యాదవ్ కెమెరా పనితనమే. రధన్ అందించిన సంగీతంలో 'పరిచయము లేదా..' అనే పాట మాత్రమే వినడానికి, చూడడానికి బాగుంది. నేపథ్య సంగీతం కొన్ని సన్నివేశాలకు బాగా కుదిరింది. సాయిమాధవ్ బుర్రా రాసిన మాటల్లో 'ప్రతీ మనిషిలో ప్రపంచమంత ప్రేమ ఉంటుందిరా, కానీ 0.1% కూడా బయటకి రావడంలేదు. ఒక్కసారి మన హార్ట్‌తో మనం కనెక్ట్ అయితే ఆ ప్రేమంతా పరిచయమవుతుంది', 'నచ్చింది చేయడమే కదా సర్.. సక్సెస్ అంటే', 'సుఖం కంటే సంతోషం కోసం జాబ్ చేస్తానంటున్నాడు', 'ప్రపంచంలో గొప్ప ప్రేమికులు ఎవరో తెలుసా.. మన కళ్ళే', 'ఈ ప్రకృతిలో పుట్టి, పెరిగి ఆఖరికి ఈ ప్రకృతిలోనే కలిసిపోయే మనిషి.. తనకు ఆశ్రయం ఇచ్చిన ప్రకృతినే మర్చిపోయే స్థాయికి ఎదిగిపోయాడు. మనిషి చూడాలే గాని ప్రకృతిని మించిన గురువు లేదు, దీన్ని మించిన చదువు లేదు, ఇందులోనే అన్నీ ఉన్నాయి' వంటి ఆకట్టుకునే మాటలతో పాటు 'బర్రెకి తెల్ల పెయింట్ వేస్తే ఆవు కాదురా' వంటి కామెడీ డైలాగ్స్ కూడా అక్కడక్కడ ఆకట్టుకుంటాయి. నిర్మాణ విలువలు ఓకే అనిపిస్తాయి.

చివరగా: ప్రేక్షకుల మనసును నొప్పించే సినిమా

రేటింగ్: 1.75/5


నాగ్, నాని చిత్రంలో..




● శ్రద్ధా శ్రీనాథ్


నాగార్జున, నాని కాంబినేషన్‌లో ప్రముఖ నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ ఓ మల్టీస్టారర్ మూవీని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఈ నెల 24 నుంచి పట్టాలెక్కనుంది. ఇదిలా ఉంటే.. ఈ చిత్రంలో నానికి జోడీగా కన్నడ బ్యూటీ శ్రద్ధా శ్రీనాథ్ నటించనుందని తెలిసింది. తమిళ చిత్రం 'విక్రమ్ వేద'లోనూ, కన్నడ ఫిలిం 'యూ టర్న్'లోనూ తన నటనతో ఆకట్టుకున్న శ్రద్ధా ఈ చిత్రంతో తెలుగువారికి కూడా దగ్గరవుతుందేమో చూడాలి. ఇప్పటికే ఆది సాయికుమార్‌తో ఓ సినిమా చేస్తున్న శ్రద్ధాకి ఇది రెండో తెలుగు చిత్రమవుతుంది. త్వరలోనే శ్రద్ధా ఎంపికపై అధికారిక సమాచారం వెలువడుతుంది.

ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గారికి జన్మదిన శుభాకాంక్షలు



















స్టాక్ ఎక్ఛ్సేంజీల నిర్ణయంపై ఎం.ఎస్.సి.ఐ నిరసన



న్యూఢిల్లీ: విదేశాలలో డెరివేటివ్‌ల ట్రేడింగ్, డాటా ఫీడ్‌లను నిషేధిస్తూ భారతీయ స్టాక్ ఎక్ఛ్సేంజీలు తీసుకున్న చర్య పోటీ నిరోధకమైనదని, అది అనవసర అవాంతరాలకు దారితీయవచ్చని గ్లోబల్ ఇండెక్స్ ప్రొవైడర్ మోర్గాన్ స్టాన్లీ క్యాపిటల్ ఇండెక్స్ (ఎం.ఎస్.సి.ఐ) వ్యాఖ్యానించింది. పైగా, ఈ చర్య ఎం.ఎస్.సి.ఐ సూచీలలో భారతదేశ వెయిటేజి, దాని అసెట్ల వర్గీకరణపై ప్రభావం చూపవచ్చని పేర్కొంది. ఈ అసాధారణ, పోటీ నిరోధక చర్యను పునఃపరిశీలించాలని భారతీయ ఎక్ఛ్సేంజ్‌లు, మార్కెట్ల నియంత్రణ సంస్థ 'సెబి'కి అది తీవ్ర పదజాలంతో సూచించింది. అన్ని లైసెన్సింగ్ ఒప్పందాలను నిషేధించాలని, అంతర్జాతీయ మార్కెట్లకు ధరల ప్రత్యక్ష ప్రసారాన్ని నిలిపివేయాలని ప్రముఖ స్టాక్ ఎక్ఛ్సేంజీలు (బి.ఎస్.ఇ, ఎన్.ఎస్.ఇ, మెట్రోపాలిటన్ స్టాక్ ఎక్ఛ్సేంజ్ ఆఫ్ ఇండియా) ఫిబ్రవరి 9న నిర్ణయించాయి. ఈ అంశంపై అంతర్జాతీయ మదుపు సంస్థలతో చర్చించామని, ఇది మార్కెట్ వర్గీకరణలో మార్పునకు దారి తీయవచ్చని ఎం.ఎస్.సి.ఐ పేర్కొంది. ఎక్ఛ్సేంజీలు తీసుకున్న ఆ నిర్ణయాన్ని ''తిరోగమన చర్య''గా చూడకూడదని 'సెబి' చైర్మన్ అజయ్ త్యాగి వ్యాఖ్యానించారు. నిఫ్టీ 50 కంపెనీల సింగిల్ స్టాక్ ఫ్యూచర్లలో ట్రేడింగ్‌ను ఎస్.జి.ఎక్స్ ఫిబ్రవరి 5న ప్రారంభించింది. అటువంటి చర్య భారతీయ మార్కెట్ల నుంచి లిక్విడిటీ తరలిపోయేట్లు చేస్తుందని సింగపూర్ ఎక్ఛ్సేంజ్ ట్రేడింగ్ ప్రారంభించడానికి ముందే ఎన్.ఎస్.ఇ ఛీఫ్ విక్రమ్ లిమాయే వ్యాఖ్యానించారు.

నష్టపోయిన సూచీలు

మార్కెట్లపై లాభాల స్వీకరణ, పి.ఎన్.బి సంక్షోభ ప్రభావం



ముంబయి: బొంబాయి స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బి.ఎస్.ఇ) సున్నిత సూచి 'సెన్సెక్స్' శుక్రవారంనాడు మొదట్లో పుంజుకున్నా తర్వాత ఏకంగా 287 పాయింట్లు నష్టపోయి 34,010 పాయింట్ల వద్ద ముగిసింది. ఆటో, మెటల్, పి.ఎస్.యు, క్యాపిటల్ గూడ్స్, రియల్టీ, బ్యాంకింగ్ విభాగాల్లో షేర్ల అమ్మకాలు విస్తృతంగా సాగాయి. రూ. 11,400 కోట్ల మేరకు సాగిన మోసపూరిత లావాదేవీల సుడిగుండంలో చిక్కుకున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ షేర్ విలువ వరుసగా మూడవ రోజు కూడా పతనమైంది. ప్రభుత్వ యాజమాన్యంలోని ఈ బ్యాంక్ మూడు రోజుల్లో మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో రూ. 8,700 కోట్లకు పైగా కోల్పోయింది. సెన్సెక్స్ ఉదయం ట్రేడింగ్‌లో 34,508.24 పాయింట్ల గరిష్ఠ స్థాయిని చూసింది. కానీ, ఆ తర్వాత లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో 33,957.33 పాయింట్ల కనిష్ఠ స్థితిని చూసింది. చివరకు 34,010.76 పాయింట్ల వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్.ఎస్.ఇ) సూచి 'నిఫ్టీ' శుక్రవారం 10,612.90 పాయింట్ల నుంచి 10,434.05 పాయింట్ల మధ్య ఊగిసలాడుతూ 93.20 పాయింట్లు క్షీణించి 10,452.30 పాయింట్ల వద్ద ముగిసింది.

తాత్కాలిక డాటా ప్రకారం, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు గురువారం రూ. 240.29 కోట్ల విలువ చేసే షేర్లు విక్రయించగా, దేశీయ మదుపు సంస్థలు రూ. 49.92 కోట్ల విలువ చేసే షేర్లు కొనుగోలు చేశాయి.

''ప్రపంచ మార్కెట్లలో సానుకూల ధోరణి ఉన్నప్పటికీ, దేశీయ స్టాక్ మార్కెట్లు క్షీణించాయి. పి.ఎన్.బిలో జరిగినట్లు చెబుతున్న మోసం బ్యాంకులపై మదుపరుల ఆశావాదాన్ని కుంగదీసింది. పి.ఎన్.బి నిర్వాకానికి మరికొన్ని ఇతర బ్యాంకులు కూడా మూల్యం చెల్లించుకోవాల్సి రావచ్చని వారు భావిస్తున్నారు. పైగా, జనవరిలో వాణిజ్య లోటు పెరిగింది. బాండ్ల నుంచి లభించే ప్రతిఫలాలు పెరుగుతున్నాయి. ఇవి సమీప కాలంలో మార్కెట్లలో ఉత్థాన పతనాలు పెంచవచ్చు'' అని జియోజీత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధన విభాగాధిపతి వినోద్ నాయర్ చెప్పారు.



ఐ.ఓ.బి రుణ మేళా

హైదరాబాద్: బి.డి.ఎల్ కాంచన్‌బాగ్ ఆవరణలో ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ ఉప్పల్ శాఖ 2018 ఫిబ్రవరి 15న రుణ మేళా నిర్వహించింది. ఈ సందర్భంగా గృహ నిర్మాణానికి, వాహనాల కొనుగోలుకు రుణాలు మంజూరు చేసింది, విద్యా రుణాలు కూడా ఇచ్చింది. తనఖాపైన కూడా రుణాలు మంజూరు చేసింది. ప్రభుత్వ రంగ ఉద్యోగులకు వారి ఇంటి ముంగిటనే రిటైల్ రుణ సదుపాయం కల్పించాలనే అభిమతంతో ఈ శిబిరం నిర్వహించారు. విజయవంతంగా సాగిన ఈ కార్యక్రమంలో ఐ.ఓ.బి ఉప్పల్ శాఖ ఛీఫ్ మేనేజర్ కె. సత్యనారాయణ, మేనేజర్ డి. శ్రీధర్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీమతి స్వాతి రెడ్డి, ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది రాఘవేందర్, రాజేశ్‌లు పాల్గొన్నారు.

సొమ్ము వసూలు చేస్తాం

న్యూఢిల్లీ: రూ. 11,400 కోట్ల పి.ఎన్.బి వంచన కేసులో ప్రభుత్వ యాజమాన్యంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన సొమ్ము 30 కోట్ల అమెరికన్ డాలర్ల (సుమారుగా రూ. 1,915 కోట్లు) వరకు ఉంది. కానీ, ఈ సొమ్ముకు వచ్చిన ముప్పేమీ లేదని, దాన్ని వసూలు చేసుకుంటామని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గురువారం పొద్దుపోయాక స్టాక్ ఎక్ఛ్సేంజీలకు తెలిపింది. ''అధికారిక స్విఫ్ట్ మెసేజ్ ద్వారా జారీ చేసిన వివిధ లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్ఓయు) కింద అవతలిపార్టీగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పి.ఎన్.బి) వాటిల్లజేసిన నష్టంలో మా విదేశీ శాఖల ద్వారా మాకూ కొంత భాగం ఉందని మేం తెలియజేయదలచుకున్నాం'' అని అది స్టాక్ ఎక్ఛ్సేంజీలకు తెలిపింది. సాధారణ అంతర్జాతీయ వ్యాపార విధానంలో భాగంగా, రిస్క్ పార్టిసిపేషన్ ద్వారా యాక్సిస్ బ్యాంక్ నుంచి కొన్ని బయర్స్ క్రెడిట్ ఎసెట్లను కూడా యూనియ్ బ్యాంక్ కొనుగోలు చేసింది. ''ఈ లావాదేవీకి సంబంధించి రావలసిన మొత్తం సుమారు 30 కోట్ల అమెరికన్ డాలర్లుగా ఉంది. కానీ, బ్యాంకుకు ఎల్ఓయు/ఎల్.ఐ.సి/ఇతర డాక్యుమెంట్ల రూపంలో పూర్తి భద్రత ఉంది. ఆ మొత్తాన్ని పొందగలమని సంపూర్ణ విశ్వాసంతో ఉన్నాం'' అని బ్యాంక్ పేర్కొంది. ''యదార్థమైన కమిట్‌మెంట్లు'' అన్నింటినీ నిలబెట్టుకుంటామని, ఎంత మొత్తానికి గుది బండ పడిందీ దర్యాప్తు తర్వాతే తెలుస్తుందని పి.ఎన్.బి గురువారం వెల్లడించింది. నగల వ్యాపారి నీరవ్ మోదీతో సాన్నిహిత్యం ఉన్న కంపెనీలకు పి.ఎన్.బి ఉద్యోగులు కొందరు నకిలీ ఎల్ఓయులు జారీ చేయడంతో ఈ సమస్య వచ్చి పడింది. వాటిని ఉపయోగించుకుని కంపెనీలు ఇతర భారతీయ బ్యాంకులకు చెందిన అంతర్జాతీయ శాఖల నుంచి బయర్స్ క్రెడిట్‌ను సమీకరించగలిగాయి. రూ. 280.7 కోట్లు విలువ చేసే మోసపూరిత ఎల్ఓయులు జనవరి 16న జారీ అయినట్లు సి.బి.ఐ వద్ద పి.ఎన్.బి గత వారం ఎఫ్.ఐ.ఆర్ దాఖలు చేసింది. ఈ మోసం పరిమాణాన్ని తెలుసుకునేందుకు రికార్డులను నిశితంగా పరిశీలిస్తున్నట్లు బ్యాంక్ అప్పట్లో తెలిపింది. డైమండ్స్ ఆర్ అజ్, సోలార్ ఎక్స్‌పోర్ట్స్, స్టెల్లార్ డైమండ్స్ అనే మూడు వజ్రాల సంస్థలను అది ఆ ఫిర్యాదులో పేర్కొంది. ఈ మూడు విదేశీ సరఫరాదార్లకు చెల్లింపులు జరిపేందుకు బయర్స్ క్రెడిట్ కావాలంటూ జనవరి 16న తన వద్దకు వచ్చాయని పి.ఎన్.బి తెలిపింది. బయర్స్ క్రెడిట్ సమీకరించే ఎల్ఓయులు జారీ చేసేందుకు 100 శాతం నగదు మార్జిన్లు కావాలని బ్యాంకు కోరింది. కానీ, తామా సదుపాయాన్ని 2010 సంవత్సరం నుంచే ఉపయోగించుకుంటున్నామంటూ అవి దానికి అభ్యంతరం తెలిపాయి. ఆ మూడు వజ్రాల సంస్థలలోనూ నీరవ్ మోదీ, ఆయన భార్య అమీ, సోదరుడు నిషాల్, మేహల్ చోక్సీలు భాగస్వాములుగా ఉన్నారు. ఈ మూడు సంస్థలకు హాంకాంగ్, దుబాయ్, న్యూయార్క్ వంటి విదేశీ ప్రాంతాల్లో దుకాణాలున్నాయి.

ఎస్.బి.ఐ నగదూ ఉంది



కొచ్చి: నీరవ్ మోదీకి పంజాబ్ నేషనల్ బ్యాంక్ జారీ చేసిన లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్‌కు సంబంధించి తమ వైపు నుంచి నగదు 212 మిలియన్ల అమెరికన్ డాలర్లు (సుమారు రూ. 1360 కోట్లు) ఇమిడి ఉందని భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్.బి.ఐ) శుక్రవారం పేర్కొంది. పరారీలో ఉన్న నగదు డిజైనర్‌తో తమకు ప్రత్యక్ష లావాదేవీలు ఏవీ లేవని పేర్కొంది. ''నీరవ్ మోదీతో నేరుగా సాగిన లావాదేవీ ఏదీ లేదు. కానీ, పి.ఎన్.బి ద్వారా మా సొమ్ము కొంత ముడిపడి ఉంది'' అని ఎస్.బి.ఐ చైర్మన్ రజనీశ్ కుమార్ ఇక్కడ మీడియా ప్రతినిధులకు శుక్రవారంనాడు చెప్పారు. పి.ఎన్.బి జారీ చేసిన ఎల్ఓయును ఆధారం చేసుకుని మోదీకి ఎస్.బి.ఐ 212 మిలియన్ల అమెరికన్ డాలర్లను రుణంగా ఇచ్చిందని ఆయన తెలిపారు. నీరవ్ మోదీ బంధువు మిహుల్ చోక్సీ యాజమానిగా ఉన్న గీతాంజలి జెమ్స్‌కు మాత్రం బ్యాంక్ కొంత నగదు ఇచ్చిందని ఆయన తెలిపారు. ''గీతాంజలి సంస్థ వద్ద ఉన్న మా మొత్తం చాలా చిన్నది. దాని గురించి మేం కలవరపడడం లేదు'' అని రజనీశ్ అన్నారు. మొత్తం రత్నాలు, నగల రంగానికి ఇచ్చిన రుణాల గురించి అడిగినపుడు, దేశంలో ఎస్.బి.ఐ జారీ చేసిన మొత్తం రుణాలలో ఆ రంగం వాటా 1 శాతం కన్నా తక్కువే ఉంటుందని ఆయన జవాబిచ్చారు. ''మేం దేశంలో రూ. 16 లక్షల కోట్ల రుణాలిచ్చాం. అందులో నగల రంగానికి ఇచ్చిన రుణం రూ. 13,000 కోట్లకన్నా తక్కువే ఉంటుంది'' అని ఆయన అన్నారు. రత్నాలు, నగల పరిశ్రమకు సంబంధించినంత వరకు బ్యాంక్ చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తోందని, ఈ రంగానికి చెందిన ఖాతాల నుంచి రిస్కులు తక్కువగా ఉండేందుకు బ్యాంకు చాలా చర్యలు తీసుకుంటోందని రజనీశ్ చెప్పారు. ''మేం అనుసరించే రిస్కు నిర్వహణ విధానాలలో ఒకటి జాబ్ రొటేషన్. మేం ఏ వ్యక్తినీ ఒక పదవిలో ఒకేచోట మూడేళ్ళకు మించి కొనసాగనివ్వం. చాలా సున్నితమైన పదవులు కొన్ని ఉన్నాయి. మేం ఆ పదవులకు సంబంధించిన కార్యకలాపాలను చాలా సన్నిహితంగా పరిశీలిస్తూ ఉంటాం'' అని రజనీశ్ చెప్పారు. ఎస్.బి.ఐలో 'స్విఫ్ట్' వ్యవస్థ, కోర్ బ్యాంకింగ్ వ్యవస్థ సమీకృతమై ఉన్నాయని ఆయన తెలిపారు. బ్యాంకింగ్ రిస్కుతో కూడిన వ్యాపారమని, అవి క్రెడిట్ రిస్కులు, ఆపరేషనల్ రిస్కులు, మార్కెట్ రిస్కులు, విదేశీ కరెన్సీ రిస్కులు వంటి వివిధ స్వరూప స్వభావాలు కలిగినవిగా ఉంటాయని ఆయన చెప్పుకొచ్చారు. ''అంతిమంగా, మనం లావాదేవీలు నిర్వహించే మానవమాత్రులం. బ్యాంకులు నమ్మకంపైనే నడుస్తాయి. ఏ వ్యక్తి అయినా నమ్మక ద్రోహానికి పాల్పడితే, వాటిని గుర్తించగల ప్రక్రియను కూడా మనం పొందుపరచుకుని ఉండాలి'' అని ఆయన అన్నారు.



గంటపాటు ఆగిన గుండె మళ్లీ పనిచేసింది!

- పునర్జన్మ ప్రసాదించిన 'మెడికల్ మిరాకిల్'
- అరుదైన చికిత్స చేసిన అపోలో వైద్యులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: 'మెడికల్ మిరాకిల్' ఒక యువకుడికి పునర్జన్మ ప్రసాదించింది. గుండెలో నొప్పిగా ఉందన్న కారణంతో ఆసుపత్రికి వచ్చిన యువకుడికి యాంజియోగ్రామ్ పరీక్షలు నిర్వహిస్తుండగా, మరోసారి గుండెనొప్పి వచ్చి, సుమారు గంటపాటు గుండె కొట్టుకోవడం ఆగిపోయింది. కానీ వైద్యుల మాత్రం తమ ప్రయత్నాన్ని కొనసాగిస్తూ, రక్త ప్రసరణ అందేలా చేసిన చికిత్స సఫలమయింది.

లక్కీ ఇంజినీర్

నమ్మశక్యంగా లేకపోయినా ఢిల్లీలోని అపోలో ఆసుపత్రిలో ఇది నిజంగానే జరిగింది. అలీగఢ్‌లో ఇంజినీర్‌గా పనిచేస్తున్న 22 ఏళ్ల యువకుడు అసిఫ్ ఖాన్‌కు గుండె నొప్పి రావడంతో ఆసుపత్రిలో చేరాడు. అసిఫ్‌కు వైద్యులు శుక్రవారం యాంజియోగ్రామ్ పరీక్షలు నిర్వహిస్తుండగా, మళ్లీ గుండె నొప్పి వచ్చింది. దీంతో ట్రౌమా స్పెషలిస్టులు అతనికి సీపీఆర్ చేస్తూనే, షాక్ ట్రీట్‌మెంట్ కూడా ఇచ్చారు. దీంతో గంట తరువాత మళ్లీ గుండె పనిచేయడం మొదలైంది. వైద్యరంగంలో దీన్ని అత్యంత అరుదైన చికిత్సగా భావిస్తున్నారు.

నీరవ్ పాస్‌పోర్టు సస్పెన్షన్

బంధువు మెహుల్ చోక్సీది కూడా..



- నాలుగువారాలపాటు అమలు: విదేశాంగశాఖ
- వారంలోగా విచారణకు హాజరుకండి
- నీరవ్, చోక్సీలకు ఈడీ సమన్లు
- రెండో రోజూ కొనసాగిన సోదాలు
- గీతాంజలి గ్రూప్‌పై సీబీఐ ఎఫ్ఐఆర్
- వారి ఆచూకీకోసం ఇంటర్‌పోల్‌కు విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ.11,400 కోట్ల మేరకు బురిడీ కొట్టించిన నీరవ్ మోదీ పాస్‌పోర్టును కేంద్ర ప్రభుత్వం నాలుగు వారాల పాటు సస్పెండ్ చేసింది. ఆయన సమీప బంధువు మెహుల్ చోక్సీ పాస్‌పోర్టును కూడా నాలుగు వారాలపాటు సస్పెండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. సస్పెన్షన్ చర్య తీసుకోకుండా ఉండాలంటే వారంలోగా తగిన కారణాలను చూపించాలని వారిని విదేశాంగ శాఖ కోరింది. గడువు లోపు సరైన కారణం చూపించని పక్షంలో వీరిద్దరి పాస్‌పోర్టులను పూర్తిగా రద్దు చేస్తామని వెల్లడించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నిర్ణయం మేరకే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని విదేశాంగశాఖ వెల్లడించింది. గురువారం ఈడీ, సీబీఐలు ఈ మేరకు తమకు విజ్ఞప్తులు చేశాయని తెలిపింది. కాగా, విదేశాంగశాఖ నిర్ణయంతో నీరవ్ మోదీ శాశ్వతంగా పరారీలో ఉండాలి, లేదంటే భారత ప్రభుత్వాన్ని సంప్రదించవలసి ఉంటుంది. ప్రస్తుతం ఆయన విదేశాల్లో ఉంటే, అక్కడి భారత దౌత్య కార్యాలయాలను సంప్రదించాలి.

నీరవ్‌మోదీకి ఈడీ సమన్లు..

పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.11,520 కోట్ల కుచ్చుటోపీ పెట్టి దేశం విడిచి పారిపోయిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీపై ఈడీ ఉచ్చు బిగిస్తోంది. పీఎన్‌బీని మోసగించిన ఆరోపణలపై మనీలాండరింగ్ కేసులో విచారణకు హాజరుకావాల్సిందిగా నీరవ్‌కు శుక్రవారం సమన్లు జారీ చేసింది. నీరవ్ వ్యాపార భాగస్వామి అయిన మెహుల్ ఛోక్సికి కూడా ఈడీ సమన్లు పంపింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఈ ఇద్దరికీ సమన్లు పంపిన ఈడీ, వారంలోగా విచారణకు హాజరుకావాలని పేర్కొంది. పీఎన్‌బీ ఫిర్యాదు మేరకు సీబీఐ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా నీరవ్, మెహుల్, తదితరులపై పీఎంఎల్ఏ కేసును ఈడీ రిజిస్టర్ చేసింది. ప్రస్తుతం వీరిద్దరూ దేశంలో లేకపోవడంతో వారి వ్యాపార సంస్థల డైరెక్టర్లకు సమన్లను అందజేశారు. ఇదే కేసులో దేశవ్యాప్తంగా ఉన్న నీరవ్ ఆస్తులు, గీతాంజలి జెమ్స్ షోరూంలపై గురువారం ఈడీ దాడులు చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం కూడా పలుచోట్ల తనిఖీలు నిర్వహించింది. రూ.5,100 కోట్లు విలువచేసే బంగారం, వజ్రాలు, ఇతర ఖరీదైన స్టోన్స్‌ను స్వాధీనం చేసుకుంది. పీఎన్‌బీ నుంచి జనవరి 28న సీబీఐకి ఫిర్యాదు అందగా, 31న సీబీఐ కేసు నమోదు చేసింది.

గీతాంజలి గ్రూప్‌పై తాజా ఎఫ్ఐఆర్..

నీరవ్‌మోదీ బంధువు మెహుల్ చోక్సీ ప్రమోట్ చేసిన గీతాంజలి గ్రూప్‌పై సీబీఐ శుక్రవారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. నీరవ్, మెహుల్ ఆచూకీ కోసం ఈడీ ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించింది. గీతాంజలి గ్రూప్ పీఎన్‌బీని దాదాపు రూ. 4,886 కోట్లు మోసం చేసినట్లు ఆరోపణలున్నాయి. అయితే నీరవ్ మోదీ ప్రస్తుతం న్యూయార్క్‌లో ఉన్నట్లు ఓ ఆంగ్ల చానల్ ప్రకటించింది. న్యూయార్క్‌లోని అత్యంత ఖరీదైన జేడబ్ల్యూ మారియట్స్ ఎస్సెక్స్ హౌస్‌లో ఒక రాత్రికి రూ.1 లక్ష చెల్లిస్తూ, 3 బెడ్‌రూమ్స్ సూట్‌లో ఉంటున్నట్లు తెలిపింది. ఈ సూట్‌ను ఆయన భార్య పేరు మీద తీసుకున్నట్లు ఆ పత్రిక పేర్కొంది.

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఆదాయ మార్గాలను వెల్లడించాల్సిందే

- భార్య, పిల్లల ఆదాయాలను కూడా: సుప్రీం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సుప్రీంకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. ఒకపై ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఆదాయానికి సంబంధించిన మార్గాలను, మూలాలను వెల్లడించాల్సిందేనని స్పష్టం చేసింది. అభ్యర్థి తన భార్యతోపాటు తనపై ఆధారపడిన పిల్లల ఆదాయాలు, వాటికి మూలాలను కూడా వివరించాలని పేర్కొంది. లఖనవ్‌కు చెందిన 'లోక్ ప్రహరీ' అనే ఎన్‌జీవో సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌లో జస్టిస్ చలమేశ్వర్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు శుక్రవారం తీర్పు వెలువరించింది. దేశవ్యాప్తంగా 26 మంది లోక్‌సభ ఎంపీలు, 11 మంది రాజ్యసభ ఎంపీలు, 275 మంది రాష్ట్రాల చట్టసభ సభ్యుల ఆదాయాలు గణనీయంగా పెరిగాయని తన పిటిషన్‌లో పేర్కొంది. నామినేషన్లు వేసే సమయంలో అభ్యర్థులంతా తమది, తమ కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలను చెబుతున్నారుగానీ.. ఆదాయ వనరులను మాత్రం చూపడంలేదని ఆ సంస్థ కోర్టు దృష్టికి తీసుకువచ్చింది. దీనిని విచారించిన కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేయడానికి నామినేషన్లను దాఖలు చేసినపుడే ఈ వివరాలను సమర్పించాలని కోర్టు స్పష్టం చేసింది. ఈ మధ్య కాలంలో అభ్యర్థుల ఆస్తులు గణనీయంగా పెరిగిపోతున్నా.. ప్రభుత్వం ఆ విషయంలో ఎందుకు విచారణ చేపట్టడం లేదని కోర్టు ప్రశ్నించింది. కాగా, ఈ కేసు విచారణ సందర్భంగా కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) కూడా తన వాదనలు వినిపించింది. ఏడుగురు ఎంపీలు, 98 మంది ఎమ్మెల్యేల ఆస్తులు అనుమానాస్పద రీతిలో పెరిగాయని, దీనిపై విచారిస్తున్నామని కోర్టుకు వెల్లడించింది. ఈ మేరకు ఆదాయపన్ను శాఖ అధికారులు ప్రాథమిక దర్యాప్తు కూడా ప్రారంభించారని తెలిపింది. ప్రస్తుతమున్న నిబంధనల మేరకు అభ్యర్థులు తమ ఆస్తులు-అప్పుల వివరాలను తెలిపితే సరిపోతుంది. కానీ అభ్యర్థి తన భార్య, తనపై ఆధారపడిన పిల్లల ఆస్తులు-అప్పులు, వాటి మూలాలను వెల్లడించాల్సిన అవసరం లేదు. గతంలో ఎన్నికల సంఘం కూడా అభ్యర్థుల ఆదాయ వనరు చూపించడం తప్పనిసరి చేయాలంటూ జనవరిలో కోర్టును అభ్యర్థించింది.

18 మందిని చంపి.. ఆవుల మంద చోరీ

- నైజీరియాలో దుర్ఘటన

లాగోస్, ఫిబ్రవరి 16: ఆవుల మంద చోరీ చేసేందుకు బందిపోటు దొంగలు 18 మంది ప్రాణాలను పొట్టనబెట్టుకున్నారు. నైజీరియాలోని వాయవ్య ప్రాంతంలో గల జమ్ఫారా రాష్ట్రంలో శుక్రవారం ఈ దుర్ఘటన జరిగింది. ఇక్కడి బిరానీ గ్రామంలోని రైతులపై కొంత మంది బందిపోటు దొంగలు అకస్మాత్తుగా దాడికి దిగారు. ఆవుల మందను చోరీ చేసేందుకు తుపాకులతో కాల్పులకు జరిపారు. ఈ ఘటనలో 18 మంది మరణించారని జమ్ఫారా పోలీసులు తెలిపారు. అయితే స్థానిక మీడియా మృతుల సంఖ్య 40 మంది వరకు ఉండొచ్చని చెబుతోంది. గడిచిన 46 రోజుల్లోనే ఈ తరహా దాడుల్లో 168 మంది మరణించినట్లు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ పేర్కొంది. అలాగే వాయవ్య నైజీరియాలోని ఐదు రాష్ట్రాల్లో ఇటువంటి దాడులు ఎక్కువగా జరుగుతుండడంతో వేల మంది రైతులు తమ ఊర్లు విడిచి వలస వెళ్లిపోయారని తెలిపింది.



ప్రధానిని కాదు.. మీ దోస్తుని

- ఇవాళ నేను విద్యార్థిని.. మీరు పరీక్ష పెట్టండి
- 'పరీక్షా పే చర్చ'లో ప్రధాని నరేంద్ర మోదీ
- 10, 12 తరగతుల విద్యార్థులతో ముఖాముఖి
- పరీక్షల్లో ఒత్తిడిని జయించడానికి సలహాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: 'ఈ రోజు నన్ను దేశ ప్రధానమంత్రిగా చూడకండి. మీ స్నేహితుడిలా అనుకోండి' అంటూ తానూ ఓ విద్యార్థిలా మారిపోయారు ప్రధాని నరేంద్ర మోదీ. పరీక్షల ఒత్తిడిని ఎలా జయించాలనే దానిపై త్వరలో బోర్డు పరీక్షలు రాయనున్న 10, 12 తరగతి విద్యార్థులతో ఆయన శుక్రవారం ఢిల్లీలోని తల్కోతోరా స్టేడియంలో 'పరీక్షా పే చర్చ' పేరుతో ముఖాముఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వందల మంది విద్యార్థుల ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. అలాగే దేశవ్యాప్తంగా వేలాది విద్యార్థుల నుంచి పీఎంవోకు వచ్చిన ప్రశ్నలకూ ఆయన వివరంగా సమాధానాలిచ్చారు. 'పరీక్షా పే చర్చ' కార్యక్రమాన్ని మొదలు పెడుతూ ప్రధాని మోదీ... 'ఈ రోజు నేను విద్యార్థిని.. మీరు నాకు పరీక్ష పెట్టండి. ఎగ్జామినర్లుగా 10 మార్కులకు నాకు ఎన్ని మార్కులు ఇస్తారో తర్వాత చెప్పండి' అని విద్యార్థులకు చెప్పారు. ప్రధానితో మాట్లాడుతున్నట్లుగా కాకుండా మీ మిత్రుడిలా భావించి మాట్లాడాలని సూచించారు. 'మీరు పరీక్ష రాయడానికి కూర్చున్నప్పుడు మీ ధ్యాస అంతా పరీక్ష మీదే ఉండాలి. మీ భవిష్యత్‌ను నిర్ణయించేది మీరే.. ఇతరులు కాదు. మనం సాధారణంగా చదువుల సరస్వతిని తలుచుకుంటాం. కానీ పరీక్షల సమయం వచ్చేసరికి మాత్రం హనుమాన్‌ను తలుచుకుంటాం. ఎందుకంటే భయం. కానీ మనం దాన్ని అధిగమించాలి. ఆత్మవిశ్వాసం ఉంటే మీకు ఎటువంటి కష్టం వచ్చినా దాన్ని సులభంగా అధిగమించగలరు' అని మోదీ పేర్కొన్నారు. చదువు మీద ఏకాగ్రత ఉండాలంటే ఏం చేయాలని ఓ విద్యార్థి ప్రశ్నించగా.. ఏకాగ్రత అనేది ప్రత్యేకంగా నేర్చుకునేది కాదని, ప్రతిఒక్కరూ ఏదో ఒక దాని మీద తమ మనసును నిత్యం లగ్నం చేస్తుంటారని మోదీ చెప్పారు. అది చదవడం, పాటలు వినడం, స్నేహితులతో మాట్లాడటం ఇలా ఏదైనా కావచ్చునని అన్నారు.

అభివృద్ధి.. పర్యావరణం! ఈ రెండూ ముఖ్యమే.. ప్రకృతిని గౌరవిస్తాం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: భారత్ అభివృద్ధిలో ముందుకు దూసుకుపోవాలని భావిస్తుందని, అదే సమయంలో పర్యావరణ పరిరక్షణకూ కట్టుబడి ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. అయితే ఇతర దేశాలూ పర్యావరణాన్ని కాపాడుకోవడంలో వాటి బాధ్యతను తప్పక నెరవేర్చాలని ఆయన అన్నారు. దీన్ని ప్రపంచం జీర్ణించుకోలేని నిజంగా భావిస్తూ చర్చల్లో ఉన్న సమయంలోనే భారత్ మార్పు దిశగా క్రియాశీల అడుగులేసిందన్నారు. ఢిల్లీలో జరుగుతున్న ప్రపంచ సుస్థిర అభివృద్ధి సదస్సులో శుక్రవారం ఆయన ప్రసంగించారు. ప్రకృతిని గౌరవించడం భారత సంస్కృతిలో భాగమని, భారతీయులు భూమిని తల్లిగా భావిస్తారని చెప్పారు. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి మా బాధ్యతను పూర్తిస్థాయిలో నిర్వర్తిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో ఇతర దేశాలు కూడా కలిసి ఉమ్మడిగా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. 2015లో పారిస్‌లో జరిగిన పర్యావరణ ఒప్పందానికి కట్టుబడి ఉంటామని అన్ని దేశాలు పేర్కొన్నాయని ఆయన గుర్తు చేశారు.


జన్మదిన శుభాకాంక్షలు
తెలంగాణ రాష్ట్ర ఉద్యమ రథసారథి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సుదీర్ఘంగా సాగిన ఉద్యమానికి కొత్త ఊపిరులూది, అసాధారణ దీక్షాదక్షలతో తెలంగాణ ప్రజలందరిని ఏకం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కార్యసాధకుడు కేసిఆర్. ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ ప్రజల సుదీర్ఘ స్వప్నాన్ని సాకారం చేసిన దీక్షాదక్షుడు మన కేసిఆర్. రాష్ట్ర సాదనతో తృప్తి చెందక, రాష్ట్ర సాధనలో ప్రాణత్యాగం చేసిన ఉద్యమ, అమరవీరుల భవిష్యత్తు కలలను సాధించటం కోసం నిరంతరం శ్రమిస్తున్న కృషీవలుడు మన కేసిఆర్, ముఖ్యమంత్రిగా నిరంతరం పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం పరితపిస్తూ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ప్రజల ముఖ్యమంత్రి మన కేసిఆర్. బంగారు తెలంగాణ ఆవిష్కరణనే తన ఏకైక లక్ష్యంగా పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి కేసిఆర్. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా, భారీ నీటి ప్రాజెక్టుల నిర్మాణం, మిషన్ భగీరథ వంటి కార్యక్రమాలతో దేశంలోనే నెంబర్ 1 ముఖ్యమంత్రిగా గుర్తింపు తెచ్చుకుని, సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టిన నిత్య కార్యశీలి మన ముఖ్యమంత్రి కేసిఆర్, తెలంగాణ ప్రజల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేస్తూ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా సుపరిపాలన సాగిస్తున్న మన ముఖ్యమంత్రి కేసిఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఇటువంటి పుట్టిన రోజులు మరిన్ని జరుపుకోవాలని, తెలంగాణ ముఖ్యమంత్రిగా చిరకాలం వర్ధిల్లాలని మనస్సు పూర్తిగా కోరుకుంటూ
కేసిఆర్ ఆశీస్సులను ఆకాంక్షిస్తూ...
తెలంగాణ రాష్ట్ర ప్రధాత, జన హృదయ నేత బడుగు,
బలహీన వర్గాల ఆశాజ్యోతి, ముఖ్యమంత్రి
శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి
హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు
మీ
శ్రీ మాధవరం కృష్ణారావు
శాసనసభ్యులు,
కూకట్‌పల్లి నియోజకవర్గం

మనం స్పోర్ట్స్
శనివారం 17 ఫిబ్రవరి 2018
www.manamnews.com

ధోనికి రైనా సలహా



న్యూఢిల్లీ: భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనికి సహచర క్రికెటర్ సురేశ్ రైనా సలహా ఇచ్చాడు. ధోని మరింత రాణించాలంటే తన బ్యాటింగ్ ఆర్డర్‌ను మార్చుకోవాలని సూచించాడు. ఒకవేళ ధోని బ్యాటింగ్ ఆర్డర్‌ను మార్చుకుంటే మాత్రం మరిన్ని విలువైన పరుగులతో జట్టు విజయాలకు ఉపయోగపడతాడని రైనా అభిప్రాయపడ్డాడు. ' ధోని ఎక్కువ సేపు క్రీజ్‌లో ఉండి హిట్టింగ్ చేయాలంటే మాత్రం అతను బ్యాటింగ్ ఆర్డర్ ముందుకు రావాలి. అప్పుడు జట్టు మరింత పటిష్టంగా మారుతుంది. ధోనిలాంటి ఒక విలువైన ఆటగాడి సేవలు జట్టుకు చాలా అవసరం'అని రైనా పేర్కొన్నాడు. ధోని ఎక్కువగా ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు దిగుతూ మ్యాచ్ ఫినిషర్‌గా గుర్తింపు తెచ్చుకున్న సంగతి తెలిసిందే. దక్షిణాఫ్రికాతో జరిగే టీ 20 సిరీస్‌కు రైనా ఎంపికైన నేపథ్యంలో మరోసారి తెరపైకి వచ్చాడు. గత కొంతకాలంగా జట్టుకు దూరమైన రైనా.. ఈసారి వచ్చిన అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని చూస్తున్నాడు. మిడిల్ ఆర్డర్‌లో తన బ్యాటింగ్‌తో సత్తా చాటి జట్టులో స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలని యోచిస్తున్నాడు. ఫిబ్రవరి 18 నుంచి దక్షిణాఫ్రికా-భారత జట్ల మధ్య మూడు టీ 20ల సిరీస్ ఆరంభం కానుంది.



కోహ్లి గంగూలీకు అప్‌గ్రేడెడ్ వర్షన్

వీరేంద్ర సెహ్వాగ్

ముంబై : దశాబ్దాల తర్వాత సఫారీ గడ్డపై వన్డే సిరీస్ విజయం సాధించటంతో టీమి ండియా కెప్టెన్ విరాట్ కోహ్లిపై ప్రశంసలు కురుస్తున్నాయి. టీమిండియా మాజీ ఆటగాడు వీరేంద్ర సెహ్వాగ్ కూడా కోహ్లిని ఆకాశానికెత్తేస్తున్నాడు. కోహ్లి.. మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీకి అప్‌గ్రేడెడ్ వర్షన్ లాంటోడని పొగడ్తలు గుప్పించాడు. కోహ్లి కెప్టెన్సీలోని భారత జట్టు విజయాలమీద విజయాలు సాధిస్తూ ఎదురులేకుండా దూసెకెళ్లి పోతున్నది. గత 8 సిరీస్‌లను గనుక గమనిస్తే.. టీమిండియా స్వదేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా విజయాలను నమోదు చేసుకుంటు సిరీస్‌లను సొంతం చేసుకుంటూ పోతుంది. దీంతో మిగతా దేశాల కెప్టెన్‌లతో పోలిస్తే కోహ్లినే ఉత్తమ సారథిగా మనకు కనిపిస్తాడు. గతంలో గంగూలీ సారథ్యంలో కూడా టీమిండియా ఇలానే దూకుడు చూపించేది. ముఖ్యంగా విదేశీ గడ్డలపై జట్టు మంచి విజయాలను సాధించింది. అలాగని గతంలోని అత్యుత్తమ కెప్టెన్‌లతో అతని పోల్చటం సరికాదు. వారి స్థాయిని అందుకోవటానికి అతనికి మరింత అనుభవం, విజయాలు అవసరం' అని సెహ్వాగ్ అభిప్రాయపడ్డారు. కెప్టెన్సీతో కోహ్లిలో ఆత్మవిశ్వాసం మరింతగా పెరిగిందని.. ఎలాంటి ఒత్తిడి లేకుండా సమర్థవంతంగా తన బాధ్యతలను నిర్వహిస్తున్నాడని, అన్నింటికన్నా ముఖ్యంగా అతని ఆట మరింతగా మెరుగుపడిందని సెహ్వాగ్ చెబుతున్నాడు. ప్రస్తుతం టీమిండియా బౌలింగ్ లైనప్ అద్భుతంగా ఉందన్న వీరూ.. ఎప్పుడైతే బౌలర్లు మెరుగ్గా రాణించలేకపోతారో అప్పుడే కోహ్లి పతనం ప్రారంభమవుతుందని హెచ్చరిస్తున్నాడు. త్వరలో ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా పర్యటనలు ఉన్న నేపథ్యంలో అద్భుత ప్రదర్శన ఇవ్వాలంటూ టీమిండియాకు ఆల్ ది బెస్ట్ చెప్పాడు.


మిథాలీ రాజ్

'మా టార్గెట్ ప్రపంచకప్'

భారత మహిళా పేసర్ ఝులన్ గోస్వామి



ముంబై : ప్రపంచకప్ సాధించడమే తమ టార్గెటని, ఇదే తమ అంతిమ లక్ష్యమని భారత మహిళా పేసర్ ఝులన్ గోస్వామి అభిప్రాయపడ్డారు. కాలి మడమ గాయంతో ఆమె దక్షిణాఫ్రికా పర్యటన నుంచి అర్ధాంతరంగా తిరుగొచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు మహిళల జట్టు ప్రపంచకప్ గెలువలేదు. గతేడాది అడుగుదూరంలో కప్‌ను చేజార్చుకున్న భారత అమ్మాయిలకు ఈ ఏడాది నవంబర్‌లో టీ20 ప్రపంచకప్ రూపంలో మరో అవకాశం రానుంది. ఈ నేపథ్యంలో గోస్వామి మాట్లాడుతూ.. టీ20 ప్రపంచకప్ కసరత్తు దక్షిణాఫ్రికా పర్యటనతోనే మొదలైంది. ఇంకా సుమారు ఏడాది సమయం ఉండగా కసరత్తు మొదలు పెట్టడం మంచి పరిణామం. ఈ వ్యవధిలో భారత మహిళలు బీజీ షెడ్యూలతో రాటు దేలుతారు. భారత్‌లో ఆస్ట్రేలియాతో, ఇంగ్లండ్‌లో ట్రై టీ20 సిరీస్ ప్రపంచకప్ సన్నహాకానికి ఉపయోగపడుతాయి. ఒక వేళ ప్రపంచకప్ గెలిస్తే మా కల నెరవేరినట్లే. నా కెరీర్ ప్రారంభించినప్పుడే ప్రపంచకప్ గెలవాలనే కోరిక నా మెదడులో నాటుకుపోయింది. నాలుగేళ్ల కోసారి వచ్చే ఈ టోర్నీ గెలుపు ఒలింపిక్ బంగారు పతకంతో సమానం. టీ20 ప్రపంచకప్ టోర్నీ సెమీస్‌కు వెళ్లడమే మా లక్ష్యమైనప్పటికీ, అంతిమ లక్ష్యం మాత్రం ప్రపంచకప్ సాధించడమే.' అని భారత సీనియర్ మహిళ క్రీడాకారిణి గోస్వామి తెలిపింది.

సచిన్ స్ఫూర్తి వల్లే గెలిచాం..

దక్షిణాఫ్రికాలో వన్డే సిరీస్ గెలవడంపై స్పందిస్తూ.. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ కలిగించిన స్ఫూర్తే విజయానికి కారణమని గోస్వామి అభిప్రాయపడ్డారు. అక్కడికి వెళ్లే ముందు సచిన్ మహిళా క్రికెటర్లతో మాట్లాడాడని తెలిపారు. అక్కడి పిచ్‌లపై అనుసరించాల్సిన వ్యూహాలు, పరిస్థితులపై అవగాహన కల్పించారని, జట్టులోని ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపారని గోస్వామి చెప్పుకొచ్చారు. బీజీ షెడ్యూల్ ఏర్పాటు చేయడంలో బీసీసీఐ కృషి కూడా ఎంతో ఉందని ఆమె తెలిపింది. డిఫెండింగ్ చాంపియన్ అయిన వెస్టిండీస్‌లో ఈ ఏడాది నవంబర్ 9 నుంచి 24 వరకు మహిళల టీ20 ప్రపంచకప్ జరగనుంది. గోస్వామి 200 వికెట్లు పడగొట్టిన తొలి మహిళ బౌలర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఆమె గాయంతో దక్షిణాఫ్రికా పర్యటన టీ20 సిరీస్ నుంచి దూరమయ్యారు. రెండు మూడు వారాల విశ్రాంతి తర్వాత మార్చిలో ఆస్ట్రేలియాతో బరిలోకి దిగనున్నారు.

మహిళల హవా

రెండో టీ-20లోనూ దక్షిణాఫ్రికాపై గెలుపు | రాణించిన మిథాలీ, మంధాన | 2-0తో అధిక్యం

ఈస్ట్ లండన్: దక్షిణాఫ్రికా గడ్డపై భారత మహిళల హవా కొనసాగుతుంది. వన్డే సిరీస్‌ను సొంతం చేసుకున్న భారత మహిళల క్రికెట్ జట్టు ట్వంటీ-20 సిరీస్ లోనూ తమ సత్తా చాటుతోంది. శుక్రవారం జరిగిన రెండో టీ20లోనూ సఫారీలపై హర్మన్ ప్రీత్ కౌర్ సేన 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈస్ట్ లండన్‌లో బఫెలో పార్క్ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 142/7 పరుగులు చేసింది. సఫారీ జట్టులో లూస్ (32 బంతుల్లో 33), డే క్లెర్క్ (28 బంతుల్లో 26) పరుగులు చేశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన భారత జట్టులో ఓపెనర్లు స్మృతీ మంధాన (57), మిథాలీ రాజ్ (76 నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించడంతో భారత్ 9 వికెట్లతో ఘన విజయం సాధించింది. వరుసగా రెండో విజయంతో ఐదు టీ20ల సిరీస్‌లో 2-0తో భారత్ ఆధిక్యంలో నిలిచింది. శుక్రవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా జట్టు 29 పరుగుల వద్దే తొలి వికెట్‌ను కోల్పోయింది. ఓపెనర్ లీ 12 బంతుల్లో 3 ఫోర్లతో 15 పరుగులు చేసి వెనుదిరిగింది. తర్వాత కెప్టెన్ డేన్ వాన్ నికెర్క్(15) కూడా పెవిలియన్ బాట పట్టింది. భారత బౌలర్లు మంచి లైన్ అండ్ లెన్త్‌తో బౌలింగ్ చేయడంతో సఫారీ బ్యాట్స్‌వుమెన్ పరుగులు చేయడంలో ఇబ్బంది పడ్డారు. మరోవైపు వరుస క్రమంలో వికెట్లు కోల్పోవడంతో వీరి రన్ రేట్ కూడా నెమ్మదిగైంది. సఫారీ జట్టులో లూస్ (32 బంతుల్లో 2 ఫోర్ల)తో 33 పరుగులు , డే క్లెర్క్ (28 బంతుల్లో 1 ఫోర్)తో 26 పరుగులు తప్ప మిగతా బ్యాట్స్‌వుమెన్ ఘోరంగా విఫలమయ్యారు. చివర్లో ట్రయాన్ (11 బంతుల్లో 15), ఇస్మాయిల్ (9 బంతుల్లో 16) వేగం పెంచడంతో సఫారీ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 142 పరుగులు చేసింది. భారత బౌలర్లలో పూనం యాదవ్, పాటిల్ చెరో రెండు వికెట్లు తీశారు. శిఖా పాండే, వస్త్రాకర్‌లకు తలో వికెట్ దక్కింది. అనంతరం 143 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియాకు మహిళా ఓపెనర్లు మిథాలీ రాజ్, స్మృతీ మంధాన సెంచరీ భాగస్వామ్యాన్ని అందించారు. మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడుతు వీరిద్దరూ ప్రత్యర్థి బౌలర్లపై విరుచుక పడ్డారు. ఇద్దరూ పోటీ పడి పరుగులు సాధించడంతో భారత్ వేగంగా విజయం వైపు పయాణించింది. విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడిన మంధాన 37 బంతుల్లోనే 4 ఫోర్లు, 3 సిక్సర్లతో అర్ధ శతకం పూర్తి చేసుకుంది.


మంధాన

అయితే స్మృతీ మంధాన (42 బంతుల్లో 57: 4 ఫోర్లు, 3 సిక్సర్లు) హాఫ్ సెంచరీ సాధించింది. ఈ క్రమంలోనే 80 బంతుల్లో 100 పరుగులు పూర్తి చేసుకున్న ఈ జంట చివరికి 106 వద్ద తొలి వికెట్ కోల్పోయింది. విధ్వంసకర బ్యాటింగ్ చేసిన మంధాన (57) పరుగులు చేసి వెనుదిరిగింది. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్‌తో మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ భారత్‌ను విజయతీరానికి చేర్చింది. కీలక ఇన్నింగ్స్ ఆడిన మిథాలీ 48 బంతుల్లో హాఫ్ సెంచరీ నమోదు చేసుకుంది. అనంతరం అజేయంగా భారత్‌ను విజయానందించింది. చెలరేగి ఆడిన మిథాలీ (61 బంతుల్లో 8 ఫోర్లతో 76 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (7 నాటౌట్)తో కలిసి మరో ఐదు బంతులుండగానే జట్టుకు భారీ విజయానందించింది. దీంతో భారత జట్టు (19.1 ఓవర్లలో) 144/1 స్కోరు చేసింది. అసాధరణ ఆటతో రాణిస్తున్న మిథాలీ రాజ్ సిరీస్‌లో వరుసగా రెండో హాఫ్ సెంచరీ సాధించింది. మిథాలీకి టి20ల్లో ఇది 12వ అర్ధసెంచరీ. తొలి టీ20లోనూ మిథాలీ రాజ్ (54 నాటౌట్) అజేయంగా నిలవడంతో భారత్ 7 వికెట్ల తేడాతో గెలుపొందిన విషయం తెలిసిందే.

టీ20 చరిత్రలో కొత్త రికార్డు

విండీస్ రికార్డు బ్రేక్ చేసిన ఆస్ట్రేలియా • 5 వికెట్లతో కివీస్ చిత్తు • ట్రై సిరీస్ టీ20 టోర్నీ



ఆక్లాండ్: టీ20 చరిత్రలో ఆస్ట్రేలియా కొత్త రికార్డును నమోదు చేసింది. న్యూజిలాండ్‌పై అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా ఛేదించి చరిత్ర సృష్టించింది. రికార్డ్ ఛేజింగ్‌ను ఆస్ట్రేలియా సాధ్యం చేసింది. ఆస్ట్రేలియా-న్యూజిలాండ్‌ల మధ్య జరిగిన టీ20 మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన కివీస్ 6 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. అనంతరం భారీ పరగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 5 వికెట్లు కోల్పోయి మరో ఏడు బంతులుండగానే 245 పరుగులు చేసి అలవోకగా ఛేదించి ఆసీస్ జట్టు ట్వంటీ20ల కొత్త చరిత్ర సృష్టించింది.

విండీస్ రికార్డు బ్రేక్..

గతంలో ఈ ఛేజింగ్ రికార్డు వెస్టిండీస్ పేరిట ఉండేది. దక్షిణాఫ్రికాపై 231 పరుగుల లక్ష్యాన్ని విండీస్ 19.2 ఓవర్లలో ఛేదించింది. కాగా నేడు కివీస్‌తో జరిగిన టీ20లో ఆసీస్ జట్టు 243 పరగుల లక్ష్యాన్ని ఛేదించి ఈ రికార్డును బ్రేక్ చేసింది. 2015లో జొహన్నెస్‌బర్గ్‌లో దక్షిణాఫ్రికా నిర్దేశించిన 231 పరుగుల లక్ష్యాన్ని 6 వికెట్లు కోల్పోయి 236 పరుగులు చేసిన విండీస్ మరో నాలుగు బంతులు మిగిలుండగానే విజయం సాధించింది.శుక్రవారం ఇక్కడ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్‌కు ఓపెనర్లు ఓపెనర్లు గుప్టిల్, మున్రో విధ్వంసర ఆరంభాన్ని అందించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు (10.4 ఓవర్లలో) 132 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అనంతరం చెలరేగి ఆడుతున్న మున్రో (33 బంతుల్లో 6ఫోర్లు, 6 సిక్సర్లు)తో 76 పరుగులు చేసి ఔటయ్యాడు. అనంతరం మరో విధ్వంసకర బ్యాట్స్‌మన్ మార్టిన్ గుప్టిల్ (54 బంతుల్లోనే 6ఫోర్లు, 9 సిక్సర్లు)తో 105 శతకం బాది చివరికి వెనుదిరిగాడు. దీంతో కివీస్ జట్టు నిర్ణీత 20ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 243 పరుగులు చేసి ఆసీస్ ముందు భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఆసీస్ బౌలర్లలో రిచర్డ్‌సన్, టైకు చెరో రెండు వికెట్లు దక్కాయి. అనంతరం 244 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్‌కు ఓపెనర్లు డేవిడ్ వార్నర్ (24 బంతుల్లో 59: 4ఫోర్లు, 5 సిక్సర్లు), షార్ట్ (44 బంతుల్లో 76: 8ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధశతకాలతో రాణించి తొలి వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యం అందించారు. 121 పరుగుల వద్ద కెప్టెన్ డేవిడ్ వార్నర్ (59) సౌథీ బౌలింగ్‌లో క్లీన్ బోల్డ్‌గా వెనుదిరిగాడు. తర్వాత క్రిస్ లిన్ (10 బంతుల్లో 18), మాక్స్‌వెల్ (14 బంతుల్లో 31: 3ఫోర్లు, 2 సిక్సర్లు)తో కలిసి షార్ట్ ఆసీస్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. చివర్లో అరోన్ ఫించ్ (14 బంతుల్లో 36: 3ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుపు ఇన్నింగ్స్‌తో తమ జట్టును 18.5 ఓవర్లలో మరో 7 బంతులుండగానే (245/5) స్కోరుతో విజయ తీరానికి చేర్చాడు.

రెండు రికార్డులు బద్దలు కొట్టిన గుప్టిల్



ఆక్లాండ్: ఆసీస్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ స్టార్ ఓపెనర్ మార్టిన్ గుప్టిల్ రెండు రికార్డులను బద్దలు కొట్టాడు. అంతర్జాతీయ ట్వంటీ 20ల్లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా, కివీస్ తరపున ఫాస్టెస్ సెంచరీ సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఈ క్రమంలోనే కివీస్‌కే చెందిన బ్రెండన్ మెకల్లమ్ రికార్డును గుప్టిల్ బద్దలు కొట్టాడు. ముక్కోణపు సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో గుప్టిల్ ఈ మార్కును చేరాడు. 54 బంతుల్లో 6 ఫోర్లు, 9 సిక్సర్లతో 105 పరుగులు సాధించడంతో టీ 20ల్లో అత్యధిక పరుగులు నమోదు చేసిన టాప్ ఆటగాడిగా గుప్టిల్ రికార్డు సొంతం చేసుకున్నాడు. అంతకుముందు మెకల్లమ్ పేరిట ఉన్న అత్యధిక పరుగుల రికార్డును అధిగమించాడు. మెకల్లమ్ (2140)ను రెండో స్థానంలో నెట్టి.. గుప్టిల్ (2188) అగ్ర స్థానంలో చేరుకున్నాడు. భారత స్టార్ బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లి (1,956) మూడో స్థానంలో నిలిచాడు. కాగా, మెకల్లమ్ పేరిట ఉన్న మరో రికార్డును కూడా గుప్టిల్ బ్రేక్ చేశాడు. న్యూజిలాండ్ తరపున వేగవంతంగా టీ 20 సెంచరీ నమోదు చేసిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. 49 బంతుల్లో శతకం సాధించడం ద్వారా మెకల్లమ్ రికార్డును గుప్టిల్ సవరించాడు. అంతకుముందు న్యూజిలాండ్ తరపున వేగవంతమైన ట్వంటీ 20 సెంచరీని మెకల్లమ్(50 బంతుల్లో) పేరిట ఉంది.

కోహ్లి 'వంద' పట్టేశాడు!

సెంచూరియన్: భారత క్రికెట్ కెప్టెన్ విరాట్ కోహ్లి మరో అరుదైన క్లబ్‌లో చేరిపోయాడు. దక్షిణాఫ్రికాతో చివరిదైన ఆరో వన్డేలో సెంచరీ క్యాచ్‌ల మార్కును చేరాడు. తాజా వన్డేలో రెండు అద్భుతమైన క్యాచ్‌లను పట్టిన కోహ్లి.. వన్డేల్లో వంద క్యాచ్‌లను పూర్తి చేసుకున్నాడు. తద్వారా భారత తరపున అత్యధిక క్యాచ్‌లను పట్టిన నాల్గో ఫీల్డర్‌గా సురేశ్ రైనా సరసన చేరాడు. అయితే 208 వన్డేల్లో కోహ్లి వంద క్యాచ్‌లను పట్టడం ఇక్కడ విశేషం. ఈ రోజు మ్యాచ్‌లో క్లాసెన్, తాహీర్ క్యాచ్‌లను కోహ్లి అందుకున్నాడు. ఈ రెండు క్యాచ్‌లను బూమ్రా బౌలింగ్‌లోనే షార్ట్ కవర్‌లో ఫీల్డింగ్ చేస్తూ కోహ్లి పట్టుకున్నాడు.


భారత్-దక్షిణాఫ్రికా ఆరో వన్డే

చెలరేగిన శార్దూల్

సెంచూరియన్: ఇప్పటికే సిరీస్ సొంతం చేసుకున్న కోహ్లీ సేనా చివరి వన్డేలోనూ దూకుడుగా ఆడుతోంది. బ్యాటింగ్-బౌలింగ్ రెండు విభాగాల్లోనూ టీమిండియా మెరుగ్గా రాణించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత బౌలర్లు మరో సారి తమ సత్తా చాటారు. ఆథిత్య జట్టును చివిరి 6వ వన్డేలోనూ తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. శార్దూల్ ఠాకూర్ అద్భుత బౌలింగ్‌తో 4 వికెట్లు కూలగొట్టి తన కెరీర్‌లో అత్యుత్తమ గుణాంకాలు నమోదు చేసుకున్నాడు. వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకున్నాడు. మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా జట్టు (46.5 ఓవర్లలో) 204 పరుగులకు కుప్పకూలింది. దక్షిణాఫ్రికా ఆటగాళ్లలో జాండో(54), ఫెహ్లు కోహియో (34)లు మినహా మిగతా వారు ఆశించిన స్థాయిలో ఆడలేదు. భారత బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ నాలుగు వికెట్లు పడగొట్టగా, చాహల్, బుమ్రాలు చెరో రెండు వికెట్లు తీశారు. పాండ్యా, కుల్దీప్‌లకు తలో వికెట్ దక్కింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన భారత జట్టు కడపటి వార్తలందేసరికి 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. ఓపెనర్లు శిఖర్ ధావన్ (18), రోహిత్ శర్మ (15) పరుగులు చేసి ఔటయ్యారు. శుక్రవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను మర్‌క్రామ్, హషీమ్ ఆమ్లాలు ఆరంభించారు. అయితే ఈ సారి సఫారీలకు శుభారంభం లభించలేదు జట్టు స్కోరు 23 పరుగుల వద్ద ఆమ్లా(10) తొలి వికెట్‌గా పెవిలియన్ చేరాడు.ఆపై మరో 20 పరుగుల వ్యవధిలో మర్‌క్రామ్ (24) కూడా అవుట్ అయ్యాడు. ఆ తరుణంలో డివిలియర్స్-జాండో జోడి ఇన్నింగ్స్‌ను నడిపించే బాధ్యతను తీసుకున్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు కీలకమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ జట్టు స్కోరుబోర్డును ముందుకు సాగించారు. వీరూ మూడో వికెట్‌కు 62 పరుగుల జోడించిన తరువాత డివీలియర్స్ 34 బంతుల్లో (30) మూడో వికెట్‌గా పెవిలియన్ బాటపట్టాడు. స్పిన్నర్ చాహల్ వేసిన బంతిని కట్ చేయబోయిన డివీలియర్స్ బౌల్డ్ అయ్యాడు. అనంతరం జట్టు స్కోరు 135 పరుగుల వద్ద క్లాసెన్(22) కూడా నిష్క్రమించాడు. బూమ్రా బౌలింగ్‌లో కోహ్లి అద్భుతమైన క్యాచ్ పట్టడటంతో క్లాసెన్ భారంగా మైదానాన్ని వీడాడు. భారత బౌలర్లు చెలరేగడంతో 16 పరుగుల వ్యవధిలోనే దక్షిణాఫ్రికా నాలుగు వికెట్లను కోల్పోయింది.



దీంతో సఫారీ స్కోరు మందగించింది. అర్ధ శతకంతో కీలక ఇన్నింగ్స్ ఆడుతున్న జాండో 74 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 54 పరుగులు చేసి చాహల్ బౌలింగ్‌లో 7వ వికెట్‌గా ఔటయ్యాడు. చివర్లో మోర్నీమెర్కెల్ (20)-పెహ్లుకోహియో జోడి దూకుడుగా ఆడే యత్నం చేసింది. ఈ జోడి 36 పరుగుల జోడించిన తర్వాత మోర్కెల్ ఎనిమిదో వికెట్‌గా పెవిలియన్ చేరగా, ఆపై వెంటనే తాహీర్(2) కూడా అవుటయ్యాడు. అయితే ఫెహ్లుకోహియో బ్యాట్‌ను ఝుళిపించి దక్షిణాఫ్రికా స్కోరును 200 దాటించాడు. శార్దూల్ ఠాకూర్ వేసిన 47 ఓవర్‌లో వరుసగా రెండు సిక్సర్లు కొట్టాడు. అయితే అదే ఓవర్ ఐదో బంతికి శార్దూల్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి ఫెహ్లుకోహియో చివరి వికెట్‌గా పెవిలియన్ చేరడంతో సఫారీల ఇన్నింగ్స్ ముగిసింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.